RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




28 నవంబర్ 2024 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:152

# ఆఫీసర్స్ బీ అలర్ట్...!

**విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు**

**కొత్తగూడెం జిల్లా అధికారులకు మంత్రి పొంగులేటి స్వీట్ వార్నింగ్**

**పలు శాఖల అధికారుల పనితీరు పై ఫిర్యాదులొస్తున్నాయ్**

**పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరిక**

**సీఎస్ఆర్ నిధులు నిర్వీర్యం కాకుండా సీపీవో బాధ్యతయుతంగా వ్యవహరించాలి**

**పంచాయతీ సెక్రటరీలపై డీపీవో ఎమ్మార్వోలపై ఆర్డీవో పర్యవేక్షణ తప్పనిసరి**

**అన్ని శాఖల అధికారులను అడిషనల్ కలెక్టర్ సమన్వయం చేసుకోవాలి**

**కొత్తగూడెం జిల్లా అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి నవంబర్ 27 (ప్రజాబలం)** కొత్తగూడెం తెలంగాణ రెవెన్యూ గృహనిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కొత్తగూడెం జిల్లా అధికారులపై ఫైర్ అయ్యారు. కొత్తగూడెం జిల్లా పర్యటనకు బుధవారం వచ్చిన ఆయన అప్పటికప్పుడు పలు శాఖల అధికారులతో చుంచుపల్లిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై వేటు తప్పదని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడంలో, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలుంటాయన్నారు. పలు శాఖల అధికారులపై ఫిర్యాదులొస్తున్నాయని, అవి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సీఎస్ఆర్ ద్వారా వచ్చే నిధులు నిర్వీర్యం అవుతున్నట్లు తన దృష్టికి వచ్చింద వాటిని మంచి పనులకు

మిగతా 2లో

# వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

## రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 26 :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రిఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి,ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్రం నుండి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, కొండ సురేఖ, రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి. ఎస్. చౌహాన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులతో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని,

ఇందులో భాగంగా రాష్ట్రంలో 8 వేల 196 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించగా ఇప్పటి వరకు 8 వేల 12 కొనుగోలు కేంద్రాల ద్వారా 24 లక్షల 49 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇందులో దొడ్డురకం ధాన్యం 17 లక్షల 85 వేల మెట్రిక్ టన్నులు, సన్నరకం 6 లక్షల 64 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని, ఇప్పటి

మిగతా 2లో

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలి .

## మంత్రి పొంగులేటికి డీజేయూ ఆధ్వర్యంలో వినతి .



**కొత్తగూడెం జిల్లా ప్రతినిధి , నవంబర్ 27 ( ప్రజాబలం) ఐ**–జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి డెమోక్రటిక్ జర్నలిస్ట్ యూనియన్ భద్రాద్రి జిల్లా కన్వీనర్ సీమకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని, ఇళ్ల స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో, ఇందిరమ్మ రాజ్యంలో జిల్లాలో అర్హులైన జర్నలిస్టులను గుర్తించి న్యాయం చేయాలన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి అందరికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు చెంగపొంగు సైదులు, అఫ్జల్ పఠాన్, మేర మహేష్, దేగల,కృష్ణ ప్రసాద్, ఉబ్బెనపల్లి ప్రసాద్, కనక మౌలాలి, వంకాయలపాటి వెంకట్, దొడ్డ లక్ష్మణ్ రావు, కంచు శ్రీనివాస్, పూనెం రమేష్, వినోద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు

# మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం 6వ స్టాండింగ్ కమిటీ సమావేశం

## 9 అంశాలు కు స్టాండింగ్ కమిటీ ఆమోదం



**జీహెచ్ఎంసీ ప్రజాబలం ప్రతినిధి:హైదరాబాద్, నవంబర్ 27:** నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం 6వ స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగింది. కమిటీ సమావేశంలో 9 అంశాలు, ఒక టేబుల్ ఐటమ్ కు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు.

ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి, స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, ఫాహెద్ బిన్ అబ్దుల్ సమద్, మహమ్మద్ ఖాదీర్, మహమ్మద్ నసీరుద్దీన్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబిహా బేగం, చింతల విజయ్ శాంతి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సరోజ, పంకజ, గీత రాధిక, చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, రవికిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, ఎస్.ఈ రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, అకౌంట్ ఎగ్జామినర్ వేంకటేశ్వర రెడ్డి, సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు

ఎస్.ఎన్.డి.పి కింద నాగమయ్య కుంట నాలా రీ మోడలింగ్ రూ.19.34 కోట్లతో పూర్తయినందున జీహెచ్ఎంసీ అందుబాటులో గల ఎస్.ఎన్.డి.పి మిగులు నిధులతో నాలా పొడిగింపుకు ప్రతిపాదించిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణంకు రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టుటకు కమిటీ ఆమోదం.

హబీబ్ నగర్ నుండి చాంద్రాయణగుట్ట మెయిన్ రోడ్, రియాసత్ నగర్ నుండి హబీబ్ నగర్ వయా పాపా లాల్ టెంపుల్ వరకు రహదారి అభివృద్ధికి జీహెచ్ఎంసీ పరిధిలో గల 174 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం.



ఖైరతాబాద్ జోన్ మెహిదీపట్నం సర్కిల్ మల్లేపల్లి మోడల్ మార్కెట్ బిల్డింగ్ సమీప స్లమ్ ఏరియా నిరుద్యోగ యువత, వెనుకబడిన మహిళలకు సీ.ఎస్.ఆర్ కింద లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ వారి సొంత నిధులతో సెంటర్ ఫర్ స్కిల్లింగ్ అండ్ లవ్లీ హుడ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణలు నిర్వహించుటకు ఒక సంవత్సర కాలం పాటు మల్లేపల్లి మోడల్ మార్కెట్ బిల్డింగ్ ను స్వాధీనం చేయుటకు అనుమతిస్తూ సంబంధిత ఏజెన్సీ తో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం.

ఎఫ్.సి.ఐ గోడౌన్ రోడ్ నుండి చర్లపల్లి రైల్వే సరిహద్దు వయా ఐ.ఓ.సి.ఎల్ నుండి గ్రోసెన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ వరకు ప్రతిపాదించిన 24 మీటర్ల నుండి 30 మీటర్ల వరకు పెంచడానికి రివైజ్డ్ ప్రతిపాదనలు జీహెచ్ఎంసీ కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తూ రివైజ్డ్ ఆర్.డి.పి లో 6 ఆస్తుల సేకరణకు కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వానికి సిఫారసు చేయుటకు కమిటీ ఆమోదం.

జీహెచ్ఎంసీ పరిధిలోని 150 వార్డులలో క్రీడా కార్యక్రమాల నిర్వహణకు ప్రతి కార్పొరేటర్ డివిజన్ కు రూ.2 లక్షల విలువైన ఆటలు/ క్రీడల మెటీరియల్ అందించడానికి కమిటీ ఆమోదం.

ఆగస్టు 2024 మాసం జిహెచ్ఎంసి కి సంబంధించిన ఆదాయ, వ్యయాలకు కమిటీ ఆమోదం.

ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన జీహెచ్ఎంసీ మేయర్ క్యాంపు కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ (బి.నాగరాజు) సేవలు పొడగించుటకు, సికింద్రాబాద్ జోన్ లో అదనపు పోస్ట్ మంజూరుకు జీహెచ్ఎంసీ అనుమతి/ రాటిఫికేషన్ కు కమిటీ ఆమోదం.

పోలీస్ శాఖకు చెందిన నాంపల్లి వార్డు 45లో గల పోలీస్ క్వార్టర్స్ మరియు గోషామహల్ బంక్, స్టేడియం, బాస్కెట్ బాల్, బాడ్మింటన్ కోర్ట్ లకు సంబంధించిన 31.39 ఎకరాల భూమిని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నిర్మాణానికి గాను ఎన్.ఓ.సి జారీ చేయుటకు జీహెచ్ఎంసి సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.

సెప్టెంబర్ 2024 మాసం జిహెచ్ఎంసి కి సంబంధించిన ఆదాయ, వ్యయాలకు కమిటీ ఆమోదం.

# అంబికా రాణి ని సన్మానించిన కమీషనర్ ఇలంబర్తి



**జీహెచ్ఎంసీ ప్రజాబలం ప్రతినిధి: హైదరాబాద్, నవంబర్ 27:** జీహెచ్ఎంసీ ఉద్యోగి గా విధులు నిర్వహిస్తూ క్రీడా రంగంలో సాధించిన విజయాలు గర్వకారణమని జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమీషనర్ ఛాంబర్ లో జీహెచ్ఎంసి ఉద్యోగి, విక్టరీ ప్లే గ్రౌండ్ ప్లేయర్, జాతీయ స్థాయి రెజ్లింగ్ క్రీడల్లో బంగారు పతకం సాధించింది. జూడో క్రీడలో ఢిల్లీ నుండి రజత పతకం సాధించిన అంబికా రాణిని అడిషనల్ కమిషనర్ యాదగిరి రావుతో కలిసి కమీషనర్ శాలువతో సన్మానించారు.

ప్రజాబలం

28 నవంబర్ 2024 గురువారం

# ఎటూ తేల్చని కాప్ సదస్సులు

ప్రపంచం మొత్తం మీద అసాధారణ వాతావరణ పరిణామాలకు తోడు ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధం ఫలితంగా తలెత్తిన ఇంధన సంక్షోభం, బొగ్గుపులుసు వాయువుల వెల్లువను తగినంతగా ప్రపంచ దేశాలు కట్టడి చేయలేకపోతున్నాయి. భవిష్యత్తులో భూగోళాన్ని ఎలా పరిరక్షించుకోవాలన్న ప్రధాన అంశాలు చర్చించేందుకు ఏటా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వాతావరణ 'కాప్' సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి తప్ప అనుకున్న లక్షాలను సాధించడం లేదు. వాతావరణ మార్పులను నివారించడానికి ఎలాంటి ప్రణాళికలు చేపట్టాల్సి ఉంటుందో సదస్సులోని సభ్యదేశాలు తప్పనిసరిగా చర్చించవలసి ఉంటుంది. ఆ మేరకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉన్నా అగ్రదేశాలు ఈ విషయంలో అంటీఅంటనట్టు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు కాప్ 29 సదస్సులో కూడా అగ్రదేశాలు నిధుల కేటాయింపు విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం స్పష్టమైంది. అజర్‌బైజాన్ రాజధాని బాకు వేదికగా ఐక్యరాజ్యసమితి కాప్ 29 పర్యావరణ సదస్సులో దాదాపు (నవంబర్ 11 నుంచి 24 వరకు) 14 రోజుల పాటు సాగిన చర్చలు అనుకున్న లక్షాల సాధన విషయంలో అసంతృప్తినే మిగిల్చాయి. వాతావరణంలో ప్రతికూల మార్పులపై పోరాడేందుకు వర్ధమాన దేశాలకు ధనిక దేశాలు అందజేయాల్సిన ఆర్థిక సాయం 300 బిలియన్ డాలర్లుగా నిర్ణయించారు. పదేళ్లపాటు ప్రతి సంవత్సరం 300 బిలియన్ డాలర్లు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంపన్న దేశాలు నిధులు సమకూర్చాలని కాప్29 సదస్సు చేసిన తీర్మానంపై భారత్‌తో సహా వర్ధమాన దేశాలన్నీ అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఏటా 300 బిలియన్ డాలర్లు చాలవని, కనీసం 1.3 ట్రిలియన్ డాలర్లయినా ఇవ్వాలని వాదించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏటా ఎదుర్కొంటున్న వాతావరణ బీభత్సం, ఇతర సమస్యల సవాళ్లతో పోలిస్తే 2035 వరకు ఏటా కేటాయించే ఈ 300 బిలియన్ డాలర్ల మొత్తం చాలా అల్పమైనదని భారత్ విమర్శించింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం 300 బిలియన్ డాలర్ల వాతావరణ నిధి తీర్మానం ఎంతో గొప్పగా ఉందని ప్రశంసించింది. 2015లో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో కాప్ సదస్సులో ఆమోదించిన 1.5 డిగ్రీల సెల్సియస్ స్థాయికి ప్రపంచ ఉష్ణోగ్రతలను తగ్గించే లక్షం ఈనాటికీ సాంకేతికంగా చూసినప్పుడు సాధ్యమేనని, ఐతే రాబోయే పదేళ్లలో మాత్రం వాతావరణంలో కలుషిత వాయువులను గణనీయంగా తగ్గించుకోవలసిన అవసరం ఉందని ఐక్యరాజ్యసమితి సూచించింది. ఆనాడు పారిస్ ఒప్పందంపై 200 దేశాలు సంతకాలు చేశాయి. పరిస్థితులు ఇలాగే ఉంటే ఈ శతాబ్దాంతానికి వాతావరణంలో ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీల సెల్సియస్‌కు పెరుగుతాయని తాజా అంచనాలు చెబుతున్నాయి. 2023లో 57.1 గిగా టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ వాయువుల వరకు ప్రపంచ ఉద్గారాలు రికార్డు స్థాయిలో చేరుకున్నాయి. ఇవి 2022 నాటికన్నా 1.3 శాతం ఎక్కువ. వీటిలో 77% జి20 దేశాల నుంచే వెలువడుతున్నాయి. ఈ ఉద్గారాలను తక్షణం నిరోధించలేకుంటే 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ సెల్సియస్ వరకు భూతాపాన్ని అదుపు చేయాలన్న పారిస్ సదస్సు ఒప్పంద లక్షం కొన్నేళ్లలోనే కనుమరుగైపోయే ప్రమాదం ఉంటుంది. వాతావరణ మార్పుల కట్టడికి కట్టుబడి ఉండటం ఎంతో వ్యయంతో కూడుకున్న లక్షం. అందుకు వర్ధమాన దేశాలకు ఏటా 100 బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తామని అభివృద్ధి చెందిన దేశాలు 2009 కొపెన్‌హెగెన్ వాతావరణ సదస్సులో ప్రతిజ్ఞ చేసినా, అది ఇంతవరకు సరిగ్గా అమలు కాలేదు. అలాగే కాప్ 26 సదస్సులో శిలాజ ఇంధనాల వినియోగాన్ని విడిచిపెట్టాలన్న ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వెలువడ్డాయి. ఈ నిర్ణయాన్ని కొంతవరకు పట్టించుకోకుండా పక్కన పెడితే బాగుంటుందని సౌదీఅరేబియా, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఐక్యరాజ్యసమితిని పరోక్షంగా అభ్యర్థించాయి. ఈ సమస్యను నీరు గార్చాలని కోరుతూ ప్రభుత్వాల నుంచి, కంపెనీల నుంచి, మరికొన్ని సంస్థల నుంచి దాదాపు 3200 అభ్యర్థనలు వచ్చాయి. మొత్తం మీద శిలాజ ఇంధనాల వినియోగాన్ని అంత తొందరగా తగ్గించవలసిన అవసరం లేదన్న అభిప్రాయంలో అమెరికా తదితర అగ్రదేశాలు ఉన్నాయి. బొగ్గు వినియోగాన్ని బాగా తగ్గించాలన్నదే కాప్ సదస్సుల ప్రధాన అజెండా అయినప్పటికీ ఆ మేరకు బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలను మూసివేయడానికి ఆస్ట్రేలియా తదితర దేశాలు ముందుకు రావడం లేదు.

బొగ్గు నుంచి వెలువడే వాయువులను శూన్యస్థాయికి తీసుకురావాలన్న ప్రతిపాదనకు అగ్రదేశాలు మొగ్గు చూపడం లేదు. 2030 నాటికి అడవుల నిర్మూలనను పూర్తిగా అరికడతామని ఆస్ట్రేలియాతోపాటు మరో 123 దేశాలు కాప్ 26 సదస్సులో ప్రమాణ పత్రం పై సంతకాలు చేశాయి. అంతకన్నా ముందు కూడా ఇలాంటి ఒప్పందాలు అనేకం జరిగాయి. ఇవి అమలులోకి రానప్పుడు ఫలితం ఏముంటుంది? హిమాలయాలు వంటి సున్నిత ప్రాంతాల్లో అడవులను నరికి వేయడం, నిర్మాణాలు చేపట్టడం ఫలితంగా తీవ్ర వైపరీత్యాలు సంభవిస్తుండటం మనకు నిత్యం అనుభవమవుతున్నాయి. ఆసియా మొత్తం మీద అటవీ భూములు తగ్గిపోగా, అభివృద్ధి నిర్మాణాల పేరుతో అటవీ భూముల పరిరక్షణ చట్టాలనే మార్చి వేస్తున్నారు. ఇవన్నీ పరిశీలిస్తే ఇంతవరకు జరిగిన వాతావరణ సదస్సులు ప్రమాణ పత్రాలకే పరిమితమైన మొక్కుబడి సదస్సులుగా మిగిలిపోయాయి.

## అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందజేత

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 27 : జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల–వరంగల్–ఖమ్మం– విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం రొమ్మిపూర్లో కొనసాగుతున్న జాతీయ రహదారి 163జి పనులను పరిశీలించిన అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. జాతీయ రహదారి 163జి 334 కిలోమీటర్ల మేర ఉంటుందని, జిల్లా ప్రజలు రహదారి నిర్మాణానికి సహకరించాలని తెలిపారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని పరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. భూమిలో పట్టాదారు, కబ్జాదారు ఇద్దరు ఉన్నట్లయితే వారి ఇరువురి సమ్మతితో ఒకరికి పరిహారం చెల్లించడం జరుగుతుందని, ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే అట్టి పరిహారం సొమ్మును కోర్టులో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. భూములలో చెట్లు,బోర్లు, పైప్లు ఉన్నట్లయితే సంబంధిత ఫొటోలు తీసుకొని ప్రక్క భూమి రైతు వద్ద సంతకం తీసుకొని తహశిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, నిర్దేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని, నష్టపోయిన వారు ఆలస్యం చేయకుండా పరిహారం కొరకు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అనంతరం మండలంలోని షెట్పల్లి, గంగిపెల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో సన్నరకం, దొడ్డురకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయాలని,కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయ విస్తరణాధికారులను కేటాయించాలని,సన్నరకం ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణాధికారులు గుర్తించి ధృవపత్రం జారీ చేయాలని తెలిపారు.క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి 2 వేల 320 రూపాయలు,సాధారణ రకానికి 2 వేల 300 రూపాయలు చెల్లించడం జరుగుతుందని, కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలు ట్యాబ్లలో నమోదు చేయాలని, సంబంధిత రైతుల ఖాతాలలో త్వరితగతిన నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో 17 శాతం కంటే తక్కువగా తేమ శాతం ఉండాలని, తాలు, మట్టిగడ్డలు లేకుండా నిబంధనలను పాటిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని, కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం మౌళిక వసతులు కల్పించడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో ధాన్యం క్లీనర్లను ఉంచడం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో తూకం, తేమ యంత్రాలు, త్రాగునీరు,నీడ, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, కొనుగోలు సమయంలో సంబంధిత రైతులు రశీదు జారీ చేయాలని తెలిపారు.మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాలతో పాటు కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంను ఆకస్మికంగా సందర్శించి వంట శాల,గదులు,ఆహార నిల్వలు,రిజిస్టర్లను పరిశీలించారు.

## ఆఫీసర్స్ బీ అలర్ట్...!

మొదటి పేజీ తరువాయి



వినియోగించాలని లేకపోతే శాఖపరమైన చర్యలుంటాయని సీపీవోను హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో జరిగే రోడ్డు అభివృద్ధి పనులకు అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులను అలస్యం లేకుండా పొంది పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈఈలకు సూచించారు గ్రామాల్లో పనిచేసే పంచాయతీ సెక్రటరీలు నివాసం ఓ చోట విధులు మరో చోట నిర్వహిస్తుండటంతో ఆయా గ్రామాల్లో వారికి పట్టు ఉండటం లేదని వెంటనే ఆయా గ్రామాల సెక్రటరీలు వారు పనిచేస్తున్న గ్రామాలకు నివాసం మారాలని సూచించారు. వారిపై డీపీవో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు గ్రామాల్లో వీధిలైట్లు మంచినీరు ఇతరత్రా సమస్యలేవీ లేకుండా చూడాలన్నారు. అలాగే జిల్లాలోని పలు మండలాల్లో ఎమ్మార్వోలపై వరుస ఫిర్యాదులందు తున్నాయని తెలిపారు. ఎమ్మార్వోలను పర్యవేక్షించే బాధ్యత ఆర్ డీ వో లదేనని సూచించారు. వారి పనితీరు ఎప్పటికప్పుడు తనకు అప్ డేట్ చేస్తూ ఉండాలని సూచించారు. వాటి ఆధారంగా వారిపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో మెరుగైన పనితీరు కోసం ఒక్కరికే రూ.50లక్షల ఆ పై టెండర్లు ఇవ్వాలన్నారు. తద్వారా అతని పై ఒత్తిడి పెంచి పనిని త్వరగా పూర్తి చేయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్ డ బ్ల్యూఎస్ అధికారులు వారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ఆకస్మిక తనిఖీ చేస్తానని నిర్లక్ష్యం వహిస్తున్నట్లు గమనిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాననిహెచ్చరించారు పరిపాలన సజావుగా సాగేందుకు లోకల్ బాడీస్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకోని విధులు నిర్వర్తించాలన్నారు

# విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి





### మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్

### ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేసిన మున్సిపల్ కమీషనర్

లక్షెట్టిపేట, నవంబర్ 27: వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూడాలని మున్సిపల్ కమీషనర్ కల్లెడ రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని దళిత అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని అయన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో పలు రకాల రిజిస్టర్స్ ను పరిశీలించారు. మొత్తం విద్యార్థులు, సిబ్బంది సంఖ్య గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరుగు తుందన్నారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై పలు రకాల డేటా తీసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత డేటాను ఆన్లైన్ లో పొందు పరుస్తున్నట్లు ఆయన వివరించారు. వసతి గృహ విద్యార్థుల సంఖ్య, మెనూ ప్రకారం భోజనం, పరిశుభ్రత ఇతర వివరాలను పొందుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతకుముందు వసతి గృహంలో స్టోర్ రూమ్ లో సరుకులు,వంటగది తో పాటు బాత్ రూమ్ లను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని వసతి గృహ సంక్షేమాధికారి రాజుకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై కూడా దృష్టి పెట్టి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మందులు అందుబాటులో ఉన్నాయా? అని వార్డెన్ ను అడిగారు. ప్రభుత్వ ఆసుపత్రి మందులను మాత్రమే వాడాలని సూచించారు. అంటువ్యాధులు రాకుండా పరిశుభ్రత కోసం విద్యార్థులకు శానిటైజర్ లను కూడ అందుబాటులో ఉంచాలన్నారు. మెనూ పట్టిక పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. అనంతరం వసతి గృహ సంక్షేమాధికారి రాజు హాస్టల్ బయట పరిసరాల్లో మురికి కాల్వ, చెత్త తొలగింపుపై కమీషనర్ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే మున్సిపల్ సిబ్బందితో ఆయా పరిసరాలను అప్పటికప్పుడు కమీషనర్ శుభ్రం చేయించారు. ఈ ఆకస్మిక తనిఖీలో మున్సిపల్ కమీషనర్ రాజశేఖర్ వెంట మున్సిపల్ సిబ్బంది రాజు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

# రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

వరకు 3 లక్షల 95 వేల మంది రైతుల ఖాతాలలో 3 వేల 693 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాల్కు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని, ఈ క్రమంలోసన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలులో ఎలాంటి అక్రమాలు జరగకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం త్వరలో రేషన్ కార్డుదారులకు, వసతిగృహాలు, గురుకులాలకు సన్న బియ్యం అందించే కార్యక్రమం చేపట్టనున్నందునఆ దిశగా సన్న రకం ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థంత్రాగునీరు, నీడ, ఇతర అన్ని మౌలిక వసతులు కల్పించాలని, గన్ని సంచులు, టార్పాలిన్ కవర్ల కొరత లేకుండా అందుబాటులోఉంచాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్స్ అందుబాటులో ఉంచడం జరిగిందని,లరైతులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వరి కోత సమయంలో హార్వెస్టర్ నిర్దిష్ట వేగంవినియోగించినట్లయితే అప్పుడే నాణ్యమైన ధాన్యం వస్తుందని, అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సన్నరకం ధాన్యాన్నిబోనస్ చెల్లిస్తున్నందున వ్యవసాయ విస్తరణాధికారులు ధాన్యాన్ని గుర్తించి ధృవీకరణ పత్రం అందించడంలో జాగ్రత్తలువహించాలని, నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యం తూకంలో తరుగు చేయకూడదని, ధాన్యం కొనుగోలు చేసిన సమయంలో సంబంధిత రైతుకు రశీదు జారీ చేయాలని, ధాన్యం కొనుగోలుజరిగిన వెంటనే ట్యాబ్లలో సంబంధిత రైతుల వివరాలు నమోదు చేసి వెంటనే కేటాయించిన ప్రకారంగారైస్ మిల్లులకుధాన్యాన్ని తరలించాలని తెలిపారు. ధాన్యం దిగుమతిలో రైస్ మిల్లర్లుఆలస్యంచేయకుండాఅధికారులుపర్యవేక్షించాలని,రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం, అలసత్వం వహించినట్లయితే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలలోరైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధిత రైతు ఖాతాలలో నగదు 3 రోజులలోగా జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలనిఆదేశించారు. మహబూబ్నగర్లో ఈ నెల 30న రైతు పండగ విజయోత్సవం లోగా ధాన్యం కొనుగోలు వేగవంతం చేసిఆయా రైతుల వివరాలు ట్యాబ్లలో నమోదు ప్రక్రియ పూర్తి చేసి వారి ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలుతీసుకోవాలని తెలిపారు.ధాన్యం కొనుగోలులో ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ మంత్రులు,ప్రత్యేక అధికారులు, జిల్లాల కలెక్టర్లు,ప్రతిరోజు వారి పరిధిలోని కొనుగోలు ప్రక్రియను సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ 2024–25 సంవత్సరానికి గాను 3 లక్షల 68 వేల 140 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయడం జరిగిందని,ఇప్పటి వరకు జిల్లాలో 2 వేల 325 మెట్రిక్ టన్నుల దొడ్డురకం,79 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసి 1 వేయి 972 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక అధికారిని నియమించాలని, నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు జరిగిన వెంటనే సంబంధిత వివరాలు ట్యాబ్లలో నమోదు చేసి ట్యాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం ధాన్యం తరలించాలని, కొనుగోలు జరిగిన 3 రోజులలోగా సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా గణాంక అధికారి జి.సత్యం,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనబాంధవుడు జ్యోతిరావు పూలే

భారత జాతిపిత మోహన్ దాస్ గాంధీ కన్నా ముందే "మహాత్మునిగా"" భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ చే, ""గురువుగా" భావింప బడి, ప్రకటింప బడి, జన నీరాజనాలు అందుకున్న జ్యోతిరావు పూలే భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు, వారి హక్కుల కోసం, నిరంతరం అననుకూల పరిస్థితులలో పోరాటాలు చేసి సత్య ధర్మ శోధక మండలిని స్థాపించి, పలు సమస్యల పరిష్కారానికి కృషిచేసిన మహనీయుడు పూలే. సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారునిగా, సంస్కరణవాదిగా, సాంఘిక సేవా తత్పరునిగా, బాలికా విద్య ప్రోత్సాహకునిగా, మహిళా హక్కుల పరిరక్షకునిగా, కార్మిక పక్షపాతిగా, దీన జన బాంధవునిగా, లింగ వివక్షకు వ్యతిరేకిగా అణగదొక్కబడిన వర్గాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు పూలే. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర ( బ్రిటిష్ ఇండియా)లో జన్మించిన పూలే. తండ్రి గోవిందరావు పీష్వాల కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల వారికి పూలే అని పేరు వచ్చింది. చిన్నతనంలో చదువు మానేసి, తిరిగి పుణేలో 1941లో క్రైస్తవ ముస్లిం మిత్రుల సహకారంతో , స్కాటిష్ మిషన్ లో చేరి విద్యాభ్యాసం కొనసాగించారు. పుస్తకపఠనం పై మక్కువ ఎక్కువ చూపారు. చదువుకునే సమయాన 1948లో బ్రాహ్మణ స్నేహితుని వివాహానికి హాజరైన సందర్భంగా బిసి "మాలి" కులానికి చెందిన పూలే కుల వివక్షకులోనై తీవ్ర మానసిక వ్యధ చెందారు. సదాశివ బిల్లాల్ గోవింద్ అనే బ్రాహ్మణ మిత్ర పరిచయం, సాన్నిహిత్యం, "థామస్" రచన మానవ హక్కుల ప్రభావం, ఆయనపై ఎంతగానో ప్రభావం చూపింది. కులం, వర్గం, ప్రాంతం, లింగాది, వివక్షతలకు అవిద్యే కారణమని భావించి, తన భార్య సావిత్రిని బడికి పంపా రాయన. 1848 ఆగస్టులో బాలికల పాఠశాలను 51ు52 లో మరో రెండు పాఠశాలలను ఆదర్శ దంపతులు స్థాపించారు. 1853లో దేశంలోనే మొదటిదిగా పూలే వితంతువుల అనాధ శిశువుల కోసం సేవా సదనం స్థాపించారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపించారు.1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించి, వితంతువులెట్కన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు.1868లో తన ఇంటి దగ్గరున్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరాని వారికి కూడా అనుమతి ఇచ్చాడు. బాల హత్య ప్రతిబంధక్ గృహలో జన్మించిన బ్రాహ్మణ వితంతు కుమారున్ని 1872 లో దత్తత స్వీకరించారు. తాను అనుభవించిన కుల వివక్ష ఇతరులకు అనుభవానికి రాకూడదని ఆకాంక్షించారు. సహ ధర్మ చారిణి సావిత్రి తో కలిసి 40 ఏళ్ల పాటు నిర్వహించిన సామాజిక ఉద్యమాలు, పూలే దంపతులకు పేద జనోద్ధారకులుగా సమాజంలో గుర్తింపు తెచ్చాయి. ఎక్కడ అన్యాయం, వివక్ష చోటు చేసుకుంటే, అక్కడ ఉద్యమం నడిపారు. అణగారిన వర్గాలకే కాదు, బాధితులైన అగ్రకుల వితంతు పునర్వివాహాలకు విశేష కృషి సలిపారు. బ్రాహ్మణ వితంతువులకు శిరో ముండనాలు చేయమని క్షురకులచే సమ్మెలు చేయించారు.1871 లో సత్యశోధన పక్షాన దీనబంధు పత్రిక నడిపాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించాడు. 1873 సెప్టెంబరు 24న సత్య శోధక సమాజాన్ని పూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమం. బొంబాయి నిర్మాణానికి తెలంగాణ నుండి వలస వెళ్ళి ఎదిగిన మున్నూరుకాపులే అధికం. బొంబాయిలో సత్యశోధక్ సమాజ్ శాఖ పుట్టింది సయాజీ నాగు మున్నూరుకాపు ఇంటిలోనే.పూలే సామాజిక సంస్కరణోద్యమానికి తుదిశ్వాస వరకు చేదోడువాదోడై నిలిచిన జాయా కారాడీ లింగు తెలంగాణం కన్న మున్నూరు కాపు బిడ్డ.కారాడి లింగు తండ్రి జాయా ఎల్లప్పలింగు ముంబైలో భవన నిర్మాణ కాంట్రాక్టరు. పూలే కొంతకాలం భవన నిర్మాణ కాంట్రాక్టరుగా పనిచేశారు. అప్పుడే ఆయనకు ముంబై తెలుగు ప్రజల పితామహునిగా ప్రసిద్ధులైన కాంట్రాక్టరు రామయ్య వెంకయ్య అయ్యవారితో పరిచయమైంది. వెంకయ్య పూలేను ముంబైకి ఆహ్వానించి, తోటి కాంట్రాక్టర్లతో కలిసి సత్యశోధక సమాజాన్ని విస్తరింపజేయడానికి, పాఠశాలలను ఏర్పాటుచేసి నడపడానికి ఆర్థిక, హార్దిక సహాయాలను అందించారు. సత్యశోధక సమాజానికి తెలుగువారి విరాళాలే ప్రధాన ఆర్థిక వనరుగా ఉండేవి. వెంకయ్య ఇల్లే అనాథ బాలల ఆశ్రమంగా ఉండేది. వారిని గొప్ప విద్యా వంతులుగా, సత్యశోధకులుగా చేసిన ఘనత వెంకయ్యదే. పూలే ప్రసిద్ధ గ్రంథం "గులాంగిరి" పుస్తక ప్రచురణ 1873లో వెంకయ్యనే ప్రచురించారు. 1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారిచే పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు. 83 లో కల్టివేటర్ విప్ కార్డ్ ( సేద్య గాడిపై చర్నాకోల) ముప్పై మూడు వ్యాసాల పుస్తకాన్ని సార్వజనిక సత్య ధర్మ పేరున ప్రచురించారు. బ్రాహ్మణేతరులచే జరిపించిన కులాంతర వివాహాలు చెల్లవని బ్రాహ్మణులు తీర్మానాలు చేస్తే, సత్యశోధన మండలి ద్వారా కోర్టుకు వెళ్లారు. 1990లో కోర్టు పూలే వాదనను సమర్థించింది. తద్వారా పూలే అమితానందం చెందారు. ఆయన వ్రాసిన 33 ఆర్టికల్స్ గల "సార్వజనిక్ సత్యధర్మ" పుస్తకంలో కుటుంబ సృష్టి నియమాల గురించి వివరిస్తూ ప్రపంచం మొత్తాన్ని ఒక కుటుంబంగా వ్యక్తీకరించాడు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు. పూలేకు కేవలం కుల వ్యవస్థ వ్యతిరేకతే కాదు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉన్నాయి. అనారోగ్యానికి గురై పడకకే పరిమితం అయిన సమయాన, తాను మృతి చెందాక, ఎవరు ఏ బాధ్యతలు స్వీకరించాలో వివరించి సామాజిక ఉద్యమాలు, విస్తరింపచేసి, ప్రగతి మార్గంలో ప్రజలను తీసుకెళ్లాలని నొక్కి చెప్పి, తన ఆదర్శాలను కొనసాగించాలని హితవు పలికి 63వ ఏట 1890 నవంబర్ 28న గురువారం రాత్రి ప్రార్థనా గీతాల మధ్య దీర్ఘ నిద్రకు మహాత్మ పూలే ఉపక్రమించారు. భారతావనిలో గొప్ప సాంఘిక సంస్కర్తగా ఆచంద్ర తారార్కం మహాత్మ పూలే మిగిలి పోనున్నారు.

## కృత్రిమ కాలు సృష్టికర్త సేథీ

తెలుగు చలన చిత్ర రంగంలో ఒక మరుపురాని అద్భుత చిత్రరాజం మయూరి. ఆ రోజుల్లో ఆ సినిమా ఒక సంచలనం. సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వంలో ఉషాకిరణ్ మూవీస్ పతాకంపై రామోజీరావు నిర్మించగా, 1985లో విడుదల చేసిన చిత్రం. నర్తకియైన సుధా చంద్రన్ నిజ జీవితం ఆధారంగా సహజత్వం ఉట్టిపడేలా తీసిన చిత్రం. ప్రమాదం కారణంగా ఒక కాలు కోల్పోయిన స్థితిలో, నిరాశ నిస్పృహలకు లోను కాకుండా కృత్రిమ కాలు అమర్చుకుని, కష్ట పడి సాధన చేసి, కృత్రిమ కాలు తోనే నాట్య ప్రదర్శనలు ఇచ్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నాట్య మయూరి జీవితమే ఆ సినిమా కథ నేపథ్యం. ఆ నర్తకే సుధా చంద్రన్. ఆమె జీవిత నేపద్యమే మయూరి సినిమా కథా వస్తువు. ఆ సినిమాలో మయూరి పాత్ర పోషించింది స్వయాన సుధా చంద్రన్ కావడమే విశేషం. సుధా చంద్రన్ జైపూర్ వెళ్ళి కృత్రిమ కాలును అమర్చు కోవడాన్ని మయూరి సినిమాలో చూస్తాం. ఆ కృత్రిమ పాదం, కాలు రూపకర్త ఎవరో చాలా మందికి తెలియదు.

ఆయనే... కాళ్ళు కోల్పోయిన ఎందరికో, కృత్రిమ కాళ్ళు అమర్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన, దేశం గర్వించ దగిన ప్రముఖ శస్త్ర వైద్యుడు పి.కె.సేథీగా పేరెన్నిక గన్న ప్రమోద్ కరణ్ సేథీ. ప్రమోద్ కరణ్ సేథీ (నవంబర్ 28, 1927 - జనవరి 7, 2007) భారతీయ శస్త్ర వైద్యుడు, జైపూర్ కృత్రిమ పాదం (జైపూర్ ఫుట్) సృష్టికర్త. 1927, నవంబర్ 28 న ఉత్తర ప్రదేశ్ లోని వారణాసిలో జన్మించాడు. కాళ్ళు కోల్పోయిన అనేక మందికి కృత్రిమ కాలు అమర్చి ఎందరికో నడక నేర్పిన సేథీ గిన్నిస్ బుక్ రికార్డులో కూడా నమోదు కా బడి, ప్రశంసాపత్రం అందుకున్నాడు. 1981లో సామా జిక సేవా రంగంలో ఆసియా లోనే అత్యుత్తమమైన మెగ్సేసే అవార్డు కూడా అయన పొందాడు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తిం చి పద్మశ్రీ పురస్కారంతో సత్కరిం చింది. పుట్టుకతోనే కాలు లేకుండా జన్మించిన వికలాంగులకు, విధి వంచితులై, ఎన్నో రకాలుగా కాళ్ళు కోల్పోయిన వారికి, ఎందరో సైనికు లకు, దాడుల్లో గాయపడిన అమా యకులకు ఇలా ఎందరికో, అంగ వైకల్యం కలుగ కుండా, తిరిగి నడక నేర్పాడు, జీవితాలలో వెలుగు ప్రసాదించాడు సేథీ. ఎముకల వైద్య నిపుణుడైన సేథీ 1969లో పరిచితుడైన, నిరక్షరా స్యుడైన చేతివృత్తి నిపుణుడు రామచంద్ర శర్మతో కలిసి జైపూర్ పాదాన్ని తయారు చేశాడు. కొత్త ఆవిష్కరణకు తెర లేపాడు. అంతకు ముందు, జైపూర్ పాదం తయారు చేయడానికి ముందు కృత్రిమ కాలు అమర్చు కోవాలంటే ఖర్చు ఎక్కువగా అయ్యేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సేథీ... రబ్బరు, చెక్క, అల్యూమినియంతో కృత్రిమ పాదం తయారుచేసి తక్కువ ధరలో సామాన్యులకు అందు బాటులో ఉండేలా కృషి చేశాడు.

1975 వరకు కూడా ఈ కృత్రిమ పాదాన్ని అమర్చుకున్న వారు చాలా తక్కువే. అఫ్ఘనిస్తాన్ యుద్ధం తరువాత జైపూర్ ఫుట్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఈ యుద్ధంలో సోవియట్ యూనియన్ (ప్రస్తుత రష్యా) అమర్చిన మందు పాతరల వల్ల కాళ్ళు కోల్పోయిన అనేక మందికి అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ జైపూర్ ఫుట్‌లను అమ ర్చింది. కార్గిల్ యుద్ధంలో కాళ్ళు కోల్పోయిన అనేక సైనికులు కూడా జైపూర్ పాదాలనే అమర్చు కున్నారు. ప్రముఖ నటి సుధా చంద్రన్ కూడా జైపూర్ ఫుట్‌నే అమర్చుకొని మయూరి చిత్రంలో నటించి పలువురి ప్రశంసలు అందుకొన్న విషయం తెలిసిందే. ప్రమోద్ కరణ్ సేథీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించగా, అత్య ధికులకు కృత్రిమ అవయవం అమర్చినందులకు సేథీ పేరును గిన్నిస్ బుక్ లో రికార్డు చేశారు.

ఆసియాలోనే అత్యుత్తమమైన మెగ్సేసే అవార్డు కూడా సేథీని వరించింది. డాక్టర్ బిసి రాయ్ అవార్డు ప్రముఖ వైద్య ఉపాధ్యాయుడిగా, 1979, పద్మశ్రీ - ప్రభుత్వం ఆఫ్ ఇండియా 1981, మాగ్సేసే అవార్డు - మనీలా, 1981, సైంటిఫిక్ అచీవ్‌మెంట్ కోసం గిన్నిస్ అవార్డు, 1982, గౌరవ డి.సా.షి. (రాజస్థాన్ విశ్వ విద్యా లయం) 1982, అత్యుత్తమ వైద్య పరిశోధనలకు ఆర్.డి.బిర్లా అవార్డు,1984, నాడ్ జాన్సెన్ లెక్చర్ అండ్ మెడల్ వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ప్రోస్తేటిక్స్ అండ్ ఆర్థోయిటిక్స్, కోబ్, జపాన్ 1989, డాక్టర్ బిసి రాయ్ నేషనల్ అవార్డు ఆఫ్ ది ఇమినెంట్ మెడికల్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ న్యూ ఢిల్లీ 1989, డాక్టర్ బి. ముఖోపాధ్యాయ ఓరేషన్ ఆర్థో పెడిక్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ - బరోడా 1998, గౌరవ ఫెలోషిప్, ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ 1999, ప్రపంచ అండర్స్టాండింగ్ మరియు శాంతికి రోటరీ అంతర్జాతీయ అవార్డు శాన్ ఆంటోనియో, యుఎస్ఎ 2001, 20 వ శతాబ్దంలో అత్యుత్తమ పరిశోధనా శాస్త్రవేత్తకు అవార్డు - ఆర్థోపెడిక్ రీసెర్చ్ అండ్ ఎద్యు కేషన్ ఫౌండేషన్ - పాట్నా 2002, నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఇండియా - 2004, లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ఆఫ్ ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసి యేషన్, డిసెంబర్ 2004 తదితర ఎన్నో అవార్డులను ఆయనను వరించాయి. కాళ్ళు కోల్పోయిన ఎందరికో కృత్రిమ కాళ్ళు అమర్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన సేథీ 2007, జనవరి 7 న జైపూర్‌లో మరణించారు.

## కృతజ్ఞతలు తెలపడం మహాగుణం

సమయానుకూలంగా ప్రతిస్పందించడం, సదా కృతజ్ఞతగా ఉండడం, సహాయం చేసిన చేతులకు ప్రణమిల్లడం, శరదృతువులో పంటలను అందించిన ప్రకృతి మాతకు కృతజ్ఞతలు తెలపడం, ఆహార ధాన్యాలను ఇచ్చిన భూమాతకు పూజలు చేయడం, సుర్య చంద్రులకు ధన్యవాదాలు తెలపడం, పేదలకు సహాయం చేయడం, అభాగ్యులకు దానధర్మాలు చేయడం, చేయూతనిచ్చిన వారికి తిరిగి చేయూత ఇవ్వడం లాంటి సుగుణాలు వ్యక్తిత్వానికి ఆభరణాలుగా పని చేస్తాయి. మన జీవితాల్లో ఎన్నో ఒడుదుడుకులు, అవాంతరాలు, వైఫల్యాలు ఎదురవుతూ ఉంటాయి. పలు సందర్భాల్లో మనల్ని విజేతలుగా నిలపడానికి, బెదిరినపుడు ధైర్యం ఇవ్వడానికి, నిస్వార్థంగా సేవలు అందించిన వారికి, తడబడినపుడు ఊతకర్రగా నిలిచిన వారికి ఆయా సందర్భాల్లో ప్రేమ, భర్తిపూర్వక కృతజ్ఞతలు తెలపడం మనందరి కనీస కర్తవ్యంగా, ఓ మంచి అలవాటు కావాలి. సహాయం తీసుకొని ధన్యవాదాలు తెలపని వారు సంస్కారం లేని వారని ముద్ర వేసి దూరం పెడుతుంది నేటి పౌర సమాజం. మన దైనందిన జీవితాల్లో కృతజ్ఞతలు తెలపడం అనే మంచి లక్షణాన్ని గుర్తు చేయడానికి, ప్రజల్లో ఆ భావం పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏట నవంబర్ మాసంలో 4వ గురువారం అనగా 28 నవంబర్ 2024న యూఎస్‌తో పాటు పలు దేశాలు "థాంక్స్ గివింగ్ డే లేదా కృతజ్ఞతలు తెలిపే దినం" పాటించడం 1941 నుంచి ఆనవాయితీగా మారింది. ఈ వేడుకలను ముఖ్యంగా క్రిస్టియన్ మతస్థులు జరుపుకోవడం ఆచారంగా వస్తున్నది. నాటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూస్‌వెల్ట్ ప్రతిపాదించిన ఈ దినం రోజున సెలవు దినంగా కూడా ప్రకటించుకొని, పలు చోట్ల ధన్యవాదాలు తెలిపే దినాన్ని ఒక సంతోషకరమైన ఉత్సవంగా నిర్వహిస్తారు. పంటలను చేతికి అందించే భూమాతకు కూడా కృతజ్ఞతగా ఈ వేడుకలు జరుపుకుంటారు. ఈ రోజును పంటకోతల పండుగగా కూడా నిర్వహించే సాంప్రదాయం కొన్ని దేశాల్లో కొనసాగుతున్నది. పంట కోతలు ఇంటికి చేరిన తర్వాత కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి వేడుకగా విందులు నిర్వహించుకోవడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అనాదిగా వస్తున్నది. కొన్ని దేశాల్లో ఫుట్ బాల్ లాంటి క్రీడలను కూడా నిర్వహిస్తారు.మన నిత్యజీవితంలో నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వైద్యులు, ఆహారాన్ని పండిస్తున్న రైతులు, పారిశుధ్య సిబ్బంది, నిస్వార్థ ఉద్యోగులు, స్వచ్ఛంద కార్యకర్తలు, కష్టాల్లో మనల్ని ఆదుకున్న చేతులు మొదలగు అనేక మందికి మనం అనునిత్యం ధన్యవాదాలు తెలపడం మరిచి పోవద్దు. సహాయం చేసిన వారికి కృతజ్ఞతలు తెలపడంతో పాటు మనం సహాయం చేసినపుడు కృతజ్ఞతల కోసం ఎదురు చూడవద్దు. కృతజ్ఞతలు పొందడం కోసం కాదు కదా మనం సహాయం చేసిందని మరిచి పోరాదు. ఏరు దాటగానే తెప్ప తగిలేసే మూర్ఖులకు కృతజ్ఞతకు ఉన్న విలువ తెలియదు. "ఆల్ వేస్ బి థంక్ ఫుల్ టు హెల్పింగ్ హాండ్". థాంక్స్ అనే రెండు అక్షరాల పదం మహాశక్తివంతం అని, ఆ గుణం అద్భుత పేరును ఆర్జించి పెడుతుందని గుర్తుంచుకోవాలి.

## వైసీపీలో జంపింగ్స్ ఆగేదెన్నడు

విజయవాడ, నవంబర్ 27,ఎన్నికల్లో పరాజయం తర్వాత ఏ పార్టీకి అయినా సమస్యలు వస్తాయి. కొంత మంది నేతలు వెళ్లిపోతారు. అయితే వారికి భవిష్యత్ పై ఆశలు కల్పించి పార్టీ మారకుండా చేసుకునేలా ఆ పార్టీ పెద్దలు ప్రయత్నించాల్సి ఉంది. వైఎస్ఆర్‌సీపీకి ఎమ్మెల్సీలు వరుసగా రాజీనామా చేస్తున్నా వారికి సర్ది చెప్పేందుకు పెద్దగా ఎవరూ ప్రయత్నించడం లేదు. ఏరి కోరి పార్టీలోకి తీసుకు వచ్చిన నేతలు కూడా పదవులకు కూడా రాజీనామాలు చేసి వెళ్తున్నారు. ఈ ట్రెండ్ ఇలా కొనసాగితే రాబోయే రోజుల్లో మరింత ఎక్కువగా వలసలు ఉంటాయని భావిస్తున్నారు. వైసీపీకి ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామా చేశారు. ఆయనను టీడీపీ నుంచి ప్రత్యేకంగా పదవి ఆఫర్ చేసి మరీ వైసీపీలో చేర్చుకున్నారు. తీరా ఇప్పుడు పార్టీ ఓడిపోయే సరికి పదవికి కూడా రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఆయన జనసేనతో టచ్ లోకి వెళ్లారని అంటున్నారు. వైసీపీకి ఇప్పటికి ముగ్గురు రాజ్యసభ ఎంపీలు, నలుగురు ఎమ్మెల్సీలు రాజీనామాలు చేశారు. ఇంకా చాలా మంది దారిలో ఉన్నారని అంటున్నారు. జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు తీసుకున్న కొన్ని నిర్ణయాలు, చర్యల వల్ల ఇప్పుడు తాము నిండా మునిగిపోయే పరిస్థితిలో ఉన్నామని అనుకుంటున్న ఎక్కువ మంది నేతలు తమ దారి తాము చూసుకునేందుకు రెడీ అవుతున్నారు. వీరిలో అత్యంత సీనియర్లు కూడా ఉన్నారని వైసీపీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సిక్కోలు నుంచి నెల్లూరు వరకూ చాలా మంది సీనియర్లు నోరు తెరవడం లేదు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలలో అత్యధిక మంది తమ దారి తాము చూసుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నారని.. మూడు కూటమి పార్టీల్లో ఎక్కడ చాన్స్ వచ్చినా చేరిపోయేందుకు రెడీ అంటున్నారని వైసీపీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. శాసనమండలి సభ్యులలో నలుగురు రాజీనామా చేశారు. వారి రాజీనామాలు ఆమోదించలేదు కానీ..మరో పదిమంది వరకూ పార్టీ కార్యక్రమాల్లో అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. మండలికి వచ్చినా సైలెంటుగా గా కూర్చుని వెళ్లిపోయారు. వైసీపీ సభ్యులతో కలిసి టీడీపీ సభ్యులపై విరుచుకుపడేందుకు సిద్ధపడలేదు. అందుకే పది మంది సభ్యులే టీడీపీకి మండలిలో ఉన్నా.. అధికారికంగా 30కిపైగా సభ్యులు వైసీపీకి ఉన్నా కనీస ప్రభావం చూపలేకపోయారని భావిస్తున్నారు. మరో వైపు వైసీపీ హైకమాండ్ అనేక రకాల సమస్యలతో ఉక్కిరి బిక్కిరి అవుతోంది. పార్టీ నేతల్ని బుజ్జగించే పరిస్థితిలో లేదు. లడ్డూ కల్తీ వ్యవహారం దగ్గర నుంచి అదానీ విద్యుత్ ఒప్పందాల వరకూ అనేక అంశాలు సమస్యలుగా మారుతున్నాయి. ఈ అంశంపై అధికార పార్టీ ఏం చేయబోతోందోనన్న ఉత్కంఠ ఉంది. పార్టీ నేతలతో పని లేదని.. పార్టీ మీద ఆధారపడేవారు వెళ్లిపోయినా నష్టం లేదని వారి కోసం సమయం వృధా చేసుకోవాల్సిన అవసరం లేదని భావిస్తున్నారని అంటున్నారు. అంటే పార్టీని వీడిపోయేవారు పోయినా పట్టించుకోమని చెబుతున్నట్లుగా తీరు ఉందని అనుకోవచ్చు.

## ఈ ఏడాది ఒక రోజు ముందే ఫించన్లు

నెల్లూరు, నవంబర్ 27, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న పింఛన్ల పంపిణీకి సంబంధించి కూటమి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ నెలకు సంబంధించి ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. డిసెంబర్ 1న ఆదివారం కావడంతో నవంబర్ 30వ తేదీనే అంటే శనివారం పెన్షన్ల పంపిణీ చేయాలని ప్రభుత్వం అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. ఒకేవేళ ఆరోజు తీసుకోలేని వారికి డిసెంబర్ 2న, లేదంటే వచ్చే నెల 1న రెండు నెలల పెన్షన్లను పొందొచ్చని కూటమి ప్రభుత్వం తెలిసింది. ఈ మేరకు తెలియజేస్తూ ప్రకటన జారీ చేసింది.సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ ఉంటుంది. ఒకవేళ ఆ రోజు సెలవు అయితే మాత్రం అంతకుముందు రోజే పింఛన్ పంపిణీ చేస్తామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో డిసెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో పింఛన్ డబ్బుల్ని ఒక రోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు తెల్పింది. అంటే నవంబర్ 30వ తేదీన పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు. పింఛన్ తీసుకునే లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు సూచించారు. అంతేకాకుండా ఇప్పటి వరకూ ఒక నెల పింఛన్ తీసుకోకపోతే తర్వాత నెలలో దానిని ఇచ్చేవారు కాదు. దీంతో ఏ నెలకు ఆ నెల పింఛన్ తీసుకునేందుకు లబ్ధిదారులు సుదూర ప్రాంతాల నుంచి పరుగుపరుగున ఒకటో తేదీన ఠంఛన్‌గా చేరుకునేవారు. ఇకపై ఆ బెంగ కూడా లేదు.ఎందుకంటే.. ఒక నెల పింఛన్ తీసుకోని వారికి ఆ తర్వాత నెలలో దానిని కలిపి రెండు నెలల నగదును ఒకేసారి ఇవ్వనున్నారు. అలాగే వరుసగా 2 నెలలు పింఛన్ తీసుకోని వారికి 3వ నెలలో మూడు నెలలకు కలిపి పింఛన్ డబ్బులు అందజేస్తారు. డిసెంబర్ నెల నుంచే ఈ నిబంధనను అమలు చేస్తున్నారు. అయితే వరుసగా మూడు మాసాలు తీసుకోపోతే మాత్రం శాశ్వత వలసగా పరిగణించి.. ఆ లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ తొలగిస్తుంది. ఆ తర్వాత వచ్చినా రోల్‌బాక్ ద్వారా మళ్లీ మంజూరు అవుతుంది. అయితే మూడు నెలల బకాయిలు మాత్రం ఇవ్వరు.

## వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. వరంగల్ డి ఎం హెచ్ ఓ.బి.సాంబశివరావు.



వరంగల్ ప్రతినిధి.మండల పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యులు నాణ్యమైన వైద్యాన్ని అందించి వారి మన్ననలను పొందాలని వరంగల్ జిల్లా డీఎంహెచ్ఓ డి సాంబశివరావు అన్నారు. వరంగల్ జిల్లాలోని ఖానాపురం చెన్నారావుపేట మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు అనంతరం వారికి తగు విధమైన సూచనలు అందించారు. సాధారణంగా చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలు ముక్కు కారడము, అస్తమ, శ్వాస కోస వ్యాధులు, హార్ట్ ఎటాక్స్ ,చర్మ సంబంధిత వ్యాధులు మొదలగునవి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిన్న పిల్లలకు, వృద్ధులకు షెటర్స్, గ్లౌజెస్ ,దుప్పట్లు నిండుగా కప్పుకొని చలికి గురి కాకుండా ఉండాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలన్నారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని తెలిపారురు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే సిబ్బంది ద్వారా తగు చికిత్సలు తీసుకోవాలని కోరినారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించినారు కాబట్టి సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ అరుణ్ చంద్ర, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సరోజ ,పల్లె దావకాన డాక్టర్లు ,డిప్యూటీ డెమో అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# 3 ఎంపీ స్థానాలకు... ముడు పార్టీలు...

తిరుపతి, నవంబర్ 27, ఏపీలో మరోసారి ఎన్నికల సందడి మొదలయింది. వైసీపీ రాజ్యసభ సభ్యుల రాజీనామాతో ఖాళీ అయిన మూడు స్థానాల్లో.. ఎన్నికలు నిర్వహించనుంది ఈసీ. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబర్ 3 నుంచి 10 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు డిసెంబర్ 13. డిసెంబర్ 20న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలను ప్రకటించనుంది..కేంద్ర ఎన్నికల సంఘం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులుగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య వేర్వేరు కారణాలతో తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. దీంతో ఏపీ కోటాలో మూడు ఖాళీలు ఏర్పడ్డాయి. ఒక్క రాజ్యసభ అభ్యర్థి విజయం సాధించాలంటే కనీసం 25 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం వైసీపీ బలం 11 మాత్రమే. అందువల్ల ఆ పార్టీ రాజ్యసభ బరిలో నిలిచే అవకాశం లేదు. దీంతో ప్రస్తుతం ఉప ఎన్నిక జరగనున్న 3 స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం దాదాపు ఖాయమైంది. అయితే, ఈ 3 స్థానాలను టీడీపీ తీసుకుంటుందా? లేక భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జనసేనకు కూడా అవకాశం ఇస్తుందా? అనేదానిపై చర్చ జరుగుతోంది.అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో భారీగా స్థానాలను గెలుచుకున్న టీడీపీకి.. ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం లేదు. దీంతో ఈ ఉప ఎన్నిక ద్వారా పెద్దల సభలోకి మళ్లీ ఎంట్రీ అవ్వాలని భావిస్తోంది టీడీపీ. అయితే ఆ పార్టీలో రాజ్యసభ బెర్త్‌కు భారీ డిమాండ్ ఉన్నట్టు తెలుస్తోంది. తాను రాజీనామా చేసిన స్థానాన్ని తిరిగి తనకే కేటాయించాలని టీడీపీని కోరుతున్నారంట..తాజా మాజీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు. ఇక గుంటూరు ఎంపీ సీటును త్యాగం చేసిన మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కూడా..రాజ్యసభ సీటును ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు సీనియర్ కోటాలో కంభంపాటి రామ్మోహన్‌కు అవకాశం దక్కే ఛాన్స్ ఉందంటున్నాయి..టీడీపీ వర్గాలు. అటు జనసేనకు ఏపీ అసెంబ్లీ, మండలితో పాటు లోక్‌సభలో కూడా ప్రాతినిధ్యం ఉంది. రాజ్యసభలో కూడా ఆ పార్టీ అడుగు పెడితే మొత్తం సభలలో జనసేన ఖాతా తెరచినట్లు అవుతుందని భావిస్తున్నారు. దీంతో ఆ పార్టీ రాజ్యసభ సీటును ఆశిస్తోంది. అనకాపల్లి లోక్ సభ సీటుని పొత్తు ధర్మంలో త్యాగం చేశారు..మెగాబ్రదర్ నాగబాబు. దీంతో ఆయనకు ఈసారి రాజ్యసభ అవకాశం ఇవ్వాలన్న వాదన వినిపిస్తోంది. ఇక కాకినాడకు చెందిన టీడీపీ నేత సానాసతీష్ అయితే తెలుగుదేశం నుండి లేదంటే జనసేన కోటా నుండి రాజ్యసభ స్థానాన్ని కోరుతున్నట్టు తెలుస్తోంది.ఇక బీజేపీ కూడా మిత్రధర్మంగా తమకు ఒక రాజ్యసభ సీటును ఏపీ కోటా నుంచి ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ పార్టీ మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

ఆయన పార్టీలో చేరినప్పుడే రాజ్యసభ సీటు హామీ దక్కినట్టు తెలుస్తోంది. అటు విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యేగా ఉన్న కేంద్రమాజీ మంత్రి సుజనా చౌదరి పేరు కూడా రాజ్యసభ రేసులో వినిపిస్తోంది.

అయితే మోపిదేవి వెంకటరమణ ఖాళీ చేసిన స్థానానికి..2026 వరకూ మాత్రమే గడువుంది. దీంతో ఆ స్థానానికి ఆశావాహుల నుండి పెద్దగా డిమాండ్ ఉండే అవకాశం లేదు. మిగిలిన రెండు స్థానాలకు జూన్ 21, 2028 వరకూ గడువుంది. దాంతో ఆ స్థానాలపైనే పార్టీలు ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. మరి రాజ్యసభ రేస్‌లో విన్ అయ్యేది ఎవరో చూడాలి..

# టీటీడీలో కీలక పదవుల భర్తీకి ముహూర్తం

తిరుమల, నవంబర్ 27, టీటీడీలో కీలక పదవుల కోసం పోటీ తీవ్రంగా ఉంది. ఎస్వీబీసీ ఛైర్మన్, ఎస్వీఈటీఏ ఛైర్మన్, ఎస్‌వీబీసీ చైర్మన్ పదవితో పాటు ఎస్‌వీబీసీ సీఈవో, అడ్వైజర్, చీఫ్ అడ్వైజర్ పదవుల కోసం కూటమి పార్టీల నేతలు ప్రయత్నాలు చేశారు.తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో కీలక పదవుల భర్తీకి కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆ పదవులను సొంతం చేసుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పావులు కదుపుతున్నారు.టీటీడీ అనుబంధ విభాగాలుగా ఉన్న శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్‌వీబీసీ) ఛైర్మన్, శ్రీ వెంకటేశ్వర ఎంప్లాయిస్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్‌వీఈటీఏ) చైర్మన్ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఈ రెండు విభాగాలు టీటీడీలో కీలకమైన పదవులుగా ఉన్నాయి. వాటి కోసం పలువురు ఆశావహులు పావులు కదుపుతున్నారు. అలాగే ఎస్‌వీబీసీ చైర్మన్ పదవితో పాటు ఎస్‌వీబీసీ సీఈవో, అడ్వైజర్, చీఫ్ అడ్వైజర్ పదవుల భర్తీ కోసం కూడా కసరత్తు జరుగుతోంది.ఎస్‌వీబీసీ ఛానల్ ప్రారంభమైన తరువాత 2018 ఏప్రిల్ 21న సినీ దర్శకుడు రాఘవేంద్రరావును అప్పటి టీడీపీ ప్రభుత్వం చైర్మన్‌గా నియమించింది. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రాఘవేంద్రరావు తన పదవికి రాజీనామా చేశారు. దీంతో వైసీపీ ప్రభుత్వం సినీనటుడు పృథ్వీకి ఆ పదవి కట్టబెట్టింది. అయితే ఆయన వివిధ వివాదాల నేపథ్యంలో రాజీనామా చేశారు. ఆ తరువాత వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర ఎస్‌వీబీసీ చైర్మన్ బాధ్యతలను చేపట్టారు.దాదాపు మూడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగిన ఆయన 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో రాజీనామా చేశారు. దీంతో అప్పటి నుంచి ఆ పదవి ఖాళీగా ఉంది. దీంతో పాటు సీఈవో, అడ్వైజర్, చీఫ్ అడ్వైజర్ పదవులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఎస్‌వీబీసీ చైర్మన్ పదవితో పాటు సీఈవో, అడ్వైజర్, చీఫ్ అడ్వైజర్ పదవుల కోసం పలువురు ఆసక్తి చూసుతున్నారు. త్వరలో ఈ నియామకాలు చేపట్టే అవకాశం ఉంది.టీటీడీకి అనుబంధంగా ఉన్న శ్రీ వెంకటేశ్వ ఎంప్లాయిస్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్‌వీఈటీఏ) చైర్మన్ కోసం పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. టీటీడీ ఉద్యోగులకు, అర్చకులకు ఎస్‌వీఈటీఏ కేంద్రంగానే శిక్షణ ఇస్తుంటారు.

టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సోదరుడు, రిటైర్డ్ లెక్చరర్ భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి ఈ పదవిలో ఉన్నారు. ప్రభుత్వం మారడంతో ఆయన కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది.

అయితే ఎస్‌వీఈటీఏ డైరెక్టర్ పదవి కోసం రెండు సంవత్సరాల ప్రాతిపదికన నియమించేలా దరఖాస్తులు కోరుతూ ఇప్పటికే ప్రకటన ఇచ్చారు. కొత్తగా పలు నిబంధనలు జోడించారు. కొత్త నిబంధనల మేరకు భర్తీ చేస్తారా? లేక పాత విధానంలోనే భర్తీ చేస్తారా? అనే అంశంపై ఆశావహుల్లో చర్చ జరుగుతోంది

# పలాసలో భూ సేకరణ రగడ

శ్రీకాకుళం, నవంబర్ 27,పలాస నియోజకవర్గంలో నూతన ఎయిర్‌పోర్ట్ ఖాయమని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రెండుచోట్ల స్థలాన్ని పరిశీలించి ఎయిర్ పోర్ట్ అథార్టీకి ప్రాథమికంగా నివేదికను అందజేశారు. ఈ మేరకు రెండు రోజులపాటు అధికారుల బృందం పర్యటించి పరిశీలిస్తోంది. ఈ మేరకు గురువారం కేంద్ర బృందానికి ఆర్డీవో స్థలాలను చూపించారు. ఇప్పటికే ప్రభుత్వం నిధులు విడుదల చేయడం తెలిసిందే. ఈ మేరకు ఎయిర్పోర్టుకు చెందిన బృందం రావడంతో పలాస ఆర్డీవో జి. వెంకటేశ్వరరావు ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే గుర్తించిన స్థలాలను పరిశీలించారు. ఎయిర్ పోర్టుకు 1383.71 ఎకరాల విస్తీర్ణం అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో 295.12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, రైతుల నుంచి 1088.58 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని రెవెన్యూ అధికారులు ఎయిర్ పోర్ట్ అధికారులకు వివరించారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. మందస మండలంలో బిడిమి, బేతాళపురం, టి. గంగువాడ, వజ్రపుకొత్తూరు మండలంలోని చీపురపల్లి, మెట్టూరు ప్రాంతాలను ఎయిర్ పోర్ట్ అధికారులు సందర్శించి క్షేత్ర స్థాయిలో మట్టి, సముద్రతీరం, జాతీయ రహదారి ఇతరత్రా అంశాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ ప్రాంతంతో పాటు రాష్ట్రంలో మరో ఐదుచోట్ల ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి తగిన సూచనలు ఇచ్చారని అధికారులు స్థానికులతో ముచ్చటించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలించిన బృందం రెవెన్యూ అధికారులతో చర్చించారు. జియాలజిస్టులు కూడా ఈ బృందంతో పాటు ఉన్నారు. ఈ మినీ ఎయిర్ పోర్టు నిర్మాణంతో ఉద్దానం ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మూలపేట పోర్టు నిర్మాణం, ఇటు ఎయిర్ పోర్టు పూర్తి చేస్తే ఆంధ్రా- ఒడిశా సరిహద్దులో గల ఉద్దానం ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. తద్వారా స్థానికుల తలరాత మారే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్పోర్టు సన్నాహాల్లో మహర్దశ పట్టనుందని ఆర్డీవో వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సరిహద్దు ప్రాంతంలో ఇదివరకే నిర్ధారించిన స్థలాన్ని ఈ బృందానికి చూపించినట్లు తెలిపారు. సాధ్యసాధ్యాలపై వారు నిర్ణయం తీసుకుంటారని, స్థానికులు కూడా పోర్టు నిర్మాణానికి సహకరించాలన్నారు.పలాస నియోజకవర్గం మందస మండలం బేతాళపురం బిడిమి లక్ష్మి పురం వజ్ర కొత్తూరు మండలం చీపురుపల్లి మెట్టూరు ఈ రెండు ప్రాంతాల్లో రెండు ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. ఈ అంశంపై ఆదివారం పలాస సూది కొండ లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సభ్యులు మాట్లాడారు. ఎయిర్పోర్ట్ లకు 1400 ఎకరాలు భూసేకరణ చేయడానికి సిద్ధమయ్యారు. కానీ ఎయిర్‌పోర్టులు ఎందుకు వస్తున్నాయి, ఇవి అభివృద్ధి కొరకేనా, దీని ఎవరి ప్రయోజనాలు ఉన్నాయని ప్రశ్నించారు. ఉద్దానం ప్రజలకు ఎయిర్పోర్ట్ వలన ఏం ఉపయోగం ఉంటుందన్న చర్చ మొదలైంది. వాణిజ్య పంటలు పండుతున్నచోట 1400 ఎకరాలు ఎయిర్ పోర్ట్ కోసం సేకరించాల్సి ఉంటుంది. ఈ వివరాలతో కూడిన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా భూమిని గుర్తించి మార్కింగ్ చేయడం సరైన పద్ధతి కాదు వెనకబడ్డ ప్రాంతం ఉద్దానం అభివృద్ధి చేయాలంటే పరిపరిశ్రమలు కావాలి. ఆ పరిశ్రమలు కూడా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలై ఉండాలి. విదేశాలలో నిషేధం ఉన్న అన్ని ప్రాంతాల్లో కాదనే పరిశ్రమలు పొల్యూషన్ వెదజల్లే పరిశ్రమలు ప్రజలు ప్రాణాల్ని హాని కలిగించే పరిశ్రమలు ఈ ప్రాంతంలోకి ఎందుకు తెస్తున్నారని స్థానికంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో థర్మల్ పవర్ ప్లాంట్ లు తీసుకొచ్చారు. అప్పుడు జరిగిన పోరాటంలో ఆరుగురు మరణించారు ఇప్పటికే ఆ జీవోలు రద్దు లేదు విధ్వంసం వినాశనం చేసే వాటికి అభివృద్ధిని పేరు తగిలిస్తున్నారు.కోస్టల్ కారిడార్‌లో భాగంగా తీర ప్రాంత భూములు లక్షలాది ఎకరాలు సేకరణ చేస్తున్నారు. దీని వెనక ప్రభుత్వానికి ఒక వ్యూహం ఉంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో అప్పుడు కూడా ఈ ప్రాంతం మీద దృష్టి సారించారు.

# శ్రీశైలమల్లన్న భక్తులకు గుడ్ న్యూస్

శ్రీశైలం, నవంబర్ 37 కార్తీక మాసం కావడంతో అన్నీ దారులు జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం వైపే మళ్ళాయి. దీంతో మల్లన్న దగ్గరకు చేరాలంటే ట్రాఫిక్ సమస్యలను అధిగమించడం గగనమైపోతోంది. దేశ వ్యాప్తంగా శ్రీశైలం వస్తున్న శివయ్య భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా సమస్యను పరిష్కరించేందుకు రంగంలోకి దిగారు. ఈ నేపద్యంలో అధికారులతో మాట్లాడిన సీఎం శ్రీశైలం-హైదరాబాద్ హైవే రద్దీ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యపై ఈరోజు అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, శ్రీశైలం ఘాట్ రోడ్డుతో పాటు దేవాలయానికి వెళ్లే మార్గాల్లో రద్దీని చక్కదిద్దాలని సూచించారు.శ్రీశైలం ఘాట్ రోడ్ లో ఈ మధ్య కాలంలో రోజురోజుకూ వాహనాల రాకపోకలు పెరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను నివారించేందుకు శాశ్వత పరిష్కారానికి సమగ్ర అధ్యయనం చేపట్టాలని అధికారులకు నిర్దేశించారు ముఖ్యమంత్రి. కార్తీక మాసం కావడంతో వేలాదిగా భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వస్తున్నారని, అందువల్లే ట్రాఫిక్ పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.శ్రీశైలం ప్రాశస్త్యం తో పాటు పెద్ద ఎత్తున దేవాలయాన్ని అభివృద్ధి చేసే మాస్టర్ ప్లాన్ ను ప్రభుత్వం చేస్తోందని, ఈ నేపద్యంలో రానున్న రోజుల్లో పెరిగే రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# అమరావతి రాజధాని కోసం గెజిట్ దిశగా అడుగులు

అమరావతి, నవంబర్ 37, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి నగరాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి గెజిట్ జారీ చేసేలా చర్యలు చేపడతామని మంత్రి నారాయణ స్పష్టత ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత ఉమ్మడి రాజధాని గడువు జూన్2తో పూర్తైన నేపథ్యంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ ఈ క్లారిటీ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని పార్లమెంటు లో కేంద్రం గతంలోనే స్పష్టం గా చెప్పిందని, కేంద్రం అధికారిక గెజిట్ ను జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి నారాయణ ప్రకటించారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉమ్మడి రాజధాని గడువు జూన్2తో ముగిసిపోయింది. దానిని పొడిగించడం, యథాతథ స్థితిని కొనసాగించడం వంటి నిర్ణయాలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో అమరావతి రాజధానిపై స్పష్టత కొరవడింది.ఏపీ రాజధానిగా అమరావతిని దాదాపు పదేళ్ల క్రితం ఖరారు చేశారు. 2019 వరకు దాదాపు రూ.10వేల కోట్లను రాజధాని నిర్మాణం కోసం ఖర్చు చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని నిర్మాణం నిలిపివేశారు.

పరిపాలన రాజధాని నగరాన్ని విశాఖపట్నం మార్చాలని భావించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలతో పాటు పెట్టుబడిదారుల్లో కూడా స్పష్టత కొరవడింది. ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆర్నెల్లు గడుస్తున్న అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ కేంద్రం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడక పోవడంతో భవిష్యత్తుపై సందేహాలు నెలకొన్నారు.2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత అదే ఏడాది చివరిలో గుంటూరు-విజయవాడ మధ్య కృష్ణా తీరంలో ఉన్న ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

2015 జనవరిలో ల్యాండ్ పూలింగ్ ప్రారంభించి రాజధాని కోసం భూ సమీకరణ ప్రారంభించారు. భూసేకరణ, ప్రభుత్వ భూములు, రైతుల నుంచి సమీకరించిన భూములతో కలిపి దాదాపు 51వేల ఎకరాల విస్తీర్ణంలో అమరావతి నిర్మాణాన్ని చేపట్టారు. 2019నాటికి దాదాపు రూ.10వేల కోట్ల రుపాయలను అమరావతిలో ఏపీ ప్రభుత్వం ఖర్చు చేసింది.2019జూన్‌లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో అమరావతిని తొలగించారు. రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థను అమరావతి ప్రాంతానికి పరిమితం చేశారు. ఈ మేరకు అమరావతి పరిధి, విస్తృతిని కుదిస్తూ జగన్ ప్రభుత్వం అసెంబ్లీలో చట్ట సవరణలు చేసింది.అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా కాకుండా పరిపాలన రాజధానిని విశాఖపట్నంకు, శాసన వ్యవస్థను అమరావతికి, న్యాయవ్యవస్థను కర్నూలుకు మారుస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై దాదాపు మూడేళ్ల పాటు రకరకాల వివాదాలు, న్యాయపోరాటాలు జరిగాయి. చివరకు ఏపీ హైకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయపరమైన వివాదాలను కొలిక్కి తెచ్చేందుకు 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మూడు రాజధానుల వ్యవహారంలో వైసీపీ ప్రభుత్వం వెనకడుగు వేసింది.ఏపీలో టీడీపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు సమీపిస్తోంది. ఇప్పటి వరకు రెండు విడతల్లో అసెంబ్లీ సమావేశాలు, నాలుగు సార్లు క్యాబినెట్ సమావేశాలు జరిగాయి. వీటిలో అమరావతి అంశం తెరపైకి రాలేదు. 2024 జూన్2తో ఉమ్మడి రాజధాని గడువు ముగిసిపోయింది. అమరావతి భౌగోళిక పరిధిని పూర్వపు స్థితికి తీసుకు వచ్చే ప్రక్రియ కూడా జరగలేదు.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాజధాని వివాదానికి ముగింపు పలకాలనే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఈ ఏడాది దాదాపు రూ.15వేల కోట్ల రుపాయలను అంతర్జాతీయ సంస్థల ద్వారా రుణంగా ఇప్పించేందుకు కేంద్రం గ్యారంటీ ఇస్తోంది. విభజన చట్టం ప్రకారం ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో ఏపీ రాజధానిని నోటిఫై చేయాలనే షరతు విధించే అవకాశమున్నట్టు తెలుస్తోంది. కేంద్రం ద్వారా విడుదలయ్యే నిధులకు రాజధాని నగరాన్ని నోటిఫై చేయాలనే షరతు విధించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రత్యేక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో తలెత్తే అన్ని రకాల వివాదాలకు ముగింపు పలికేలా చట్టబద్దమైన నిర్ణయం తీసుకునే అవకాశం లేకపోలేదని బీజేపీ వర్గాలు తెలిపాయి. గతంలో టీడీపీ చేసిన చట్టాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం, వేల కోట్ల రుపాయల నిర్మాణాలను నిరుపయోగంగా మార్చి రాజధాని నిర్మాణంలో జాప్యం చేయడం వంటి అంశాలను కేంద్రం పరిశీలనలో ఉన్నాయని చెబుతున్నారు. మరోవైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ వాటాగా రావాల్సిన షెడ్యూల్ 9,10 ఆస్తుల విభజనను కేంద్రం ఎలా పరిష్కరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణంలో భాగంగా అమరావతిలో నిర్మించే ఐదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు డిజైన్లను నార్మన్ పోస్టర్ సంస్థ రూపొందించింది. గత వైసీపీ ప్రభుత్వం నార్మన్ పోస్టర్స్ సంస్థ టెండర్ ను, వారి డిజైన్లను రద్దు చేసిందిఅందుకే మళ్లీ ఈ భవనాల డిజైన్ల కోసం టెండర్లు పిలిచాం, ఆ టెండర్లు కూడా నార్మన్ పోస్టర్స్ సంస్థకే వచ్చాయని తిరిగి అదే సంస్థకు టెండర్లు ఖరారు చేసినట్టు మంత్రి నారాయణ వివరించారు.సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో వాటికి ఆమోదాన్ని తెలియచేశామని, త్వరలోనే వీటి తుది డిజైన్లకు సంబంధించిన ఉత్తర్వులు ఇస్తామన్నారు. గత ప్రభుత్వం ఎలాంటి నోటీసు లేకుండా టెండర్లు రద్దు చేయటంతో నార్మన్ పోస్టర్స్ ఆర్బిట్రేషన్ వేసిందని, అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కేంద్రంలో వారికి 9 కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఫలితంగా మళ్లీ రీటెండర్ పిలవాల్సి వచ్చిందని, రాజధాని ప్రాంతంలో నిర్మాణాలకు సంబంధించి పనులు త్వరలోనే మొదలు అవుతాయని చెప్పారు.

ప్రపంచ బ్యాంకు రుణానికి ఎలాంటి ఇబ్బంది లేదు, దశలవారీగా రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఇప్పటికే ముందుకు వచ్చిందని, రాజధానికి సంబంధించి కేంద్రం నుంచి నోటిఫికేషన్ వస్తుందని మంత్రి నారాయణ చెబుతున్నారు.

# గ్రీన్ ఎనర్జీ కొనుగోళ్లలో జగన్ బుక్కైనట్టేనా

విజయవాడ, నవంబర్ 27, అమెరికాలో కేసు.. దేశాన్ని ఊపేస్తున్న వ్యవహారం.. అపోజిషన్ నేతను టార్గెట్ చేస్తున్న తీరుతో.. సోలార్ పవర్ కొనుగోళ్ల కేసు ఓవర్ టు ఏపీ అయిపోయింది. దేశం మొత్తం అదానీ సెంట్రిక్‌గా చర్చ జరుగుతుంటే ఏపీలో మాత్రం జగన్‌ను కార్నర్ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జగన్‌ను ప్రాసిక్యూట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోందట రాష్ట్ర ప్రభుత్వం. విద్యుత్ కొనుగోలు అగ్రిమెంట్ వ్యవహారంలో అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ గౌతమ్ అదానీతో పాటు ఆయన సన్నిహితులపై కేసు పెట్టింది.2021లో ఏపీ ప్రభుత్వం 7 వేల మెగావాట్ల సోలార్ పవర్ విద్యుత్‌ను కొనడానికి రూ.1750 కోట్ల లంచం ఇచ్చారని..ఈ వ్యవహారంలో అప్పటి ఏపీ సీఎం ఉన్నారని ప్రస్తావించారు.

దీని ఆధారంగా జగన్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టొచ్చా అన్న కోణంలో కూటమి ప్రభుత్వం న్యాయ నిపుణుల సలహా కోరినట్లు తెలుస్తోంది. జగన్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ అనుమతి కోరాలని కూడా ఏపీ ప్రభుత్వం భావిస్తోందట.జగన్ మీద యాక్షన్ తీసుకోవడానికి ఏపీ సర్కార్‌కు లీగల్‌గా ఎంతవరకు అవకాశం ఉందనేది ఇక్కడ హాట్ టాపిక్‌గా మారింది. అమెరికాలో నమోదైన కేసుల వ్యవహారం.. ఇష్యూ కేంద్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసేలా సిచ్యువేషన్స్ కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో జగన్ మీద చర్యలకు ఏపీ ప్రభుత్వం ముందడుగు వేయడం సాధ్యమేనా అన్న చర్చ జరుగుతోంది.సెకీతో పవర్ అగ్రిమెంట్లు చేసుకున్నాయి రాష్ట్ర ప్రభుత్వాలు. సెకీ కేంద్రప్రభుత్వ సంస్థ. ఒకవేళ ఏపీలో జగన్ మీద కేసు పెడితే సెకీ కూడా కార్నర్ అయ్యే అవకాశం ఉంటుంది. అంతేకాదు అదానీ వరకు వ్యవహారం వెళ్లే చాన్స్ లేకపోలేదు. అలా జరిగితే కేంద్రప్రభుత్వం ఇరకాటంలో పడే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి సిచ్యువేషన్స్‌లో ఏపీ సర్కార్ వేసే అడుగులు కీలకంగా మారనున్నాయి.జగన్‌ను కార్నర్ చేయబోతే.. సెకి, అదానీని కేసులో ఇన్వాల్వ్ చేయాల్సి ఉంటుందని అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ఎన్డీయేలో కీలకంగా ఉన్న టీడీపీ అంతదూరం వెళ్తుందా అనేదే ఇంట్రెస్టింగ్‌గా మారింది. అయితే ప్రస్తుతం కూటమి నేతల విమర్శలు చూస్తుంటే మాత్రం జగన్ అడ్డగోలుగా దోచుకున్నారని ఎక్స్‌పోజ్ చేయాలని ఫిక్స్ అయినట్లు కనిపిస్తోంది. దానికి ఆధారంగా యూఎస్‌లో నమోదైన కేసును ఎంగ్జామ్ పుల్‌గా చూపిస్తోంది.అంతేకాదు జగన్, అదానీ మూడుసార్లు భేటీ అయ్యారని..ఆ మీటింగ్ వివరాలు ఎందుకు రహస్యంగా ఉంచారని ప్రశ్నిస్తోంది టీడీపీ. పవర్ పర్చేస్‌కు సంబంధించిన ఫైల్‌కు కేవలం ఏడు గంటల్లోనే ఆమోదం తెలిపారని ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి రూ.1.10 లక్షల కోట్ల విలువ చేసే విద్యుత్ కొనుగోళ్ల ఫైల్‌ను ఆర్థికశాఖ ఆఘమేఘాల మీద ఆమోదించిందని అలిగేషన్స్ చేస్తున్నారు కూటమి నేతలు. దీనివెనుక ప్రభుత్వ పెద్దలు ఎంతగా ఒత్తిడి చేయకుంటే ఫైల్ అంత తొందరగా కదులుతుందో చెప్పాలంటూ క్వశ్చన్ చేస్తున్నారు.అయితే కూటమి నేతల ఆరోపణలకు బలం చేకూర్చేలా మాజీమంత్రి బాలినేని శ్రీనివాస్ చేసిన కామెంట్స్ చర్చనీయాంశం అవుతున్నాయి. పవర్ కొనుగోళ్ల ఫైల్ మీద సంతకం కోసం తనను అర్ధరాత్రి నిద్రలేపారని ఆయన చెప్పిన మాటలు ఇప్పుడు హాట్ టాపిక్ అవుతున్నాయి. మిడ్ నైట్ సంతకం పెట్టుమంటున్నారంటే ఏదో ఉందని గ్రహించే తాను సైన్ చేయలేదని తర్వాత క్యాబినెట్‌లో పెట్టి ఆమోదం తెలిపారని బాలినేని అంటున్నారు.

అలా అగ్రరాజ్యంలో కేసు..బాలినేని వ్యాఖ్యలతో కూటమి నేతలు వైసీపీని, జగన్‌ను కార్నర్ చేస్తున్నారు.అయితే పవర్ పర్చేస్ అగ్రిమెంట్ మీద ఏపీ సర్కార్ దర్యాప్తు చేయడం, పొలిటికల్‌గా..లీగల్‌పరంగా అంత ఈజీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. టీడీపీ ఎన్డీయేలో భాగంగా ఉండటంతో విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో కూటమి దూకుడుగా వెళ్లే అవకాశం లేదన్న చర్చ జరుగుతోంది. లీగల్‌గా కూడా అమెరికాలో కేసు ఉండటం..కేంద్రప్రభుత్వమే అదానీ మీద యాక్షన్ తీసుకోవడానికి ఎలాంటి స్టెప్ వేయకపోవడంతో..ఏపీ సర్కార్ చేసేదేం ఉండదని అంటున్నారు ఎక్స్‌పర్ట్స్.ఇదంతా రాజకీయ, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్న ఇష్యూ అంటున్నారు. సో జగన్ కరప్షన్‌కు పాల్పడ్డారని ఎక్స్‌పోజ్ చేయడం తప్ప ఏపీ సర్కార్ యాక్షన్ తీసుకోవడానికి అవకాశాలు తక్కువే ఉన్నాయంటున్నారు.

కూటమి నేతలు మాత్రం పవర్ పర్చేస్ అగ్రిమెంట్ ఫైల్ ఆమోదం ప్రాసెస్ తీరును హైలెట్ చేస్తున్నారు. అంత తొందరగా గంటల వ్యవధిలో ఆమోదం తెలిపారంటేనే ఏదో ఇలఖత మాఫియా జరిగిందని ఆరోపిస్తున్నారు. ఇలా ఓవరాల్ ఎపిసోడ్ చూస్తుంటే ఈ ఐదేళ్లు ఈ టాపిక్ పొలిటికల్‌గా డైలీ ఎపిసోడ్‌లాగే కొనసాగే అవకాశమే కనిపిస్తోంది.

# దిలావర్ పూర్ లో ఉద్రిక్తత..ఆర్డీవో నిర్బంధం

నిర్మల్ జిల్లా లో ఇతనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు ను నిరసనగా మంగళవారం ఉదయం నుంచి దిలావర్ పూర్ -గుండం పల్లి గ్రామస్తులు జాతీయ రహదారి దిగ్బందించారు. అక్కడికి వెళ్లి ఆర్డీవో రత్న కల్యాణి ని చుట్టు ముట్టారు. వాహనం తో సహా నిర్బంధించారు. ఈ క్రమంలో ఆర్డీవో ను వదలి పెట్టాలని ఎస్పీ జానకి షర్మిల పలు మార్లు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వచ్చి హామీ ఇస్తేనే ఆందోళన విరామిస్తామని స్పష్టం చేశారు. రాత్రి అయినా కూడా ఆందోళన కొనసాగడం తో ప్రత్యేక బలగాల ను తెప్పించారు. ఆర్డీవో ను సురక్షితంగా ఆందోళన కారుల నిర్బంధం నుంచి విడిపించి జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ప్రజలు అడ్డుకోవడం తో తోపులాట జరిగింది.ఆర్డీవో వాహనాన్ని ఆందోళన కారులు ధ్వంసం చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో అదానీ ప్రకంపనలు



అదానీ పేరు ఈ మధ్య కాలంలో ప్రతీ రాజకీయ నేత కామెంట్స్‌లో వినబడుతోంది. ఇప్పటి వరకు దేశ రాజకీయాల్లో గట్టిగా వినిపించే అదానీ పేరు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అదానీతో ఒప్పందాలే తప్పు అన్నట్టు సీన్ మారింది. ఇటీవల కాలంలో అదానీ వ్యాపారాలపై వస్తున్న విమర్శలు కారణంగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. దేశ సంపన్నుల జాబితాలో గౌతమ్ అదానీది రెండో స్థానం. ఆయనకు చాలా వ్యాపారాలు ఉన్నాయి. ఇటీవల అమెరికా సెక్యూరిటీస్ అండ ఎక్స్చేంజ్ కమిషన్, ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ ప్రకారం 5 రాష్ట్రాల్లో సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు ముడుపులు ఇచ్చారని ఆరోపణ. కీలక వ్యక్తులకు 2,029 కోట్లు చెల్లించారన్నట్టు విమర్శలు ఉన్నాయి. ఏపీలోని కీలక వ్యక్తులకు 1750 కోట్లు చెల్లించారని ఎఫ్. బీ. ఐ ప్రకటనలో తేలింది. ఇది ఇప్పుడు ఏపీలో అప్పట్లో సీఎంగా ఉన్న జగన్ మెడకు చుట్టుకుంటుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ వివాదంపై అప్పటి ఏపీ విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు. అర్ధరాత్రి సంతకం చేయమని ఒత్తిడి చేస్తే తాను చేయలేదని చెప్పారు. కేబినెట్ మీటింగ్‌లో ఈ ఒప్పందానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుందని వివరించారు. ఆ విషయంలో వాస్తవాలు తనతో చర్చించలేదని, అందుకే అర్ధరాత్రి సంతకం చేసేందుకు నిరాకరించినట్లు చెప్పారు. ఇందులో తన ప్రమేయం ఏదీ లేదన్నారు. ముడుపుల విషయం ఏదీ తనకు తెలియదని అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలి నేని స్పష్టం చేశారు. మంత్రిగా ఆ ఒప్పందంలో, ముడుపుల ఆరోపణల్లో తన ప్రమేయం ఏదీ లేదని అప్పటి సీఎం జగన్ ప్రమేయం ఉన్నట్లు తేల్చేశారు. దీంతో ఇది వైఎస్ఆర్సీపీకి రాజకీయంగా దెబ్బ తగిలింది. ముడుపుల చెల్లింపు విషయంలో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు మాత్రం జగన్ టార్గెట్‌గా స్పందించారు. జగన్ అవినీతి విశ్వవ్యాప్తమైందని విమర్శించారు. అమెరికాలో కేసు వివరాలు అన్నీ తమ వద్ద ఉన్నాయని దీనిపై చర్య తీసుకుంటామన్నారు. అయితే దీనిపై ఏపీ కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో అన్నది ఆసక్తి కరంగా మారింది. ఈ ఒప్పందంపై పూర్తి దర్యాప్తు చేస్తారా లేదా ఒక వేళ చేస్తే ఆ పర్యవసానాలు జగన్‌కే పరిమితం అవుతాయా లేదా అంతకు మించి విస్తరిస్తాయా అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే ఏపీలో కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీ గ్రూప్ లీజుకు తీసుకుంది. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది అన్నది ఆసక్తికరం. రాజకీయంగా మాత్రం జగన్‌ను ఇబ్బంది పెట్టే విషయం చంద్రబాబుకు దొరికినట్లే అంటున్నారు. మరి రానున్న రోజుల్లో దీనిపై చంద్రబాబు సర్కార్ ఎలా వ్యవహరిస్తుందో అన్నది మాత్రం వేచి చూడాలి. యూఎస్ సెక్యూరిటీ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ ఆరోపించిన వెంటనే వైఎస్ఆర్సీపీ స్పందించింది. ఏపీ ప్రభుత్వానికి ముడుపుల ఆరోపణలకు సంబంధం లేదని తోసిపుచ్చింది. ఏపీలో 7 గిగా వాట్ల సోలార్ పవర్ కోసం తాము అదానీ గ్రూప్‌తో ఒప్పందం చేసుకోలేదని తేల్చిచెప్పింది. సోలార్ పవర్ కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( సెకీ )తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని వివరించింది. జగన్ సర్కార్ ముడుపులు తీసుకున్నారని టీడీపీ నేతలు విమర్శలు చేస్తుంటే, అదానీ గ్రూప్‌తో నేరుగా ఒప్పందమే చేసుకోనప్పుడు ముడుపుల ఆరోపణలు ఎలా వస్తాయని వైసీపీ కౌంటర్ ఎటాక్ చేస్తోంది. ఇలా తాజా రాజకీయాల్లో ఏపీలో అదానీ వ్యవహారం రాజకీయ రచ్చకు దారి తీసింది. ఏపీలో ముడుపుల వ్యవహారం వెలుగు చూడటంతో తెలంగాణలో కూడా రాజకీయ ఆరోపణలు వచ్చాయి. రాజకీయంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర ఆరోపణలకు దిగాయి. అదానీ మీకు ఫ్రెండ్ అంటే మీకు ఫ్రెండ్ అని ఎదురు దాడికి దిగే పరిస్థితి నెలకొంది. ఒక్క సారిగా ఈ విషయం తెలంగాణలో పొలిటికల్ హీట్ ను పెంచింది. బీజేపీ పై విమర్శలు గుప్పించే ప్రతీ సారి ఆ పార్టీ అదానీ- అంబానీల కోసమే పని చేస్తుందన్నది బీఆర్ఎస్ ప్రధాన ఆరోపణ. రైతులను, పేద ప్రజలను వదిలి సంపన్నుల కోసం పని చేసే ప్రభుత్వం మోదీ ప్రభుత్వం అన్నది గులాబీ పార్టీ నేతలు చేసే విమర్శ. అంతే కాకుండా రేవంత్ సర్కార్‌ను కూడా టార్గెట్ చేశారు. స్కిల్ యూనివర్సిటీకీ అదానీ నుంచి వంద కోట్ల విరాళం, అదానీ గ్రూప్‌తో 12,400 కోట్ల ఒప్పందాలపై విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి కేంద్రంగా విమర్శలు చేశారు. ఓ వైపు అదానీ వ్యాపార శైలి, మోదీతో సాన్నిత్యంపై రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే, ఇక్కడి కాంగ్రెస్ సర్కార్ అంటకాగుతుందని విమర్శలు చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు అదానీని తెలంగాణలో అడుగు పెట్టనీయ లేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెడ్ కార్పేట్ వేస్తున్నారని ఆరోపించారు. అవినీతి సొమ్ము కోసమే ఇదంతా చేస్తున్నారని విమర్శలకు దిగారు. తెలంగాణలో రేవంత్ సర్కార్ డ్యామెజ్ కంట్రోల్‌కి దిగింది. తన డ్రీమ్ ప్రాజెక్టు అయిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి ప్రకటించిన వంద కోట్ల విరాళాన్ని తిరస్కరించింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గౌతమ్ అదానీ భేటీ తర్వాత ఈ విరాళం ప్రకటించారు. ఆ తర్వాత దావోస్‌లో 12,400 కోట్ల పెట్టుబడులు తెలంగాణలో పెట్టేందుకు ఒప్పందం జరిగింది. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణే తమ ప్రధాన ధ్యేయమని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఓవైపు అదానీతో వ్యాపార ఒప్పందాలపై బీఆర్ఎస్ నుంచి విమర్శలు వస్తున్నా రేవంత్ పట్టించుకోలేదు. అయితే అదానీపై అమెరికాలో కేసు వ్యవహారం వెలుగు చూడటంతో ఒక్కసారిగా రేవంత్ రూట్ మార్చారు. రాజకీయంగా ఇది ఇబ్బంది పెట్టకూడదన్న ఆలోచనతో స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన వంద కోట్లు తిరస్కరిస్తూ లేఖ రాశారు. రాజకీయంగా నష్టం జరగకుండా జాగ్రత్త పడినట్లు ఈ నిర్ణయం ద్వారా అర్థం అవుతుంది. 12400 కోట్ల పెట్టుబడుల విషయంలో ఏం చేస్తారని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. దీంతో రేవంత్ సర్కారు నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. ఏది ఏమైనా అదానీ వ్యాపార శైలి అటు జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రకంపనలు రేపుతున్నాయి. ఆ కాకా రెండు తెలుగు రాష్ట్రాలను తాకడం విశేషం.

## రఘురామను చిత్రహింసలు పెట్టిన కేసు - విజయ్ పాల్ అరెస్టు

## సుదీర్ఘ విచారణ తర్వాత విజయ్పాల్ను అరెస్టు చేసిన పోలీసులు

ఒంగోల మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న సీఐడీ విశ్రాంత అడిషనల్ ఎస్పీ ఆర్. విజయ్ పాల్ ను పోలీసులు అరెస్టు చేశారు. విజయ్ పాల్ మంగళవారం ఉదయం ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి విచారించిన పోలీసులు, రాత్రి 9 గంటల సమయంలో విజయ్ పాల్ ను అరెస్టు చేశారు. రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూవిజయపాల్ దాఖలు చేసిన పిటిషన్ను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయన మంగళవారం ప్రకాశం జిల్లా పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

రాత్రికి స్టేషన్లో ఉంచేందుకు ఏర్పాట్లు: ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు సుదీర్ఘంగా విజయ్పాల్ను విచారించారు. అనంతరం విజయ్ పాల్ ను అరెస్టు చేసినట్లు ఎస్పీ దామోదర్ ప్రకటించారు. ఈ మేరకు విజయ్ పాల్ రిమాండ్ రిపోర్టును పోలీసులు సిద్ధం చేశారు. విజయ్ పాల్ ను రాత్రికి ఒంగోలు పోలీస్ స్టేషన్లోనే ఉంచారు. బుధవారం ఉదయం గుంటూరు తరలించారు.

## 40 ఏళ్ల తర్వాత పాన్ కార్డులో మార్పులు

ముంబై, నవంబర్ 27, మన దేశంలో ఆర్థిక, పన్ను వ్యవస్థలను ఆధునీకీకరించాలని కేంద్రం భావిస్తోంది. ఇందుకు కీలకమైన ఆధార్, పాన్‌కార్డులను అప్‌డేట్ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆధార్ జారీ అయి పదేళ్లు పూర్తయినవారు అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తోంది. అప్‌డేట్ చేసుకోకుంటే కార్డు రద్దు చేస్తామని హెచ్చరిస్తోంది. ఇప్పటికే ఫ్రీ అప్‌డేట్ గడువును నాలుగుసార్లు పెంచింది. ఇక ఆధార్‌తోపాటు మరో ముఖ్యమైన కార్డు పాన్ కార్డు. బ్యాంకు లావాదేవీలకు తప్పనిసరి. వేతన జీవులకు తప్పనిసరి. దీనిని ఆధార్‌తో అనుసంధానం చేస్తోంది. ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. అయినా పన్ను ఎగవేతదారులు తగ్గడం లేదు. ఈ తరుణంలో పాన్ కార్డును అప్‌డేట్ చేయాలని కేంద్రం భావిస్తోంది. పాన్ 2.0 ప్రారంభించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కొత్త కార్డులు లేటెస్ట్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి పౌరులకు సేవలందిచడానికి ఉపయోగపడతాయని కేంద్రం అంటోంది. ఆదాయపు పన్న ఎగవేత దారులను గుర్తించేందుకు పన్ను చెల్లింపుల్లో పారదర్శకత కోసం ఆదాయపు పన్న చట్టంలోని సెక్షన్ 139 ఏ కింద 1972లో పాన్ కార్డును కేంద్ర ప్రారంభించింది. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు పాన్‌కార్డును అప్‌డేట్ చేయలేదు. డిజటల్ చేసినా.. పూర్తిస్థాయిలో అప్‌డేట్ చేయలేదు. దీంతో తాజాగా మోదీ ప్రభుత్వం పాన్ కార్డు 2.0ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రస్తుతం దేశంలో 78 కోట్లకుపైగా సాధారణ పాన్‌కార్డు ఉన్నాయి. రాబోయే రోజుల్లో క్యూఆర్ కోడ్‌తో కొత్త పాన్‌కార్డు పంపిణీ చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. పాన్‌కార్డు అప్‌గ్రేడ్ కోసం కేంద్రం రూ.1,435 కోట్లు కేటాయించింది. ఈమేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదాయపు పన్నులో పారదర్శకత పెంచేందుకు పాన్ 2.0 తీసుకురానున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈమేరు క్యాబినెట్ కమిటీ పాన్ 2.0కు ఆమోదం తెలిపింది. భద్రతను దృష్టిలో ఉంచుకుని పాన్ 2.0 ప్రవేశ పెడుతున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.

## నకిలీ యాంటిబయాటిక్స్ గుట్టు రట్టు

సిద్దిపేట: నకిలీ యాంటీబయాటిక్స్ ని డ్రగ్ కంట్రోల్ బ్యూరో పట్టుకుంది. నిందితులు ప్రముఖ కంపెనీ పేరుతో నకిలీ యాంటీబయాటిక్ తయారు చేస్తున్నారు. కోటిన్నర రూపాయల విలువచేసే నకిలీ యాంటీబయాటిక్ స్వాధీనం చేసుకున్నారు. జోడాస్ ఎక్స్పో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బయోటిక్స్ తయారీ అవుతోంది. నకిలీ యాంటీబయాటిక్స్ ని ప్రముఖ కంపెనీలకు జోడాస్ సరఫరా చేస్తుంది. నకిలీ యాంటీబయాటిక్స్ని రక్షా కూడా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

# ఇండియా కూటమిలో లుకలుకలు

ముంబై, నవంబర్ 27, మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమి ఓటమి అంతర్గత విమర్శలకు దారితీస్తోంది. రాహుల్ గాంధీ మొండితనం కారణంగా మహారాష్ట్రలో కూటమి ఓడిపోయిందన్న విమర్శలు వస్తున్నాయి. బీజేపీ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో కూటమి భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం అవుతున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ప్రభావం ఇండియన్ నేషనల్ డెవలప్ మెంట్ ఇన్ క్లూజివ్ అలయన్స్ (ఇండియా) కూటమిపై భారీగానే పడింది. మహారాష్ట్రలో కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)ను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలోని మహాయుతి చిత్తుగా ఓడించింది. ఈ నేపథ్యంలో కూటమి లోని కొన్ని పార్టీలు కాంగ్రెస్ పెద్దన్న తరహాను ప్రశ్నిస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం, తొలిసారి కూటమి పార్టీల సమావేశాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) హాజరు కాలేదు. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ నాయకులు కోల్ కతాలో తమ జాతీయ కార్యవర్గ సమావేశంలో బిజీగా ఉన్నారని వారు సమాచారమిచ్చారు. పశ్చిమ బెంగాల్లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో మొత్తం ఆరు అసెంబ్లీ స్థానాలను టీఎంసీ గెలుచుకుంది. ఇది ఆ పార్టీ ఆత్మ విశ్వాసాన్ని బాగా పెంచింది. విపక్ష ఇండియా కూటమి నాయకత్వ బాధ్యతలను మమత బెనర్జీకి అప్పగించాలని టీఎంసీ నేతలు కోరుతున్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కునాల్ ఘోష్ ఇండియా కూటమిలో కాంగ్రెస్ 'బిగ్ బ్రదర్' వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. మమతా బెనర్జీ ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీని అడ్డుకుంటున్నారు. జార్ఖండ్ లో కూడా హేమంత్ సోరెన్ బీజేపీని అడ్డుకున్నారు. కానీ మహారాష్ట్రలో వారు (కాంగ్రెస్) బిజెపిని ఆపలేకపోయారు" అని ఘోష్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఆత్మ విమర్శ చేసుకోవాలని, తమ తీరును విశ్లేషించుకోవాలని ఆయన సూచించారు. బెంగాల్, జార్ఖండ్ లలో బీజేపీని అడ్డుకోగలిగినప్పుడు.. హర్యానా, మహారాష్ట్రలో బీజేపీని అడ్డుకోవడంలో కాంగ్రెస్ ఎందుకు విఫలమైందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎందుకు ఓడిపోయిందో విశ్లేషించుకోవాలన్నారు. కాంగ్రెస్ బీజేపీని నిలువరించలేకపోతోందన్నారు. మమతా బెనర్జీని బీజేపీ నాయకురాలిగా చేయాలని ఆ పార్టీ నేత కల్యాణ్ బెనర్జీ సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తీరుపై కూడా కూటమి నేతలు కొంత అసహనంగా ఉన్నారు. కూటమిలోని ఇతర పార్టీల సూచనలను పట్టించుకోవడం లేదని, మొండిగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని మహా వికాస్ అఘాడీ కూటమి ఓటమి పాలు కావడం వెనుక రాహుల్ గాంధీ మొండి వైఖరి కూడా ఒక కారణం అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమిలోని ఇతర పార్టీలైన ఎన్సీపీ, శివసేన (ఉద్ధవ్) పదేపదే వారించినప్పటికీ.. రాహుల్ గాంధీ మొండిగా వీర్ సావర్కర్ పై విమర్శలు చేశారని, అది మహారాష్ట్రలో ప్రతికూల ప్రభావం చూపిందని వారు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, కులగణన అంశం కూడా ప్రతికూల ప్రభావం చూపిందని, రాహుల్ గాంధీ కుల సర్వేకు డిమాండ్ చేయడం, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తారన్న బీజేపీ వాదనను కాంగ్రెస్ తిప్పికొట్టలేకపోవడం ప్రతిపక్ష కూటమికి నష్టం కలిగించాయని తెలిపారు.

# విశాఖ రైల్వే జోన్ కు బిడ్డింగ్

విశాఖపట్టణం, నవంబర్ 27, ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశ వైజాగ్ రైల్వే జోన్ సాకారం కానుంది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం కోసం టెండరును పిలిచారు. డిసెంబర్ 2న ప్రీ బిడ్ నిర్వహిస్తారు. డిసెంబర్ 13 నుంచి బిడ్డింగ్ ప్రారంభం కానుంది. విశాఖ రైల్వే జోన్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. రైల్వే జోన్ నిర్మాణానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తరపున ఈ టెండర్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బిడ్డింగ్ వేసేవారు ఒరిజినల్ డాక్యూమెంట్లను సమర్పించాలని పేర్కొన్నారు. జోన్ కార్యాలయం నిర్మాణానికి రూ.149.16 కోట్లు అంచనా వ్యయంతో డీపీఆర్ కేంద్రానికి గతంలోనే పంపారు. రైల్వే జోన్ నిర్మాణానికి అధ్యయనాలు పూర్తి కావడంతో విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయ నిర్మాణానికి కేంద్ర రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం టెండర్లను రైల్వే జోన్ ప్రధాన భవన కార్యాలయ నిర్మాణానికి గానూ పిలిచారు. డిసెంబర్ 27లోపు టెండర్లను దాఖలు చేయాల్సి ఉంది. ఈనెల 29న విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా రైల్వే జోన్ ఆఫీసుకు పునాదిరాయి వేయాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. గతంలో ఆరిలోవ ప్రాంతంలోగల ముషిడివాడలో 'రైల్వే శాఖకు చెందిన 53 ఎకరాల్లో దక్షిణ కోస్తా రైల్వేజోన్ భవనాన్ని నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు పంపినా ఈ స్థలాన్ని కేంద్రం ఆమోదించలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైల్వేజోన్ స్థాపనకు తొలి అడుగు పడడం మంచి పరిణామంగా పలువురు అభిప్రాయ పడుతున్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు ఎదురుగా గల డాబాగార్డెన్స్ వద్ద వైర్‌లెస్ కాలనీలోని పదహారున్నర ఎకరాల రైల్వే స్థలంలోనే 11 అంతస్థుల భారీ భవన నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలోనే ఇక్కడ పాడుబడిన రైల్వే క్వార్టర్లను తొలగించి రైల్వే శాఖ చదును చేసి సిద్ధం చేసింది. 9 అంతస్థులు, రెండు సెల్లార్ పార్కింగ్ ఫ్లోర్లతో కలిపి మొత్తంగా 11 అంతస్తుల్లో దక్షిణ కోస్తా రైల్ జోనల్ మేనేజర్ కార్యాలయాన్ని నిర్మాణం చేయనున్నారు. టెండర్లను సైతం పిలవడంతో డిసెంబర్ 27లోపు కొన్ని టెండర్లు దాఖలవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. జోన్ కార్యాలయం కోసం రూ.149.16 కోట్లు అంచనా వ్యయం అవుతుందని కేంద్రానికి గతంలోనే డీపీఆర్ పంపించడం జరిగింది. దీన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని కేంద్ర రైల్వే మంత్రి వైష్ణవ్ రైల్వేకు ఆదేశించారు. దక్షిణ కోస్తా రైల్వే జోనల్ కార్యాలయ ఎలక్ట్రికల్ ఎస్టిమేట్లను రెండు రోజుల క్రితం కేంద్రం ఆమోదించింది. సుమారు రూ.15.7 కోట్లు ఆమోదం పొందింది. జోన్ కార్యాలయానికి చెందిన ప్రతిపాదిత డిజైన్‌ను భువనేశ్వర్ 'కేంద్ర రైల్వే అధికారులు సైట్ సర్వే ప్లాన్, మాస్టర్ ప్లాన్, ఏరియల్ వ్యూ, ఫ్రంటెండ్ వ్యూ, స్ట్రీట్ వ్యూ, ఎంట్రన్స్ వ్యూ ఇలా అన్ని వైపుల నుంచీ డిజైన్‌ను తయారు చేసి వాల్తేరు రైల్వే అధికారులకు పంపిచారు. రైల్వే జోన్ భవన నిర్మాణానికి పునాది రాయితో ఆగకుండా పనులు ముందుకు సాగుతాయా? అన్నది చూడాల్సిందే.

# తెలంగాణ సర్కార్‌కు రిటైర్మెంట్ టెన్షన్..

# మూడేళ్ల తర్వాత భారీగా రిటైర్ కానున్న ఉద్యోగులు

హైదరాబాద్ నవంబర్ 27, తెలంగాణ సర్కార్‌ను ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ టెన్షన్ పెడుతోంది. బీఆర్ఎస్ సర్కార్ చేసిన చిన్న పొరపాటు.. కాంగ్రెస్ సర్కార్‌కు గుదిబండలా మారింది. రిటైర్ అయ్యే ఉద్యోగులకు సెటిల్మెంట్ తలనొప్పిగా మారింది.

తెలంగాణలో పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉంది. పాలనలో అభివృద్ధితోపాటు.. ఓట్ల కోసం తీసుకున్న కొన్ని నిర్ణయాలు.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్‌కు గుదిబండలా మారాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ సర్కార్ ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచింది. దీంతో మూడేళ్లు రాష్ట్రంలో ఉద్యోగ విరమణలు నిలిచిపోయాయి. ఈ ఏడాది జూన్ నుంచే ఉద్యోగ విరమణలు మొదలయ్యాయి. రిటైర్ అయ్యే ఉద్యోగులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పుడు రేవంత్ సర్కార్‌కు భారంగా మారాయి. ఇప్పటికే ఆరు గ్యారంటీల అమలు, గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పుకు వడ్డీలు చెల్లించడానికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిపోవడం లేదు. ఇలాంటి పరిస్థితిలో కొత్త ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. వారికి వేతనాలు చెల్లింపుతోపాటు.. మరో సమస్య ఉద్యోగుల రిటైర్మెంట్ తలనొప్పిగా మారింది. ఈ ఏడాది చివరి వరకు 8 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ కానున్నారు. వచ్చే ఐదేళ్లలో 44 వేల మంది ఉద్యోగులు రిటైర్ అవుతారని అంచనా. వీరందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి. అయితే వారికి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బెనిఫిట్ ఇవ్వాలి. వాటిని చెల్లించడం ఎలా అన్నది కలవరపెడుతోంది. ఉద్యోగ విరమణ తర్వాత ప్రభుత్వం నుంచి చెల్లించే బెనిఫిట్స్ చాలా ఉంటాయి. వారికి బేసిక్‌పేకు అనుగుణంగా హెచార్‌ఏ, సీసీఏ, డీఏలు కలుపుకుని మొత్తం వేతనానికి పది రెట్లు లీవ్ శాలరీ రూపంలో ఇవ్వాల్సి ఉందుంది. ఈ లీవ్ శాలరీ మొత్తంలో ఒక్కో ఉద్యోగికి సగటున రూ.8 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక గ్రాట్యుటీ కింద రూ.12 లక్షలు, కమ్యూటేషన్ రూపంలో మరో రూ.20 లక్షలు చెల్లించాలి. వేతనం నుంచి నెలనెలా దాచుకున్న పీఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, సరెండర్ లీవులు కలుపుకుని ఒక్కో ఉద్యోగికి సగటున రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగుల రిటైర్మెంట్ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.5 వేల కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. 2025 డిసెంబర్ నాటికి 10 వేల మంది రిటైర్ కానున్నారు. 2026, 2027లోనూ పది వేల మంది చొప్పున రిటైర్ అయ్యే అవకాశం ఉంది. 2028లో 8 వేల మంది రటైర్ అవుతారు. వీరికి బెనిఫిట్స్ చెల్లించడానికి ఏటా రూ.5 వేల కోటుల అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే నెలకు రూ.400 కోట్లు కేటాయించాలి. ఇవి వేతనాలకు అదనం. ఈ ఏడాది ఇప్పటికే రిటైర్ అయినవారితోపాటు డిసెంబర్ నాటికి రిటైర్ అయ్యే వారికి రూ.3,200 కోట్లు అవసమని అంచనా. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల్లో ఉన్న వ్యతిరేకతను చల్లబరిచేందుకు 2021లో కీలక నిర్ణయం తీసుకుంది. రిటైర్‌మెంట్ ఏజ్‌ను 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచింది. దీంతో 2024 మార్చి 31 వరకు ఉద్యోగ విరమణలు ఆగిపోయాయి. ఆ తర్వాత నుంచే రిటైర్ అవుతున్నారు. దీంతో బీఆర్ఎస్ సర్కార్‌కు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. కానీ ఇప్పుడు ఆ భారమంతా కాంగ్రెస్ సర్కార్‌పై పడుతోంది. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్ కోసం ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో రూ.20 వేల కోట్లు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఉద్యోగులకు సంబందించిన 4 డీఏలు పెండింగ్లో ఉన్నాయి. కేసీఆర్ సర్కార్ ఉద్యోగుల జీవితబీమా ఫండ్‌ను వాడుకుంది. అది కూడా ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ చెల్లించాలి. ఇవి సర్కార్‌కు తలకు మించిన భారంగా మారింది. తెలంగాణ సర్కార్, భారం తగ్గించుకునేందుకు రిటైర్‌మెంట్ వయసును మరో ఏడాది పెంచాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రనస్తుతం ఏపీలో రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లుగా ఉంది. తెలంగాణలో 61 ఏళ్లు ఉంది. ఏపీ తరహాలో తెలంగాణలోనూ రిటైర్మెంట్ వయసు మరో ఏడాది పెంచితే ఆర్థిక భారం తగ్గుతుందని రేవంత్ సర్కార్ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇలా చేస్తే భారం తగ్గుతుందా.. ఎంత తగ్గుతుంది.. అని వివరాలు సేకరిస్తోందని సమాచారం. ఏజ్ పెంచని పక్షంలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను బాండ్స్ రూపంలో ఇవ్వాలనే ఆలోచన కూడా ఉందని తెలుస్తోంది.

## దంపతుల హత్య

ఖమ్మం నేలకొండపల్లి లో భార్యాభర్తలను గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. రమణ,కృష్ణ కుమారి అనే భర్త,భార్యలను వారి ఇంట్లో నే చంపి ఇంటి చుట్టూ కారం చల్లారు. పిల్లలు హైదరాబాద్ లో ఉంటుండగా భార్య,భర్త నేలకొండపల్లి లో ఉంటున్నారు. డబ్బు,నగల కోసమే హత్య జరిగి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# ఇక కవిత 2.0

హైదరాబాద్, నవంబర్ 27,మన భారత రాజకీయాలను చూస్తే, జాతీయ పార్టీల్లోను, ప్రాంతీయ పార్టీల్లో జైలుకు వెళ్లిన రాజకీయ నేతలు సక్సెస్ ఫుల్ పొలిటీషియన్ అయినట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలు ఎంతగా వచ్చినా జైలుకు వెళ్లి ఊచలు లెక్కపెట్టిన రాజకీయ నేతల లెక్క చూస్తే అతి స్వల్పం. రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయన్న నానుడి మనకు తెలిసిందే. రాజకీయాల్లో అరెస్టులే ఉంటాయి తప్ప జైలుకెళ్లడాలు అరుదు. అలా వెళ్లారంటే పొలిటికల్ ఈక్వేషన్ కుదరనట్లే. జైలుకు పంపే సర్కార్‌కు, వెళ్లే వారికి మధ్య పొలిటికల్ అండర్ స్టాండింగ్ ఇంపార్టెంట్ అన్నది తెలిసిందే. అందుకే గత ప్రభుత్వాల హాయంలో జరిగిన కుంభకోణాలు, వాటి వెనుక ఉన్న పొలిటికల్ లీడర్స్ శాశ్వతంగా జైలుకు వెళ్లిన ఉదంతాలు తక్కువే. రాజకీయాలు పూల బాట మాత్రమే కాదు. ముళ్ల బాట కూడా. అధికారంలోకి రావాలంటే చెమటోడ్చాల్సిందే. ఎత్తుకు పైఎత్తులు వేయాల్సిందే. వ్యూహానికి ప్రతి వ్యూహం పన్నాలి. ఎదురు దెబ్బ తగిలితే సమయం కోసం వేచి చూడాలి. గెలుపు కోసం ఎత్తు పల్లాలు దాటాలి, కష్టనష్టాలు అనుభవించాలి. చదరంగంలో పావులు కోల్పోయినంత మాత్రాన ఓటమి కాదు. పావులు ఉన్నంత మాత్రాన గెలుపు కాదు. చివరి వరకు ఎవరు పోరాటం చేస్తారో వారే విజేత. అందుకే రాజకీయాన్ని చదరంగంతో పోల్చి చెప్తారు పొలిటికల్ ఎక్స్‌పర్ట్. ఇప్పుడు అదే రీతిలో ఎమ్మెల్సీ కవిత కెరీర్ రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టారా అన్న ప్రశ్న తలెత్తుతోంది. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుమార్తెగా కల్వకుంట్ల కవిత రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆమె తనకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం తెలంగాణ జాగృతి అనే సంస్థ ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలపై తెలంగాణ ప్రజల్లో ఓ చైతన్యం తీసుకురావడం ఆ సంస్థ ముఖ్య ఉద్దేశం. ఉద్యమంలో బతుకమ్మ పండుగను ఓ ఆయుధంగా కవిత వాడారు. మహిళల్లో పండుగ సంప్రదాయాలతోపాటు తెలంగాణ ఉద్యమ ఆకాంక్షపై నినదించేలా బతుకమ్మ పండుగను ఉపయోగించుకున్నారు. తద్వారా అప్పటి ఉద్యమ రాజకీయాల్లో తన ప్రత్యేకత చాటుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు కవిత. అప్పటి టీఆర్ఎస్, అదే రీతిలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణలో ముందున్నారు. అప్పటి ప్రభుత్వం పెట్టిన పలు ఉద్యమ కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు. ఆ తర్వాత ఎంపీగా , ఎమ్మెల్సీగా పదవులు పొంది ప్రజా ప్రతినిధిగా పని చేశారు. కొన్ని కార్మిక సంఘాలకు గౌరవ అధ్యక్షురాలిగా పని చేసిన అనుభవం ఉంది. ఇలా తనదైన శైలిలో తెలంగాణ రాజకీయాల్లో కవిత చురుకుగా పాల్గొన్నారు. రాజకీయాల్లో గుర్తింపు రావాలంటే దాని వెనుకే విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అదే రీతిలో కవితపైన విమర్శలు ఉన్నాయి. టీఆర్ఎస్‌లో కవిత కారణంగానే మరే ఇతర మహిళా నేతలకు గుర్తింపు రాలేదని, రాజకీయంగా ఎదగలేదన్న విమర్శలు ఉన్నాయి. సీనియర్లను కాదని ఎంపీగా, ఎమ్మెల్సీగా కుమార్తెకే కేసీఆర్ పదువులు ఇచ్చారన్న విమర్శలు వచ్చాయి. టీఆర్ఎస్ లేదా నేటి బీఆర్ఎస్ పార్టీ కుటుంబ పార్టీగా నేతలు, రాజకీయ విమర్శకులు చెబుతుంటారు. బీఆర్ఎస్ చీఫ్‌గా కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీశ్ రావు, కుమార్తె కవిత, కేసీఆర్ కుటుంబ మరో సభ్యుడైన జోగినపల్లి సంతోష్ రాజకీయ పదవులు పొందారన్న విమర్శలున్నాయి. అయినా ఉద్యమంలో వీరంతా కీలక పాత్ర పోషించడం, ప్రజలతో మమేకమవ్వడం, ఉద్యమ కేసుల్లోను ఉండటంతో ఈ విమర్శలను ప్రజలు పట్టించుకోలేదు. కేసీఆర్ ఎక్కడ పోటీ చేసినా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సిరిసిల్ల నుంచి కేటీఆర్ వరుసగా గెలిపిస్తూనే ఉన్నారు. సిద్దిపేట నుంచి హరీశ్ రావు గెలుపు పైన రికార్డులున్నాయి. కవిత ఎంపీగా రెండు సార్లు నిజామాబాద్ నుంచి పోటీ చేస్తే ఓసారి ఓటమి పాలయ్యారు. ఇది కవితకు రాజకీయంగా ఎదురు దెబ్బ అని చెప్పాలి. ఓటమి తర్వాత ఎమ్మెల్సీగా కవితకు పదవి కట్టబెట్టడం విమర్శలకు దారి తీసింది. ఇలా రాజకీయంగా అనేక విమర్శల నడుమే కవిత తనదైన రాజకీయం చేస్తూ వస్తూ ఉన్నారు. ఉద్యమ రాజకీయాల్లో, అధికార రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన కవిత ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇరుక్కోవడం అతి పెద్ద కుదుపు. అప్పటి వరకు సాఫీగా సాగిన రాజకీయాలు ఒక్కసారి వ్యతిరేకంగా మారాయి. ఢిల్లీ మద్యం విధాన రూపకల్పనలో మడుపులు చేతులు మారాయని, ఇందులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాతోపాటు కవిత పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ, ఈడీ దర్యాప్తు జరిపాయి. కవిత ఇంట్లో సోదాలు చేసిన అనంతరం 15 మార్చి 2024లో కవితను ఈడీ అరెస్టు చేసి తీహార్ జైలుకు పంపారు. ఆ తర్వాత ఇదే కేసులో 11 ఏప్రిల్ 2024లో కవితను సీబీఐ అరెస్టు చేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ కవిత జైలు జీవితం గడిపారు. ఈ కేసుల్లో సుప్రింకోర్టు బెయిల్ ఇవ్వడంతో ఆగష్టు 27, 2024న విడుదలయ్యారు.



జైలు నుంచి విడుదలైన కవితకు పార్టీ నేతలు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ఈసందర్భంగా మాట్లాడిన కవిత తనను అన్యాయంగా జైలుకు పంపారని, అందుకు వడ్డీతో సహా చెల్లిస్తానని శపథం చేశారు. 18ఏళ్లు రాజకీయాల్లో ఉన్నానని ఎలాంటి ఆరోపణలు లేవని, తాను కేసీఆర్ బిడ్డగా తప్పు చేసే వ్యక్తి కానని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత పొలిటికల్‌గా సైలెంట్ అయ్యారు. ప్రతీ బతుకమ్మ పండుగకు వార్తల్లో నిలిచే కవిత ఈ సారి బహిరంగంగా బతుకమ్మ వేడుకల్లో ఎక్కడా పాల్గొన లేదు. అనారోగ్యం కారణమన్న ప్రకటనను ఆమె కార్యాలయం విడుదల చేసింది. ఇప్పుడు మళ్లీ రాజకీయాల్లో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. ఆ దిశగానే కవిత అడుగులు వేస్తున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో మాస్ ఎంట్రీ ఇచ్చే దిశగా వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. జైలు జీవితం తర్వాత మౌనంగా ఉన్న కవిత ఎక్కడా ఎలాంటి రాజకీయ ప్రకటనలు చేయలేదు. ఏ కార్యక్రమంలోను పాల్గొనలేదు. రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే సమయం కోసం వేచి చూసిన కవిత అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే అదానీపై అవినీతి ఆరోపణలు వార్తలు వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ కవిత తన ఎక్స్ ఖాతా ద్వారా స్పందించారు. ఆడవారికో న్యాయం, అదానికో న్యాయమా అంటూ తన గళం విప్పారు. అవినీతి ఆరోపణల పేరుతో తనను అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఇప్పుడు అదానిపై అవే ఆరోపణలు వస్తున్నాయి. అతన్నీ జైలులో పెడతారా పెట్టరా అన్న ప్రశ్నలు ప్రజల్లో రేకెత్తించేందుకు కవిత ప్రయత్నించారు. రాజకీయంగా తమ పార్టీ, తాను వ్యతిరేకం కాబట్టే జైలుకు పంపారని, అదానీ బీజేపీ పెద్దలకు సన్నిహితుడు కాబట్టి అతన్ని జైలులో పెట్టే పరిస్థితి ఉండదన్న తీరును తన కామెంట్స్ ద్వారా బయటపెట్టారు కవిత. ఒక్క మాటలో చెప్పాలంటే తనపై మద్యం కుంభకోణం ఆరోపణలు రాజకీయపరమైనవే తప్ప అందులో వాస్తవాలు లేదని చెప్పారు. ఈ కామెంట్స్ ద్వారా ప్రజల్లో తనపైన సానుభూతి పెంచే వ్యూహాన్ని అమలు చేశారు. ఇలా తన తొలి ప్రశ్న బీజేపీ సర్కార్ పెద్దలకు వేస్తూ, సైలెన్స్ తర్వాత తన పొలిటికల్ రీ ఎంట్రీ స్టార్ట్ చేశారు.పొలిటికల్ మైలేజ్ రావాలంటే ప్రతీ రాజకీయ నేతకు ఓ వ్యూహం ఉండాలి. ఆ వ్యూహానికి తగ్గ ప్రజల డిమాండ్ ఉండాలి. ఆ డిమాండ్‌కు నాయకత్వం వహించాలి. తద్వారా పొలిటికల్ లీడర్ షిప్ చేయలనుకునే వారికి సులువైన జర్నీగా మారుతుంది. ఇప్పుడు తన రీ ఎంట్రీ అదే రీతిలో కవిత ప్లాన్ చేసుకున్నట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ సీనియర్లు అంతా రేవంత్ సర్కార్ పాలన తీరును, ఇచ్చిన హమీల నెరవేర్పు వంటి అంశాలపై నిలదీస్తుంటే అవేవి మాట్లాడకుంటా తెలంగాణలోని బీసీ వర్గానికి సంబంధించన కుల గణనపై మాట్లాడారు. తన పొలిటికల్ రీ ఎంట్రీ అతి పెద్ద ఓటర్ వర్గం డిమాండ్లపై కవిత స్పందించారనే చెప్పాలి. బీసీ కులగణన జరుగుతున్న వేళలో కవిత, యునైటెడ్ పూలే ఫ్రంట్ అనే సంఘంతో కలిసి 35 పేజీలతో కూడిన బీసీల డిమాండ్ల పత్రాన్ని బీసీ కమిషన్ అధ్యక్షుడిని కలిసి అందజేశారు. ఈ చర్య ద్వారా బీసీల అటెన్షన్ తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. గతంలోను అంబేద్కర్ విగ్రహాన్ని అసెంబ్లీలో పెట్టాలని డిమాండ్ చేయడం ద్వారా ఎస్సీ , ఎస్టీ వర్గాలను, మహిళా రిజర్వేషన్లపై కొన్ని కార్యక్రమాలు చేసి మహిళా వర్గాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. తాజాగా బీసీలను తన వైపు చూసేలా కవిత తన రీఎంట్రీ పొలిటికల్ జర్నీ స్టార్ చేశారనే చెప్పాలి. అయితే ఇది ఎంత వరకు తీసుకెళతారు. ఎలాంటి కార్యాచరణ ఉంటుంది. అన్నది చూడాల్సి ఉంది. కాని జైలుకు వెళ్లి విడుదలైన వారు మాత్రం అత్యున్నత రాజకీయ స్థానాలను అలంకరించారనడంలో సందేహం లేదు. తెలుగు రాష్ట్రంలోనే చూస్తే జగన్మోహన్ రెడ్డి జైలు జీవితం తర్వాతే సీఎం అయ్యారు. తెలంగాణలో జైలు జీవితం తర్వాతే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. దేశంలో సీనియర్ పొలిటీషియన్ అయిన చంద్రబాబు నాయుడు జైలు జీవితం అనుభవించాక సీఎం కుర్చీలో మరో దఫా కూర్చున్నారు. జార్ఖండ్‌లో హైమంత్ సోరేన్ కూడా జైలు జీవితం తర్వాత జరిగిన ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో గెలిచి సీఎం అవబోతున్నారు. ఇవన్నీ మన దేశ రాజకీయాల్లో మనం చూస్తోన్న ఉదంతాలు. ఇక ఐదున్నర నెలలు జైలులో గడిపిన కవిత తన రీఎంట్రీ పాలిటిక్స్‌ను ఎలా మలచుకోనున్నారు?, ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళతారు ? రాజకీయంగా ఏ స్థాయికి చేరుకుంటారు ? అన్నది ఇప్పుడు అందరిలోను ఉత్పన్నమయ్యే ఆసక్తి కరమైన ప్రశ్న.

# 1899 బడుల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్

హైదరాబాద్, నవంబర్ 27, రాష్ట్రంలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల గణాంకాలపై తెలంగాణ సర్కారు ఫోకస్ పెట్టింది. బడిలో పిల్లలకు ఉన్న టీచర్లకు పొంతన ఉందా లేదా అనే దానిపై విద్యాశాఖ అధికారుల ఆరా తీయగా సంచలన విషయాలు బయటపడ్డాయి. ఈ ఏడాది విద్యాసంవత్సరంలో దాదాపు 2 వేల పాఠశాలల్లో ఒక్క స్టూడెంట్ కూడా చేరలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. విద్యాశాఖ అధికారుల లెక్కల ప్రకారం రాష్ట్రంలో2024-25 సంవత్సరానికి గాను 1899 బడుల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదైంది. ఈ పాఠశాలల్లో అప్పటికే 580 మంది టీచర్లు ఉన్నారు. ఎవరైనా స్టూడెంట్స్ చేరకపోతారా అని ఎదురుచూసిన విద్యాశాఖకు నిరాశ ఎదురుకాగా పిల్లలు లేని స్కూల్స్‌లో టీచర్లు ఏం చేస్తారని వారిని ఇతర స్కూల్స్‌కు ట్రాన్సఫర్ చేశారు.తెలంగాణలో మొత్తం 26,101 పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది విద్యార్థుల బడిబాట తర్వాత ఏ స్కూల్‌లో ఎంతమంది చేరారు. ఎంతమంది స్టూడెంట్స్ ఉన్నారు అనే లెక్కలు అధికారులు తీశారు. 1899 పాఠశాలల్లో ఒక్కరు కూడా చేరలేదు. ఇందులో 1818 ప్రాథమిక పాఠశాలలు కాగా.. 48 యూపీఎస్, 33 హైస్కూల్స్ ఉన్నాయి. పదిమందిలోపే పిల్లలున్న పాఠశాలలు 4 వేల 314 ఉన్నాయి. అందులో 3326 మంది టీచర్లు పాఠాలు చెబుతున్నారు. ఒక స్టూడెంట్ నుంచి 10 మంది వరకు ఉన్న పాఠశాలలు ? 2415 , 2746 టీచర్లు పని చేస్తున్నారు.మారుమూల గ్రామాల్లో సైతం ప్రైవేటు పాఠశాలల వైపు పేరేంట్స్ మొగ్గు చూపుతుండటంతో ఎన్ రూల్‌మెంట్ తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో హైస్కూల్స్‌లో స్టూడెంట్స్ తక్కువగా ఉన్నా విద్యాప్రమాణాలపై ఎఫెక్ట్ పడకుండా ఉండటం కోసం సబ్జెక్టులకు సరిపడా టీచర్స్‌ను కొనసాగిస్తున్నారు.

వివరాలు ఇలా:

ఒక్కరే స్టూడెంట్ ఉన్న హైస్కూళ్లు ? 53, పనిచేసే టీచర్లు 51

ఇద్దరు స్టూడెంట్స్ ఉన్న హైస్కూళ్లు 142, పనిచేసే టీచర్లు 128

పది వరకూ పిల్లలున్న హై స్కూళ్లు 9, పని చేసే టీచర్లు 45

రాష్ట్ర వ్యాప్తంగా 50 మందికి పైగా స్టూడెంట్లున్న స్కూళ్లు 9,963 ఉండగా.. వాటిలో 4313 ప్రైమరీ, 1532 యూపీఎస్, 4118 ప్రైమరీ స్కూళ్లున్నాయి. వీటిలో 75,023 మంది టీచర్లు పనిచేస్తున్నారు. ప్రతి స్కూల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధికారులు టీచర్లను అలాట్ చేస్తున్నారు. అయితే ప్రైమరీ స్కూళ్లే కాదు.. హైస్కూళ్లు కూడా జీరో ఎన్రోల్మెంట్ ఉండగా, సింగిల్ డిజిట్ స్కూల్‌లు కూడా ఉండటం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

# మూసీలో పరిశ్రమల వ్యర్థాలు

హైదరాబాద్, నవంబర్ 27, మూసీ పునరుజ్జీవంపై ప్రభుత్వం.. మరీ ముఖ్యంగా సీఎం రేవంత్ పట్టుదలగా ఉన్నారు. మూసీకి పూర్వ వైభవం తీసుకొస్తామని చెబుతున్నారు. అందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఈ నేపథ్యంలో.. మూసీలో రసాయన పరిశ్రమల వ్యర్థాలను డంప్ చేయడం కలకలం సృష్టిస్తోంది.హైదరాబాద్ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపూఘాట్ వద్ద సోమవారం రాత్రి సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఓ లారీ డ్రైవర్ రసాయన పరిశ్రమల వ్యర్థాలను మూసీ నదిలో వేయడానికి ప్రయత్నించాడు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మూసీ పునరుద్ధరణ కార్యక్రమం చేపడుతోంది. ఈ నేపథ్యంలో రసాయన వ్యర్థాలను మూసీలో డంప్ చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. లారీ డ్రైవర్ పారిశ్రామిక వ్యర్థాలతో బాపూఘాట్ వద్దకు చేరుకున్నాడు. అప్పటికే కలుషితమైన వ్యర్థాలను ఆఫ్‌లోడ్ చేయడానికి సిద్ధమయ్యాడు. అప్రమత్తమైన స్థానికులు అడ్డుకున్నారు. డ్రైవర్‌ను నిలదీశారు. అప్పటికే పోలీసులకు సమాచారం వెళ్లింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయాడు.ఇలాంటి పనులు మూసీ నదిని పునరుజ్జీవింపజేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను బలహీనపరుస్తాయని.. స్థానికులు చెబుతున్నారు. పర్యావరణం, ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. ఇలాంటి అక్రమ డంపింగ్‌కు ప్రయత్నించడం ఇదే మొదటిసారి కాదని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

ప్రభుత్వం ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాహనం యజమానిని గుర్తించి పారిశ్రామిక వ్యర్థాలపై కూపీ లాగాలని ప్రయత్నిస్తున్నారు.మూసీలో మొదట దశలో బాపూఘాట్ నుంచి ఎగువకు 21 కి.మీ మేర ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన 5 కన్సల్టెన్సీ సంస్థల కన్సార్షియం మూసీ పునరుజ్జీవం డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను రూపొందిస్తోందన్నారు. ఈ పనిని రూ.141 కోట్లతో అప్పగించినట్లు వెల్లడించారు. డిజైన్, డ్రాయింగులు, నిర్మాణాలు ఇలా అన్నీ కన్సల్టెన్సీ సంస్థలే తయారు చేస్తాయని చెప్పారు.

పునరుజ్జీవం ఫస్ట్ ఫేజ్‌లో బాపూఘాట్ నుంచి ఎగువ భాగంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి ఇటీవల వివరించారు. జంట నగరాల నీటి అవసరాలు తీర్చే ఉస్మాన్‌సాగర్ నుంచి 11.5 కి.మీ. దూరం, హిమాయత్‌సాగర్ నుంచి 9.5 కి.మీ. దూరం మంచి నీరు ప్రవహించి బాపూఘాట్ వద్ద కలుస్తాయని చెప్పారు. అ ప్రాంతంలో ప్రపంచంలోనే ఎత్తయిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం స్పష్టం చేశారు.

# దిలావర్ పూర్ లో కొనసాగుతున్న ఉద్రిక్తత

నిర్మల్ దిలావర్పూర్, గుండంపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం కుడా అరెస్టులు కొనసాగాయి. మంగళవారం ఆందోళన చేసిన వారిని గుర్తించి అరెస్టు చేసేందుకు పోలీసులు వెల్లారు.. గ్రామస్థులు పోలీసులను అడ్డుకున్నారు. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇతనల్ బాదిత గ్రామాల్లో ఉద్రిక్తత కొనసాగింది.

# మళ్లీ గులాబీ గూటికి ఆరూరి రమేష్

వరంగల్, నవంబర్ 27, బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మళ్లీ పార్టీ మారతారనే ప్రచారం జరుగుతోంది. అరూరి తిరిగి బీఆర్ఎస్ బాట పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. బీజేపీ కార్యక్రమాల్లో ఆయన పెద్దగా పాలుపంచుకోకపోవడం ఈ ప్రచారానికి ఊతం ఇస్తున్నాయి.దాదాపు పదేళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగి, ఎంపీ ఎలక్షన్స్ కు ముందు బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మళ్లీ యూటర్న్ తీసుకోబోతున్నారా? కాషాయ కండువా వదిలి మళ్లీ కారు ఎక్కనున్నారా? వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇప్పుడు ఇదే చర్చ జోరుగా నడుస్తోంది. బీజేపీ నుంచి లోక్ సభ బరిలో నిలిచిన ఆయన.. ఆ ఎన్నికల్లో ఓటమి తరువాత ఎక్కడా సరిగా కనిపించకపోవడం, పార్టీ కార్యక్రమాల్లోనూ పెద్దగా పాలుపంచుకోకపోవడం ఆయన పార్టీ మారబోతున్నారనే ప్రచారానికి కారణం అయ్యాయి. దీంతో మళ్లీ ఆయన బీఆర్ఎస్ కండువా కప్పుకోబోతున్నారనే చర్చకు దారితీశాయి. అధికారికంగా అరూరి నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోయినా స్థానిక సంస్థల ఎన్నికలకు కాస్త అటుఇటుగా ఆయన పార్టీ మారడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. ఇదే విషయం గురించి ఆయన తన సన్నిహితులతో చర్చించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.అరూరి రమేష్ 2009 ఎలక్షన్స్ టైమ్ లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆ తరువాత తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ నుంచి వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థిగా 2014 లో పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కొండేటి శ్రీధర్ పై దాదాపు 86 వేల ఓట్లకు పైగా మెజారిటీతో విజయం సాధించారు. ఆ తరువాత 2018 ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పగిడిపాటి దేవయ్యపై 99 వేలకు పైగా ఓట్లు సాధించి బంపర్ మెజారిటీతో గెలుపొందారు. ఇలా రెండు సార్లు రికార్డు మెజారిటీతో విజయం సాధించిన ఆయన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో లక్షకు పైగా మెజారిటీ సాధిస్తాననే ధీమాతో బరిలో నిలిచారు. కానీ వ్యక్తిగతంగా ఆయన క్యాడర్ పై ఉన్న వ్యతిరేకతతో పాటు కాంగ్రెస్ కు వచ్చిన హైప్ తో ఆయన చిత్తుగా ఓటమి పాలయ్యారు. దాదాపు 19,458 ఓట్ల తేడాతో అరూరి రమేశ్ కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు చేతిలో ఓటమి చవి చూశారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత అరూరి రమేశ్ తన వ్యూహం మార్చుకున్నారు. ఎలాగైనా పవర్ లో ఉండాలనే ఉద్దేశంతో ఎంపీగా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నారు. కానీ బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే లాభం లేదనే ఉద్దేశంతో నాటకీయ పరిణామాల నడుమ బీజేపీ లో చేరారు. అనుకున్నట్టుగానే బీజేపీ నుంచి ఎంపీ టికెట్ తెచ్చుకుని వరంగల్ లోక్ సభ స్థానం నుంచి బరిలో నిలిచారు. ప్రధానిగా మోదీకి ఉన్న క్రేజ్, క్షేత్రస్థాయిలో బీజేపీకి పెరిగిన ఓటు బ్యాంక్ తో ఎంపీగా గెలుపు తనదేనని భావించారు. కానీ పార్టీ మారినా క్షేత్రస్థాయిలో ఆయనతో పాటు ఆయన అనుచరులపై ఉన్న వ్యతిరేకత, అసెంబ్లీ ఎన్నికలతో కాంగ్రెస్ కు పెరిగిన బలం వల్ల ఆయన లోక్ సభ ఎన్నికల్లో కూడా ఓటమి చెందారు. వరంగల్ ఎంపీగా డాక్టర్ కడియం కావ్య గెలవగా.. ఆయన రెండో స్థానానికి పరిమితం అయ్యారు.లోక్ సభ ఎన్నికల తర్వాత అరూరి కొంతకాలం పార్టీ జిల్లా నేతలు, కార్యకర్తలతో టచ్ లోనే ఉన్నారు. ఈ మధ్య కాలంలో మాత్రం పార్టీ కార్యక్రమాలకు పూర్తిగా దూరం ఉంటున్నట్టు తెలిసింది. మహారాష్ట్ర ఎన్నికల్లో పార్టీ హై కమాండ్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అక్కడ పని చేసిన ఆయన.. జిల్లాలో మాత్రం బీజేపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్టు టాక్ నడుస్తోంది. పార్టీ కార్యక్రమాల గురించి ఆయనకు సమాచారం ఇచ్చినా అంటిముట్టనట్టే ఉంటున్నట్టు పార్టీ నేతల్లోనే చర్చ జరుగుతోంది. వివిధ సందర్భాల్లో పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మారెడ్డి, గంట రవి నిర్వహించిన కార్యక్రమాలు, మీడియా సమావేశాలకు సమాచారం ఇచ్చినా ఆయన సరిగా స్పందించడం లేదనే ప్రచారం జరుగుతోంది. అరూరికి సమాచారం ఇచ్చినా ఆయన మాత్రం ఏ కార్యక్రమానికి హాజరవడం లేదని ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు చెబుతుండటం గమనార్హం.కారణాలు ఏవైనా అరూరి రమేష్ యూ టర్న్ తీసుకోబోతున్నారనే చర్చ నియోజకవర్గంలో జోరుగా నడుస్తోంది. పంచాయతీ ఎన్నికలకు కాస్త అటుఇటుగా ఆయన గులాబీ కండువా కప్పుకుంటారనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ మళ్లీ యాక్టివ్ గా అడుగులు వేస్తుండటం, వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇంతవరకు బీఆర్ఎస్ నేతలెవరూ ఆయన స్థానాన్ని భర్తీ చేయకపోవడంతో అరూరి కారు పార్టీ వైపు ఆలోచిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదిలాఉంటే మహారాష్ట్ర ఎన్నికల తరువాత వరంగల్ కు వచ్చి శుభకార్యాలు, సంతాప కార్యక్రమాలకు హాజరవుతున్న ఆయన పార్టీతో సంబంధం లేకుండా తన వ్యక్తిగత క్యాడర్ ను బలోపేతం చేసుకుంటున్నారనే టాక్ నడుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగినా ఇబ్బందులు తలెత్తకుండా అందరినీ కలుపుకుపోయే ప్రయత్నం చేస్తున్నట్టు తెల్సింది.కాగా ఆయన పార్టీ మారే వ్యవహారం అంతా తూచ్ అని కొందరు కొట్టిపారేస్తున్నా.. పంచాయతీ ఎలక్షన్స్ కు రిజల్ట్స్ ను బట్టి ఆయన బీఆర్ఎస్ వైపు అడుగులు వేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదివరకు ఆయన బీఆర్ఎస్ నుంచి బీజేపీ లోకి చేరుతున్న సమయంలో కూడా ఇలాగే ప్రచారం జరగగా.. పార్టీ మారే విషయాన్ని ఆయన పలుమార్లు ఖండించారు. తాను పార్టీ మారబోయేది లేదంటూ ప్రెస్ మీట్ లు పెట్టి మరీ చెప్పుకొచ్చారు. కానీ చివరకు నాటకీయ పరిణామాల నడుమ ఆయన ఊహించినట్టుగానే బీజేపీ కండువా కప్పుకున్నారు. ఇప్పుడు కూడా అరూరి రమేష్ విషయంలో అదే జరుగుతుందనే టాక్ నడుస్తుండగా.. ఎవరి వాదన నిజమవుతుందో చూడాలి.

# జాయ్ జమిమా కేసును సిబిఐకి బదిలీ చేయాలి

రాజమండ్రి హనీ ట్రాప్ కేసులో ఆరో పణలు ఎదుర్కొంటున్న జాయ్ జమిమా ను జైల్ లో కలిసినట్లు మాజీ ఎంపీ హర్ష కుమార్ తెలిపారు. జాయ్ జమిమా అమాయకురా లని, ఓఅమ్మాయి వ్యక్తిత్వాన్ని కించపరిస్తూ చూపించారు. విశాఖ పోలీస్ కమిషనర్ శంక బత్ర బాగ్చి అమ్మాయి ని కించపరుస్తూ మాట్లా డడం దారుణమని చెప్పారు. అమ్మాయి వెనుక ముఠా ఉందని పోలీసులు అన్నారని,ఇప్పటివరకు ఎంతమందిని అరెస్ట్ చేశారో చెప్ప లేదని,అమ్మాయి పై నిరాధా రమైన ఆరోపణలు చేశారని,మూడుసార్లు కస్టడీ కి తీసుకున్న పోలీసులు ఏ సమాచారం రాబట్టగలిగారని, జాయ్ జమిమా కేసును సిబిఐ కి బదిలీ చేయాలని కోరారు.

# కేటీఆర్ అరెస్ట్ పై వెనక్కి తగ్గారా

హైదరాబాద్, నవంబర్ 27, అరెస్టు కావడానికి నేను రెడీ అని కేటీఆర్ చాలెంజ్ చేసి చాలా రోజులు అయింది. ఓ రాత్రి ఆయనను అరెస్టు చేస్తారన్న అనుమానంతో ఆయన ఇంటి వద్ద పార్టీ నేతలు కాపలా కాశారు. కానీ ఆయన అరెస్టు కాలేదు. అసలు పోలీసులు కేటీఆర్ ను అరెస్టు చేసే ప్రయత్నం చేయలేదు. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భిన్నంగా స్పందించారు. జైలుకు వెళ్లిన వాళ్లంతా సీఎంలు అవుతున్నారని తాను కూడా జైలుకెళ్లాలనుకుంటున్నారని సెటైర్ వేశారు. రేవంత్ స్పందనను బట్టి చూస్తే కేటీఆర్ అరెస్టు లేదని అనుకోవచ్చంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ ఈ రేసు విషయంలో రూ. 55 కోట్ల గోల్ మాల్ జరిగిందని ప్రభుత్వం గుర్తించింది. లెక్కాపత్రం లేకుండా రూ. 55కోట్లను విదేశీ కంపెనీకి తరలించారని కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో బాధ్యుడు అవ్వాల్సిన సీనియర్ ఐఏఎస్ అధికారి తన తప్పం లేదని అంతా కేటీఆర్ ఆదేశించడం వల్లే తాను చేశానని నివేదిక ఇచ్చారు. అయితే ఆ ఆదేశాలు నోటి మాట ద్వారా ఇచ్చారని చెబుతున్నారు. దీంతో నగదు అక్రమంగా తరలించారని ఏసీబీ కేసు నమోదు చేసింది. కేటీఆర్ కీలక పాత్ర కాబట్టి ఆయనను ప్రశ్నించడానికి అనుమతి ఇవ్వాలని గవర్నర్ ను కోరారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులపై కేసులు పెట్టారంటే.. 17o ప్రకారం గవర్నర్ అనుమతి ఉండాలి. అయితే ఇప్పటి వరకూ గవర్నర్ అనుమతి రాలేదు. గతంలో రేవంత్ మీడియాతో మాట్లాడినప్పుడు గవర్నర్ అనుమతి వస్తే అరెస్టు చేస్తామని ప్రకటించారు. ఆ రూ. 55కోట్లు ఎక్కడికిపోయాయో తేలుతుందని చెప్పుకొచ్చారు. మరో మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి దీపావళిలోపే బాంబులు పేలుతాయన్నారు. కానీ ఏవీ పేలలేదు. అంతే కాదు ఇప్పుడు అరెస్టు అయితే సానుభూతి వస్తుందన్న కోణంలో ప్రభుత్వ పెద్దలు చూస్తున్నారు. అందుకే కేటీఆర్ అరెస్టు ఉండకపోచవచ్చి అంటున్నారు.నిజానికి కేటీఆర్ ను ఫార్ములా ఈ రేసు కేసు విషయంలో కాకపోయినా.. కలెక్టర్ పై దాడి కేసులో అరెస్టు చేస్తారని అనుకున్నారు. ఆ కేసులో అరెస్టు చేయడానికి గవర్నర్ పర్మిషన్ అక్కర్లేదు. అయితే పోలీసులు మాత్రం అరెస్టు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తొందరపడి అరెస్టులు చేయడం వల్ల వారికి రాజకీయంగా మేలు జరుగుతుందని అలాంటి పరిస్థితి లేకుండా.. వారిని అరెస్టు చేయడం కరెక్టే అనే భావన వచ్చే వరకూ వారు చేసిన తప్పుల్ని ప్రజల ముందు పెట్టాలని ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోందది. ఈ లెక్క ప్రకారం కేటీఆర్ అరెస్టు ఇప్పుడల్లా ఉండకపోవచ్చని అంటున్నారు

## 4 జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్

## 10కి పడిపోయిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నవంబర్ 27 చలితో తెలంగాణ గజగజ వణికిపోతోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. 4 జిల్లాల్లో 10 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉండొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరిత తగ్గాయి. నాలుగు జిల్లాల్లో 10 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 8.3 డిగ్రీల సెల్సియస్ నమోదయింది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 8.8 డిగ్రీలు నమోదయింది. సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లోని కొన్ని మండలాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్, ఆసిఫాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, నిర్మల్, జిల్లాల్లోని పలు మండలాల్లో 11 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.తెలంగాణ లోని చాలా జిల్లాల్లో 15 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో.. వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. మరో 2 రోజులు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేసింది. ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కొన్ని మండలాల్లో 10 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఆ జిల్లాలకు ఆరేంజ్ అలర్ట్ జారీ చేశారు. మరో 30 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయ్యింది.చలికాలంలో వృద్ధులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని వైద్యులు సూచిస్తున్నారు. జలుబు, దగ్గు, ఆస్తమా వంటి వ్యాధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు, హృద్రోగ సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. చల్లటి వాతావరణంలో కీళ్లనొప్పులు పెరుగుతాయని.. వైరల్ ఫ్లూ ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని అంటున్నారు. వృద్ధులకు రక్త ప్రసరణ మందగించి గుండె జబ్బులు పెరిగే ప్రమాదముంది. ఈ సమయంలో వేడినీళ్ల తాగాలని సూచిస్తున్నారు.చలికాలంలో ఇన్ఫెక్షన్లు, సీజనల్ వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు. పిల్లలపై వీటి ప్రభావం ఎక్కువగా పడే అవకాశం ఉంది. ఈ కాలంలో చిన్నారులకు జలుబు, దగ్గు, జర్వం లాంటివి వచ్చే రిస్క్ ఎక్కువ ఉంటుంది.

అందుకే పిల్లలు ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా చలికాలంలో వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.పిల్లలను చలి నుంచి రక్షించి వారి శరీరం వెచ్చగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

ఉన్ని స్వెటర్లు తప్పనిసరిగా వేయాలి. చలితీవ్రత ఎక్కువగా ఉండే చేతులకు గ్లవ్స్, కాళ్లకు సాక్స్ వేయాలి. బయటికి వెళితే షూ వేయాలి. పిల్లల శరీరానికి నేరుగా చల్లగాలి తగలకుండా చూసుకోవాలి. పిల్లల శరీరంలో వెచ్చదనం తగ్గితే జ్వరం వచ్చే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

## పెద్ద కల్వలలో నిరుద్యోగ విజయోత్సవ సభ

### – ముఖ్యమంత్రి పర్యటనకు సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



పెద్దపల్లి నిరుద్యోగ యువతతో వచ్చే నెల 4న పెద్దపల్లిలో జరుగునున్న విజయోత్సవ సభను ఏర్పాటు చేయాడానికి పెద్ద కల్వలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభ నేపథ్యంలో స్థలాన్ని శుభ్రం చేయాలని, రేపు ఉదయం స్టేజ్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నుంచి బృందం వస్తుందని అన్నారు. డిసెంబర్ 4న పెద్దపెల్లి జిల్లాలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరగనుందని అన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారని, ఈ సభలో గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణకు పెద్ద కల్వలోనే ఖాళీ స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉంటూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసిల్దార్ రాజ్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్ తోపాటు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అతిపెద్ద దొంగ జగన్ మోహన్ రెడ్డి

## ఆనం వెంకటరమణా రెడ్డి

నెల్లూరు భారతదేశంలోనే అతిపెద్ద గజదొంగ జగన్ రెడ్డి అని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్బీఐ ఏజెన్సీ చెప్పింది. ఏకంగా రూ.1750 కోట్ల లంచాలు డైరెక్ట్ గా జగన్ రెడ్డి తీసుకున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఎఫ్బీఐ చెప్పిందని టీడీపీ నేత ఆనం వెంకటరమణా రెడ్డి ఆరోపించారు.

తమ నుంచి విద్యుత్ కొనుగోలు చేసుకోవాలని సెసి జూన్ 2020లో రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుంది. 18 నెలలు దాటినా, ఏ ఒక్క రాష్ట్రం కూడా విద్యుత్ కొనడానికి ముందుకు రాలేదు. అంత ఎక్కువ ధరకు విద్యుత్ కొనలేం, మాకు మీ కరెంటు వద్దు అంటూ అన్ని రాష్ట్రాలు దండం పెట్టాయి. కానీ ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రమే, మేము కొంటాం అంటూ ముందుకు వచ్చింది. అన్ని రాష్ట్రాలు వద్దు అంటుంటే, జగన్ రెడ్డి మాత్రం మాకు కావాలి అంటూ ఎక్కువ ధరకు విద్యుత్ కొనడానికి ఒప్పుకున్నాడు. ఇది చెప్పింది మేము కాదు, అమెరికా కోర్టని అయన అన్నారు.జగన్ రెడ్డి ఇక్కడ సిబిఐ కేసులు లాగా పదేళ్ళ, 20 ఏళ్ళు సాగుతాయి అనుకుంటున్నావ్ ఏమో.. అమెరికా కోర్టులు ఏడాది లోపే తేల్చేస్తాయి. జగన్ రెడ్డి, అమెరికా జైల్లో బ్రెడ్డు, జాం మాత్రమే పెడతారు. ఇంటి నుంచి చేపల పులుసు, మటన్ బిర్యానీ తెచ్చుకునే వీలులేదని అయన అన్నారు.

### శేరిలింగంపల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

రంగారెడ్డి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు 173 చెక్కులను బుధవారం శేర్లింగంపల్లి ఎమ్మెల్యే పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ కార్యాలయంలో కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ వివేకానంద నగర్ ,హైదర్ నగర్, కూకట్పల్లి డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు ఈరోజు షాది ముబారక్ కళ్యాణ్ లక్ష్మి చెక్కులను అందజేయడం జరిగిందని తెలిపారు,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా సంక్షేమానికి రేవంత్ రెడ్డి గారు పెద్దపీట వేశారని తెలిపారు ఆయన..

# మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్...

హైదరాబాద్, నవంబర్ 27, తెలంగాణలో కాంగ్రెస్ – బీఆర్ఎస్ పార్టీల మధ్య రోజు రోజుకు పొలిటికల్ వార్ తీవ్రమవుతోంది. రెండు పార్టీలకు చెందిన నేతలు మాటల యుద్ధానికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి పాలనపైన, ఇచ్చిన హామీల అమలు, హైడ్రా పేరుతో అక్రమ కట్టడాల కూల్చివేత, ఇళ్లు కూలిన బాధితుల విషయాలు, లగచర్ల అల్లర్ల ఘటన వంటి అంశాలపై ఇప్పటికే బీఆర్ఎస్ దూకుడుగా వెళు తోంది. మరో వైపు రేవంత్ రెడ్డి సైతం బీఆర్ఎస్ మాటల దాడికి ప్రతి దాడి చేస్తూనే ఉన్నారు. అయితే ఇక ఇప్పుడు మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్ కు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుందా అన్న చర్చ సాగుతోంది.పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ ఇప్పటి దాకా పక్కన పెట్టిన ఆపరేషన్ ఆకర్ష్ కు పదును పెట్టనుందా అన్న చర్చ సాగుతోంది. కేసు పూర్వాపల్లోకి వెళితే.. తెలంగాణలో జరిగిన శాసన సభ ఎన్నికల తర్వాత గులాబీ పార్టీ బీఫాం అందుకుని గెలిచిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ లు కాంగ్రెస్ లో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ స్పీకర్ కు ఫిర్యాదు చేశారు. తెలంగాణఅసెంబ్లీ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, వివేకానంద రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఫిరాయింపుపై సుప్రింకోర్టు మార్గదర్శకాలను స్పీకర్ అమలు చేయడం లేదని ఆ పిటిషన్ లో పిటీషనర్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ బెంచ్ నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. దీంతో అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టుడివిజన్ బెంచ్ ను ఆశ్రయించడం జరిగింది. అయితే దీనిపై విచారణ జరిపిన డివిజన్ బెంచ్ ఇరువర్గాల వాదన విన్న తర్వాత తన తీర్పును ప్రకటించింది.రీజనబుల్ టైంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ల ఫిరాయింపు పై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని తన తీర్పులో పేర్కొంది. అంటే స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు స్పష్టంగా ఎలాంటి గడువు విధించకపోవడం తో ఇక ఇప్పుడు ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై తుది నిర్ణయం స్పీకర్ ఎప్పుడు తీసుకుంటారన్న స్పష్టత లేదు. ఇప్పటి వరకు హైకోర్టు నిర్ణయం పైవేచి చూసిన కాంగ్రెస్ పార్టీ ఇక ఇప్పుడు ఆపరేషన్ ఆకర్షక్ కు తెర లేపుతుందన్న వాదనలు వినవస్తున్నాయి.తన ఢిల్లీ పర్యటన లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా కుటుంబ సభ్యుల వివాహ వేడుకలకు హాజరయ్యేందుకే అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఈ క్రమంలోనే కాంగ్రెస్ హై కమాండ్ తోను ముఖ్యమైన విషయాలు చర్చించే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. అందులో మంత్రి వర్గ విస్తరణ ఒకటి కాగా, మరో అంశం ఆపరేషన్ ఆకర్ష్. దీనికి కాంగ్రెస్ హై కమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునే దిశగా చర్యలు ఉంటాయని కాంగ్రెస్ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. గతంలోనే పలువురు మంత్రులు 20–25 మంది గులాబీ ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నారని, వాళ్లు వస్తే ఇక బీఆర్ఎస్ లో మిగిలేది కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా మరో ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే అని చెప్పిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. అక్కడ కాంగ్రెస్ హైకమాండ్ తో ఈ తాజా పరిణామాలన్నీ చర్చించే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ దూకుడు తగ్గించేందుకు శీతాకాల అసెంబ్లీ సమావేశాల ముందే కొద్ది మందిని పార్టీలో చేర్చుకోవాలా లేక జీహెచ్ఎంసీ ఎన్నికల ముందా అన్న చర్చ జరుగుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేతలు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు టార్గెట్ గా ఆపరేషన్ ఆకర్ష్ జరుగుతుందని చెబుతున్నారు. శాసన సభ ఎన్నికల్లో తెలంగాణ రూరల్ లో కాంగ్రెస్ కు ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్నారు. కాని గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ చతికిల పడింది. కంటోన్మెంట్ కు జరిగిన ఉపఎన్నికల్లో మాత్రమే కాంగ్రెస్ ఒక్క స్థానంలో గెలిచింది. దీంతో గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి నజర్ పెట్టారు. అయితే గ్రేటర్ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాసం ఉండటంతో శీతాకాల సమావేశాల ముందే ఈ ప్రక్రియ ఉండవచ్చన్న వార్తలు వస్తున్నాయి.తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటయి దాదాపు ఏడాది కావోస్తోంది. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి ముఖ్యమంత్రితో కలిపి 18 మందితో మంత్రి మండలి ఏర్పడాల్సి ఉంది. అయితే సీఎం రేవంత్ రెడ్డి సహా 12 మంది మాత్రమే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏడాది నుండి 12 మందితోనే రేవంత్ సర్కార్ పాలన సాగిస్తోంది. మరో ఆరుగురు మంత్రులుగా ఎంపిక కావాల్సి ఉంది. అయితే ఆపరేషన్ ఆకర్ష్ లో భాగంగా ఆరు మంత్రి పదవులు ఉద్దేశపూర్వకంగానే అలా అట్టిపెట్టినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీలో చేరిన ఒకరిద్దరు సీనియర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి వాగ్దానం చేసినట్లు ఆ ఎమ్మెల్యేలు తమ సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారు. మరికొందరు పార్టీలోకి రావాలంటే మంత్రి పదవుల తాయిలం చూపించాల్సిన అవసరం ఉంది. అందుకోసమే పూర్తిస్థాయి మంత్రివర్గ విస్తరణ చేయకుండా ఆగారని అటు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపాలంటే జీహెచ్ఎంసీ పరిధిలో మరి కొందరు సీనియర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను పార్టీలో చేర్చుకునే వ్యూహంతో రేవంత్ రెడ్డి ఉన్నట్లు సమాచారం. అవసరం అయితే వారికి మంత్రి పదవులు కట్టబెట్టి జీహెచ్ఎంసీ పీఠం కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్నట్లు కాంగ్రెస్ సీనియర్లు చెబుతున్నారు. అదే నిజమయితే త్వరలోనే గ్రేటర్ పరిధిలోని మాజీ మంత్రులు తిరిగి మంత్రి పదవులు దక్కించుకోవడం ఖాయం. ఏది ఏమైనా అటు జీహెచ్ఎంసీ ఎన్నికలు కావచ్చు. మరో వైపు పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు కావచ్చు ఆపరేన్ ఆకర్ష్ కు గేట్లు తీసిందనే చెప్పాలి. మరో వైపు బీఆర్ఎస్ దూకుడు తగ్గించేందుకు కూడా ఈ అస్త్రాన్ని రేవంత్ రెడ్డి ఉపయోగించే అవకాశం ఉంది. అదే అయితే రానున్న రోజుల్లో తమ ఎమ్మెల్యేలను బీఆర్ ఎస్ చీఫ్ కేసీఆర్ ఎలా నిలువరిస్తారో వేచి చూడాలి.

## ఎర్ర చందనం అమ్మకాలు, ఎగుమతికి సింగిల్ విండో విధానం మేలు

### ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సింగిల్ విండోకు కస్టోడియన్ గా ఉంటుంది

### కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ని కోరిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల ప్రక్రియను సింగల్ విండో విధానానికి మార్చాలని, దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే 'ఈ ? వేలం'లో మెరుగైన ఫలితాలు వస్తాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కి తెలియచేశారు. దేశ రాజధాని ఢిల్లీలో పర్యటిస్తున్న పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం భూపేంద్ర యాదవ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎర్రచందనం రక్షణ, స్మగ్లింగ్ నిరోధం, దుంగల అమ్మకం విషయంలో అనుసరిస్తున్న విధానాల మీద కేంద్ర మంత్రితో చర్చించారు.

పవన్ కల్యాణ్రు కేంద్ర మంత్రి దృష్టికి ఈ విషయాలు తీసుకువచ్చారు. "బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇటీవల ప్రతిపాదించిన ప్రకారం ఎర్రచందనం అమ్మకం, ఎగుమతి చేసే విషయంలో సింగిల్ విండో విధానం ఉంటే మేలు జరుగుతుంది. ఈ విధానానికి ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ కస్టోడియన్ గా వ్యవహరిస్తుంది. ఈ ప్రతిపాదనను పరిశీలించలరు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో ఎర్రచందనం గ్రేడింగ్, వేలం, ఎగుమతి సాగిస్తుంది. తద్వారా ఈ–వేలం ద్వారా రెవెన్యూ పెరుగుతుంది.

ఏ రాష్ట్రంలో పట్టుబడినా...

ఎర్రచందనం అరుదైన వృక్ష సంపద. ఆంధ్ర ప్రదేశ్ అటవీ ప్రాంతంలోనే పెరుగుతుంది. ఈ క్రమంలో కేంద్రం నిబంధనలను సవరించి ఆంధ్రప్రదేశ్ వెలుపల పట్టుబడిన ఎర్రచందనం సైతం సింగిల్ విండో వేలంలో భాగం కస్టోడియన్ గా ఉండే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికే దక్కేలా చూడాలి. దీనివల్ల ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం పట్టుబడిన ఎర్రచందనం అమ్ముకోవడానికి కుదరదు. అమ్మకాలు, ఎగుమతులు ఒకే విధానం ద్వారా కొనసాగుతుంది. కేంద్ర పర్యవేక్షణతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కస్టోడియన్ గా కొనసాగుతుంది" అని పవన్ కల్యాణ్ వివరించారు.

## ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి నిమ్మల సమీక్ష

అమరావతి రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఆయా ప్రాజెక్టుల సిఈలు,ఎస్ఈలు,కాంట్రాక్ట్ ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమానికి ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. సాయి ప్రసాద్,కడ కమిషనర్ రామసుందరరెడ్డి ,ఈఎన్సీ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు హజరయ్యారు. డిసెంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి పోలవరం లో పర్యటించి డయా ఫ్రం వాల్,ఈసిఆర్ఎఫ్ డ్యాం పనులు షెడ్యూల్ విడుదలపై రివ్యూ చేసారు. పోలవరం టన్నెల్స్ బ్యాలెన్స్ పనులు మరియు లెఫ్ట్ కెనాల్ పనుల పురోగతిపై సమీక్ష జరిపారు. మంత్రి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి తెలుసుకునేలా వెబ్సైట్ ప్రారంభించి ఎప్పటికప్పుడు వర్క్ అప్డేట్ చేయాలి. హంద్రీ–నీవా వెలిగొండ,చింతలపూడి తదితర ప్రాధాన్య ప్రాజెక్టుల పనుల ఆర్థిక ఇబ్బందులను అధిగమించి పూర్తి చెయ్యడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సాగు నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేవిధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. సాగునీటి సంఘాలకు డిసెంబర్ 8 వ తేదీన జరిగే ఎన్నికల కోసం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయం చేసుకోవాలి. సాగు నీటి సంఘాల ద్వారా కాలువలు,డ్రైన్స్ వంటి ఇరిగేషన్ పనులలో రైతుల భాగస్వామ్యం ,ప్రాతినిధ్యం లభిస్తుందని అన్నారు.

# సినిమా



## 'తల్లి మనసు'కి వెండితెర రూపం



రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'తల్లి మనసు'. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ తొలిసారి నిర్మాతగా మారి, నిర్మించిన చిత్రమిది. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను ఈ సినిమా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ,'ఈ చిత్రాన్ని చూసిన సెన్సార్ సభ్యులు చాలా బావుందని, తల్లికి సంబంధించిన మంచి సబ్జెక్టుతో ఇటీవల కాలంలో ఇలాంటి చిత్రం రాలేదని ప్రశంసించడం ఆనందంగా ఉంది. అలాగే కొద్ది రోజుల క్రితం పోస్ట్ ప్రొడక్షన్ దశల్లో మా సినిమాను చూసిన కొందరు స్నేహితులు సైతం అభినందించారు. డిసెంబర్ చివరి వారంలో లేదా జనవరి మొదటి వారంలో అనుకూలమైన తేదీని చూసుకుని చిత్రాన్ని విడుదల చేస్తాం. నైజాంలో ఈ చిత్రాన్ని ఏషియన్ ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా రిలీజ్ చేస్తాం' అని చెప్పారు. 'తల్లి సబ్జెక్ట్‌తో ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకులకు అందించాలని మేము ఏదైతే ఆశించి, మా సొంత బ్యానర్‌లో ఈ చిత్రాన్ని తీశామో అది నెరవేరింది. ఇలాంటి మంచి సినిమాతో మా అబ్బాయి నిర్మాతగా చిత్ర పరిశ్రమలోకి ఎంటర్ కావడం సంతోషదాయకం' అని చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య అన్నారు. దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) మాట్లాడుతూ, 'ఈ సినిమాలో ఓ మధ్య తరగతి తల్లి ఎలాంటి సంఘర్షణలకు గురయ్యిందన్న అంశాన్ని ప్రేక్షకులకు హత్తుకునేలా వైవిధ్యంగా చెప్పాం. ఆద్యంతం పాత్రలు మాత్రమే కనిపించి, ప్రేక్షకుడు కథలో లీనమవుతాడు' అని తెలిపారు.

## గద్దర్ నటించలేదు.. జీవించారు

గద్దర్ నటించలేదు.. జీవించారువిశాఖ ఉక్కు తెలుగు వారి హక్కు నినాదంతో దర్శక, నిర్మాత, హీరో సత్యారెడ్డి నిర్మాణంలో గద్దర్ నటించిన ఆఖరి చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. ఈ సినిమాలో గద్దర్ మూడు పాటలు పాడారు. అలాగే రెండు పాటల్లో, కొన్ని సందేశాత్మక సీన్స్‌లో నటించారు. గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ కూడా ఈ సినిమాకి సాహిత్యం అందించారు. సినిమా విడుదల సందర్భంగా దర్శకుడు సత్యారెడ్డి మాట్లాడుతూ, "విప్లవ కవి గద్దర్ నటించిన చివరి చిత్రమిది. తన పదవికి తృణప్రాయంగా రాజీనామా చేసిన లక్ష్మీ నారాయణతో పాటు ఎంతో మంది ఉద్యమకారులను దృష్టిలో ఉంచుకొని ఈ సినిమా కథానాయకుడి పాత్రను గద్దర్ తీర్చిదిద్దారు. ఈ సినిమా నిజ జీవితానికి దగ్గరగా ఉన్న ఉద్యమ చిత్రం' అని అన్నారు. 'ఈ చిత్రం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ఏ విధంగా ప్రైవేటీకరణ చేస్తున్నారు, అక్కడి ప్రజలు ఎలా అడ్డుకుంటున్నారు అనేది చూపించారు. కొన్ని సన్నివేశాలు చూశాను. చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉన్నాయి. గద్దర్ స్ఫూర్తిని ఈ సినిమాలో నింపడం విశేషం' అని మాజీ సీబీఐ డైరెక్టర్ వి.వి.లక్ష్మీ నారాయణ చెప్పారు.

## గీత రచయిత కులశేఖర్ ఇకలేరు



ప్రముఖ సినీ గీత రచయిత కులశేఖర్ (53) ఇకలేరు. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుది శ్వాస విడిచారు. జర్నలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన పాటల మీద ఉన్న మక్కువతో సినీ రంగ ప్రవేశం చేశారు. 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి దగ్గర శిష్యరికం చేశారు. 'చిత్రం', 'జయం', 'ఔనన్న కాదన్నా', 'ఘర్షణ', 'వసంతం' వంటి తదితర చిత్రాలకు కులశేఖర్ రాసిన పాటలు విశేష శ్రోతకాదరణ పొందాయి. ముఖ్యంగా ఆయన రాసిన 'గాజువాక పిల్లా', 'రాను రాను అంటూనే చిన్నదో..', 'అందమైన మనసులో ఇంత అలజడి ఎందుకో' వంటి పాటలు సూపర్‌హిట్‌గా నిలిచాయి. చిరంజీవి 'మృగరాజు', ఎన్టీఆర్ 'సుబ్బు' చిత్రాలకు కూడా పాటలు రాశారు. ఆయన ఎక్కువగా తేజ, ఆర్పీ పట్నాయక్ కాంబోలో వచ్చిన సినిమాలతో మంచి ఆదరణ పొందారు. అలాగే దర్శకుడిగా మారి 'ప్రేమలేఖ రాశా' చిత్రాన్ని తెరకెక్కించారు. అతి తక్కువ సినిమాలతో గీత రచయితగా పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్న కులశేఖర్ మృతిపట్ల పలువురు సంగీత దర్శకులు, గాయనీగాయకులు సోషల్ మీడియా వేదికగా సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## అత్యధిక థియేటర్లలో రిలీజ్



లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో తమిళంలో విడుదలై, ఘన విజయాన్ని సాధించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. చిత్రం ఈనెల 29న తెలుగులో విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రాన్ని ఆర్ కె ఫిలిమ్స్ పతాకం ద్వారా అత్యధిక థియేటర్లలో రిలీజ్‌కు ప్లాన్ చేశారు నిర్మాత ఆర్.కె. గౌడ్. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ, 'సినిమాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయి. నా 'కర్తవ్యం' మూవీ చూసి చాలామంది అమ్మాయిలు పోలీస్ డిపార్ట్‌మెంట్ లోకి వచ్చేందుకు ఆసక్తి చూపించారు. అలాగే 'భారతీయుడు' మూవీ చూసి కొందరు ఉద్యోగులు లంచాలు తీసుకోవద్దనే నిర్ణయానికి వచ్చారు. 'బార్సు' సినిమా చూసి ఇంట్లోంచి బయటకు వచ్చి సినిమాల కోసం ప్రయత్నించానని కేజీఎఫ్ హీరో యష్ నాతో చెప్పారు. అలా సినిమా మాధ్యమం ఎంతోమందికి స్ఫూర్తిని అందిస్తుంది. ఈ సినిమా ట్రైలర్ చూశాను చాలా బాగుంది. లక్ష్మీరారు యాక్షన్ బాగా చేయగలదు. ఈ సినిమాతో రామకృష్ణ గౌడ్‌కి మంచి సక్సెస్ రావాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'లేడీ ఓరియెంటెడ్ మూవీస్ ఎన్నో ఘన విజయాలు సాధించాయి. అలాంటి ప్రయత్నమే మా సంస్థ ద్వారా ఈ సినిమాతో చేస్తున్నాం. ఈ సినిమా తర్వాత 'మహిళా కబడ్డీ జట్టు' అనే మూవీ చేస్తున్నాం. థ విన్నర్ అక్సా ఖాన్ ఆ సినిమాలో నటిస్తారు. అత్యధిక థియేటర్లలో ఈ సినిమాని విడుదల చేస్తాం' అని నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ చెప్పారు.

## 'హాయ్ నాన్న'కు అవార్డుల పంట




నేచురల్ స్టార్ నాని, మృణాల్‌ఠాకూర్, కియారా ఖన్నా ప్రధాన పాత్రలో నటించిన సూపర్‌హిట్ మూవీ 'హాయ్ నాన్న'. గతేడాది థియేటర్లలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్‌హిట్‌గా నిలిచింది. శౌర్యువ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా 'సలార్' పోటీని తట్టుకుని ప్రపంచవ్యాప్తంగా రూ.75 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. తాజాగా మెక్సిలో జరిగిన ఐఎఫ్ఎసి ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఏకంగా ఆరు అవార్డులను సొంతం చేసుకుంది. బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ స్కోర్, బెస్ట్ రైటర్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ సెట్ డిజైన్, బెస్ట్ హెయిర్ అండ్ మేకప్ ఫీచర్ సౌండ్, బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ సౌండ్ విభాగాల్లో అవార్డులను దక్కించు కుంది. తండ్రీ కూతుళ్ల ఎమోషనల్ చిత్రంగా 'హాయ్ నాన్న' సినిమా తెరకెక్కించారు. గతంలో న్యూయార్క్‌లో జరిగిన 'ది ఒనిరోస్ ఫిల్మ్ అవార్డు'ల్లోనూ సత్తా చాటింది. పలు విభాగాల్లో మొత్తం 11 అవార్డులను కైవసం చేసుకుంది. ఏథెన్స్ ఇంటర్నేషనల్ ఆర్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మార్చ్-2024 ఎడిషన్‌లో బెస్ట్ ఫీచర్ ఫిల్మింగ్ అవార్డును కైవసం చేసుకుంది.

## వర్మ కోసం పోలీసుల గాలింపు



ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ అజ్ఞాతం వీడాడు. సంవత్సరం కింద తాను వేసిన ట్వీట్లకు మనోభావాలు దెబ్బ తిన్నాయని కేసులు పెడుతున్నారని తెలిపారు. ఒకే రోజు నాలుగు వేరు, వేరు ప్రాంతాల్లో నలుగురికి మనోభావాలు దెబ్బ తిన్నాయా? అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తాను ఎవరిపై ట్వీట్లు చేశానో వారి మనోభావాలు దెబ్బ తినకుండా, ఇతరుల మనోభావాలు దెబ్బ ఎలా తింటాయని అడిగారు. దీనికి కేసులు ఎలా వర్తిస్తాయో తన అర్థం కావడం లేదని రాంగోపాల్ వర్మ ప్రశ్నించారు.ఎపి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వ్యూహం సినిమాలో భాగంగా టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సోషల్ మీడియాలో రాంగోపాల్ వర్మ పోస్టులు పెట్టారు. దీంతో ఈ పోస్టులపై ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రామలింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్‌జివిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణకు హాజరుకావాలని తెలిపారు. విచారణ హాజరుకాకపోవడంతో ఆర్‌జివి అరెస్టు చేసేందుకు పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్మ వీడియో విడుదల చేశారు.

## విడాకుల తర్వాత ఆ ట్యాగ్స్ ఎందుకు?



విడాకులు తీసుకున్న తరువాత అమ్మాయిలకు ఈ సమాజం కొన్ని ట్యాగ్‌లను ఎందుకు తగిలిస్తుందో అర్థం కావడం లేదని సినీ హీరోయిన్ సమంత అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. తన జీవితంలో ఎదుర్కొన్న కష్టమైన దశ గురించి ముఖ్యంగా విడాకులు తీసుకున్న సమయంలో ఎదుర్కొన్న ట్రోలింగ్ గురించి మాట్లాడారు. మహిళలు ఎదుర్కొనే సామాజిక సవాళ్ల గురించి ప్రస్తావించారు. ఇద్దరి మధ్య బంధం విచ్ఛిన్నమైతే అమ్మాయిలనే నిందిస్తారని, దురదృష్టవశాత్తూ మనం అలాంటి సమాజంలో బతుకుతున్నామని అసహనం వ్యక్తం చేశారు. తనపై కూడా ఎన్నో అవాస్తవాలు ప్రచారం చేశారన్నారు. "డివోర్స్ తీసుకున్న తర్వాత అమ్మాయిలకు ఈ సమాజం కొన్ని ట్యాగ్స్ తగిలిస్తుంది. 'సెకండ్ హ్యాండ్, ఆమె జీవితం వృథా, యూజ్డ్' ఇలాంటి ట్యాగ్స్ ఎందుకు తగిలిస్తారో నాకు అర్థం కావడం లేదు. ఆ అమ్మాయిని, తన కుటుంబాన్ని ఇవి ఎంతో బాధిస్తాయి. కష్టాల్లో ఉన్న ఆ అమ్మాయిని ఇవి మరింత నిరాశపరుస్తాయి. నా గురించి ఎన్నో అవాస్తవాలు ప్రచారం చేశారు. అవి అబద్ధాలు కాబట్టి వాటి గురించి మాట్లాడాలని అనుకోలేదు. కష్ట సమయంలో నా స్నేహితులు, కుటుంబసభ్యులు ఎంతోమంది నాకు మద్దతుగా నిలిచారు " అంటూ వారికి ధన్యవాదాలు చెప్పారు సమంత.

## డిసెంబర్ 14న ఫియర్' విడుదల




నటి వేదిక ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'ఫియర్'. దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ప్రొడ్యూసర్ డాక్టర్ వంకి పెంచలయ్య, ఎఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాతరెడ్డి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డాక్టర్ హరిత గోగినేని ఈ సినిమా రూపొందిస్తున్నారు. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. విడుదలకు ముందే ఈ సినిమా వివిధ అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ఫిలిం ఫెస్టివల్స్‌లో 70కిపైగా అవార్డులను గెల్చుకుని సరికొత్త రికార్డును సృష్టించింది. డిసెంబర్ 14న సినిమాను విడుదల చేస్తామని మేకర్లు మంగళవారంనాడు ప్రకటించారు. ఇప్పటికే హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంలో టీజర్ విడుదల చేయగా సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండింగ్ అయ్యింది. జయప్రకాష్ (జెపి), పవిత్ర లోకేష్, అనీష్ కురువిల్ల, సాయాజిషిండే, సత్యకృష్ణ, సాహిత దాసరి, షాని తదితరులు నటిస్తున్నారు.



# క్రీడలు



## మెగా వేలంలో స్టార్ క్రికెటర్లకు షాక్..



జెద్దా: సౌదీ అరేబియాలోని జెద్దా నగరం వేదికగా ఆది, సోమవారాల్లో జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) మెగా వేలం పాటలో పలువురు స్టార్ క్రికెటర్లకు షాక్ తగిలింది. ఒకప్పుడూ ఐపిఎల్‌లో కోట్లాది రూపాయలకు అమ్ముడు పోయి పెను ప్రకంపనలు సృష్టించిన ఆటగాళ్లు ఈసారి ఆయా ఫ్రాంచైజీలు మొండి చెయ్యి ఇచ్చాయి. ఐపిఎల్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన క్రికెటర్లలో ఒకరిగా పేరున్న డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా), కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్), జానీ బెయిర్‌స్టో (ఇంగ్లండ్), మహ్మద్ నబి (అఫ్గాన్), షకిబ్ (బంగ్లాదేశ్), ముస్తఫిజుర్ (బంగ్లాదేశ్), టిమ్ సౌథి, ఫిన్ అలెన్ (కివీస్), స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా) తదితరులను కొనేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించలేదు. రెండు రోజుల పాటు సాగిన వేలం ఏ ఒక్క ఫ్రాంచైజీ కూడా వీరిను పట్టించుకోలేదు. వీరితో భారత స్టార్ క్రికెటర్లు ఉమేశ్ యాదవ్, శార్దూల్ ఠాకూర్, పృథ్వీషా, సర్ఫరాజ్ ఖాన్, మయాంక్ అగర్వాల్, శివమ్ మావి, నవ్‌దీప్ సైని తదితరులను ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. వీరిని వారి కనీస ధరకు కూడా కొనేందుకు జట్టు యాజమాన్యాలు ఇష్టపడక పోవడం గమనార్హం.

## హైబ్రిడ్ పద్ధతిలో ఛాంపియన్స్ ట్రోఫీ!





పాకిస్థాన్ వేదికగా వచ్చే ఏడాది ఐసి సి వన్డే ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉన్న విష యం తెలిసిందే. అయితే పాక్ గడ్డపై తాము ఆ డే ప్రసక్తే లేదని భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) ఇప్పటికే ఐసిసికి స్పష్టం చేసింది. ఇక పాకిస్థాన్ కూడా అన్ని మ్యాచ్‌లు కూడా పాక్‌లోనే జరగాలని పట్టుబడుతోంది. ఇలాంటి స్థితిలో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై అనుమానాలు నెలకొన్నాయి. తమ గడ్డపై భారత్ ఆడాల్సిందేనని పి సిసి కోరుతోంది. దీని కోసం బిసిసిఐని ఒప్పించాలని ఐసిసిని కోరింది. భారత్ మాత్రం పాక్ లో ఆడేందుకు ఏమాత్రం ఆసక్తి చూపించడం లే దు. తమకు సంబంధించిన మ్యాచ్‌లను పాకిస్థా న్ బయట నిర్వహించాలని బిసిసిఐ డిమాండ్ చేస్తోంది. దీనికి పిసిబి ఏమాత్రం ఒప్పుకోవడం లేదు. టోర్నీ నిర్వహణ బాధ్యతలునైనా వదులుకుంటామని హైబ్రిడ్ విధానానికి ఒప్పుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో టోర్నీని సాఫీగా నిర్వహించేందుకు ఐసిసి రంగంలోకి దిగింది. దీని కోసం పిసిబి ఒప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైబ్రిడ్ విధానంలో ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహిస్తే భారీ నగదు పురస్కారాన్ని అందిస్తామని ఐసిసి హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఒకవేళ పిసిబి ఈ ఆఫర్‌కు ఒప్పుకుంటే ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహిణపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడుతుంది.

## 29న ఐసిసి సమావేశం




అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) సమావేశం 29న జరగనుంది. ఈ సమావేశంలో ఛాంపియన్స్ ట్రోఫీ, డబ్ల్యుటిసి టైటిళ్లపై ప్రధానంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది పాకిస్తాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు భారతజట్టు అంగీకరించడం లేదు. హైబ్రీడ్ మోడల్‌కు బిసిసిఐ ప్రతిపాదిస్తుండగా.. అందుకు పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు ససేమిరా అంటోంది. ఐసిసి టోర్నమెంట్‌లలో ఆడేందుకు 2016, 2023లలో పాకిస్తాన్ జట్టు రెండుసార్లు భారత పర్యటనకు రాగా.. 2006నుంచి భారతజట్టు పాకిస్తాన్‌లో ఐసిసి టోర్నమెంట్‌లలో పాల్గొనేందుకు వెళ్లడం లేదు. ఇదే విషయాన్ని పాక్ బోర్డు ఐసిసి సమావేశంలో ప్రధాన ఎజెండాగా తీసుకురావాలని చూస్తోంది. అలాగే వచ్చే ఏడాది జరిగే ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌తోపాటు 2025 ఐసిసి టోర్నమెంట్‌లపై ప్రధాన చర్చ జరగనున్నట్లు తెలిసింది. ఐసిసి టోర్నమెంట్‌ల షెడ్యూల్‌ను 100ముందు ప్రకటించాల్సి ఉండగా.. దీంతో అత్యవసరంగా ఐసిసి సమావేశమైంది. ఈ వారంలో ఐసిసి ఛైర్మన్‌గా జే షా బాధ్యతలు స్వీకరించనున్న దృష్ట్యా మిగిలిన అన్ని దేశాల క్రికెట్ బోర్డులతో ప్రస్తుత సభ్యులతో సమావేశంలో వేయాలని ఐసిసి భావించినట్లు తెలిసింది.

## ఆయూబ్ సెంచరీ



జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో పాకిస్తాన్ జట్టు ఘన విజయం సాధించింది. జింబాబ్వే నిర్దేశించిన 146పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ ఓపెనర్ సైబ్ ఆయూబ్(113), షఫీక్(32) వికెట్ చేజార్చుకోకుండా మ్యాచ్‌ను ముగించారు. అంతకుముందు పాకిస్తాన్ పేసర్లు అబ్రార్ అహ్మద్(4/33), అఘా సల్మాన్(3/26) రాణించడంతో జింబాబ్వే జట్టు 32.3ఓవర్లలో 145పరుగులకే ఆలౌటైంది. జింబాబ్వే జట్టులో మయర్స్(33), విలియమ్స్(31), సికిందర్ రాజా(17), బెన్నెట్(14) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఆ లక్ష్యాన్ని పాకిస్తాన్ జట్టు 18.2ఓవర్లలో వికెట్ కోల్పోకుండా ఛేదించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆయుబ్‌కు లభించగా.. మూడు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. మూడో, చివరి వన్డే గురువారం జరగనుంది.

## గుకేశ్-డింగ్ రెండో గేమ్ డ్రా



భారత స్టార్ గ్రాండ్ మాస్టర్ డి. గుకేశ్, డిఫెండింగ్ ఛాంపియన్, చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ల మధ్య జరిగిన రెండో గేమ్ డ్రా అయ్యింది. ఫిడే ప్రపంచ ఛెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌కోసం వీరిద్దరి మధ్య టైటిల్ పోరు జరుగుతోంది. సోమవారం జరిగిన తొలిరౌండ్‌లో డి. గుకేశ్ తెల్లపావులతో బరిలోకి దిగి ఓటమిపాలయ్యాడు. మంగళవారం జరిగిన రెండోరౌండ్‌లో నల్లపావులతో ఆడిన గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ డింగ్ లిరెన్‌ను సమర్ధవంతంగా నిలువరించాడు. డింగ్ ఇ4తో ప్రారంభించగా.. గుకేశ్ ఇ5తో సమాధానమిచ్చాడు. వీరిద్దరూ సుమారు 23ఎత్తుల తర్వాత డ్రాకు అంగీకరించారు. దీంతో ఇరువురికి అరపాయింట్ చొప్పున లభించింది. రెండోరౌండ్ ముగిసేసరికి డింగ్ 1.5పాయింట్లు, డి. గుకేశ్ 0.5పాయింట్‌తో ఉన్నాడు. బుధవారం జరిగే మూడోరౌండ్‌లో గుకేశ్ తెల్లపావులతో బరిలోకి దిగాల్సి ఉంది.

## ఆత్మవిశ్వాసం పెంచే విజయమిది



వరుస ఓటములతో డీలా పడ్డ టీమిండియాలో పటిష్టమైన ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో విజయం కొత్త జోష్ నింపిందని చె ప్పాలి. సొంత గడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత్ 03 తేడాతో ఘోర పరాజయం చవిచూసిన సంగతి తెలిసిందే. ఇ లాంటి స్థితిలో బలమైన ఆస్ట్రేలియాతో జరిగే ఐదు మ్యాచ్‌ల బోర్డర్‌గవాస్కర్ టెస్టు సిరీస్ ట్రోఫీ టీమిండియాకు సవాల్‌గా మారింది. ఆ త్మవిశ్వాసం పూర్తిగా కోల్పోయిన భారత్‌కు ఆసీస్ సిరీస్‌లో మరిన్ని చేదు అనుభవాలు తప్పక పోవచ్చని విశ్లేషకులు సయితం అభిప్రాయపడ్డారు. దీనికి తోడు పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టు ఆరంభానికి ముందే టీమిండియాకు కోలుకోలేని షాక్ తగిలింది. అద్భుత ఫామ్ లో ఉన్న స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ గాయం వల్ల మొదటి టెస్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో పాటు వ్యక్తిగత కారణా ల వల్ల రెగ్యూలర్ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా తొలి టెస్టుకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో భారత్‌కు కష్టాలు ఖాయమని మా జీ క్రికెటర్లు, విశ్లేషకులు జోస్యం చెప్పారు. కానీ కెప్టెన్ జస్‌ప్రిత్ బు మ్రా జట్టును నడిపించిన తీరును ఎంత ప్రశంసించినా తక్కువే. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150 పరుగులకే కుప్పకూలినా బుమ్రా ధైర్యం కోల్పోలేదు. సహచరుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి జట్టును ముందుండి నడిపించాడు. నిప్పులు చెరిగే బంతులతో ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్ పతనాన్ని శాసించాడు. బుమ్రా అంచనాలకు మించి రాణించడంతో బలమైన ఆస్ట్రేలియా టీమ్ తొలి ఇన్నింగ్స్‌లో 104 పరుగులకే కుప్పకూలింది. కీలకమైన మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన టీమిండియా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. బౌలర్లు అందించిన స్ఫూర్తితో రెండో ఇన్నింగ్స్‌ను భారత ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్‌లు ఆత్మవిశ్వాసంతో ప్రారంభించా రు. ఇద్దరు ఆస్ట్రేలియా బౌలర్లలను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ప్రతికూల వాతావరణంలోనూ అద్భుత బ్యాటింగ్‌తో అలరించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరిన యువ ఓపెనర్ యశస్వి ఈసారి అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అంచనాలకు మించి రాణించి జట్టును సురక్షిత స్థితికి చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. రాహుల్ కూడా సమన్వయంతో ఆడుతూ జట్టును ఆదుకున్నాడు. ఇద్దరు కుదురుగా ఆడడంతో భారత్ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరుకుంది. రానున్న టెస్టుల్లో మరింత ఆత్మవిశ్వాసంతో ఆడేందుకు యశస్వి, రాహుల్‌లకు ఈ ఇన్నింగ్స్ దోహదం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక పేలవమైన ఫామ్‌తో సతమతమవుతున్న సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లి కూడా ఈ మ్యాచ్‌లో తన మార్క్ బ్యాటింగ్‌తో అలరించాడు. జట్టు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెడుతూ కీలక సమయంలో అద్భుత శతకాన్ని శాసించాడు. ఈ అజేయ సెంచరీ కోహ్లి ఆత్మవిశ్వాసాన్ని పెంచిందనే చెప్పాలి. మిగిలిన మ్యాచుల్లో మరింత ఉత్సాహంతో ఆడేందుకు ఇది దోహదం చేయడం ఖాయం.

# హనుమాన్ మందిరం షెడ్ నిర్మాణం కోసం 20 సిమెంట్ బస్తాలు అందించిన కరుకూరి సత్తయ్య





ప్రజాబలం దండేపల్లి మండల రిపోర్టర్ నవంబర్ 27 : మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ గ్రామంలోని హనుమాన్ మందిరం షెడ్ నిర్మాణం కోసం 20 సిమెంట్ బస్తాలు అందించిన కరుకూరి సత్తయ్య బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కొర్విచెల్మ గ్రామంలో హనుమాన్ మందిరం పక్కనున్న నూతన షెడ్ కొరకు హనుమాన్ భక్తులు నా దృష్టికి తీసుకోవడంతో నా వంతుగా హనుమాన్ మందిర షెడ్ కోసం 20 సిమెంట్ బస్తాలు ఇవ్వడం జరిగింది,ఇంకా ఎవరైనా ఉంటే ఆర్థిక సాయం అందించాలని తెలిపారు.అందించినందుకు గాను వారికి హనుమాన్ భక్త మండలి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గొపతి తిరుపతి,యడపువు మహేష్,అప్పని సత్తయ్య, ముద్ధసాని పెద్దయ్య,గొపతి కిష్టయ్య,రాజేందర్, హనుమాన్ మందిరం పూజారి సాయి చరణ్, గ్రామం రైతు,హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క చొరవతో సమస్య పరిష్కారం

## నిర్మల్ ఎస్పీ డా.జి.జానకీ షర్మిల





ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. ఎంత పెద్ద సమస్య అయినా సంయమనం పాటిస్తే పరిష్కరించుకోవచ్చని, ఆవేశాలకు పోతే నష్టం తప్ప ఎలాంటి లాభం ఉండదని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీషర్మిల పేర్కొన్నారు. దిలావర్పూర్ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించడం, రైతులు ప్రజలకు అనుకూలంగా ఆదేశాలు జారీ చేయడం హర్షనీయమని తెలిపారు.ఈ సమస్య పరిష్కరించడం లో గౌరవ మంత్రి వర్యులు సీతక్క గారు చాలా చొరవ తీసుకోవటం వల్ల సమస్యకు పరిష్కారం లభించింది.

బాధిత రైతులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు విద్రోహకారులకు అవకాశం ఇవ్వకుండా, ఎప్పుడు కూడా తమ సమస్యను సానుకూలంగా పరిష్కరించుకునేందుకే మొగ్గు చూపాలని సూచించారు.దిలావర్ పూర్ ఘటనలో పోలీసు శాఖ పూర్తి సంయమనం పాటించిందని స్పష్టం చేశారు.మంగళవారం రాత్రి తన వాహనంలోనే ఘెరావ్ చేయడంతో ఆర్డీవో రత్న కళ్యాణి అస్వస్థతకు గురయ్యారని,ఈ నేపథ్యంలోనే రోప్ పార్టీతో వెళ్లి, ఆర్డీవోను బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి పంపించామని వివరించారు.

ఈక్రమంలో కొంతమంది ఆర్డీవో వాహనాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని, వారి ప్రయత్నాన్ని నిలువరించామని చెప్పారు.

మంగళవారం ఉదయం నుంచి పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరించిందని చెప్పారు.61వ జాతీయ రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సిర్గాపూర్, నర్సాపూర్,కల్లూరు తదితర చోట్ల ట్రాఫిక్ మళ్లింపులను చేపట్టామన్నారు.

బుధవారం కూడా పోలీసు శాఖ శాంతియుతంగా వ్యవహరించిందన్నారు

పరిస్థితులు చేయి దాటి పోకుండా ఉండేందుకే కొంతమందిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

గ్రామస్తులు పోలీసులపై రాళ్లు విసిరినప్పటికీ లాఠీచార్జి చేయకుండా. శాంతియుతంగానే సమస్యను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లామని స్పష్టం చేశారు.

దిలావర్పూర్ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, రైతులు,సమీప గ్రామాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,ఫ్యాక్టరీ పనులను ఆపివేస్తామని ప్రకటించడం హర్షనీయమని ఎస్పీ జానకీషర్మిల పేర్కొన్నారు.

ఇప్పటికైనా ఆయా గ్రామాల ప్రజలు సంయమనం పాటించి, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆమె కోరారు.

ప్రస్తుతం పరిస్థితులు ప్రశాంతంగా ఉన్నది కాబట్టి ఎవరూ ఏ రకమైన అసత్య వదంతులను నమ్మి చట్ట వ్యతిరేక చర్యలు చేయవద్దని ఎస్పి గ్రామస్తులకు విన్నవించారు

# ఉద్యమకారుల మహా పాదయాత్రకు తరలిన హుజూరాబాద్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారులు

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి - తెలంగాణ ఉద్యమకారుల ఫోరం



జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 27 : కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల పాదయాత్ర కరీంనగర్ నుండి వేములవాడకు ప్రారంభించడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ యాత్ర జరుగుతుంది., గత బిఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం పది సంవత్సరాలు ఉద్యమకారులను గుర్తించలేదు. కెసిఆర్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు తీరని అన్యాయం చేసింది.,ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలము ప్రకటించడంతో ఈ ప్రభుత్వానికి ఉద్యమకారులు తమ వంతు అభినందనలు తెలుపుతూ వేములవాడ రాజేశ్వర స్వామివారికి మొక్కు తీర్చుకొనుటకు పాదయాత్ర చేయడం జరుగుతుందని ఉద్యమకారుల ఫోరం నాయకులు తెలిపారు.,ఈ పాద యాత్రతో కరీంనగర్ రోడ్లన్నీ ఉద్యమకారులతో నిండిపోయినాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు ఓరుగంటి ఆనంద్ జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి రాష్ట్ర యువజన కో కన్వీనర్ అన్నం ప్రవీణ్,రాష్ట్ర నాయకులు పత్తి వేణుగోపాల్ రెడ్డి, నియోజకవర్గం అధ్యక్షులు ఊకంటి మల్లాచారి,కండె మహేందర్,నీల నాగరాజు, అక్కపల్లి నవీన్,కనవేణి సతీష్, సంపత్,రాజబాబు,మల్లేష్,మూడేళ్ళ కుమారస్వామి, అఫ్జల్, రాజిరెడ్డి జిల్లా వ్యాప్తంగా 1000 మందికి పైగా ఉద్యమకారులు పాల్గొన్నారు.

# వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకి వారానికి రెండుసార్లు ఫోన్ చేసి ఫాలో అప్ చేయాలి

## ప్రభుత్వ పాఠశాలల పని తీరుపై సమీక్షించిన జిల్లా కలెక్టర్




ఖమ్మం ప్రతినిధి నవంబర్ 27 (ప్రజాబలం) ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులు పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయు లు పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి పాఠశాలల హెడ్ మాస్టర్ లు, ఎం.ఈ.ఓ. లతో సమీక్షించారు పాఠశాలలో సబ్జెక్టు టీచర్లు ఖాళీలు ఏర్పడ్డాయా, విద్యార్థుల హాజరు, పేరెంట్ టీచర్స్ మీటింగ్, నాలెడ్జ్ బుక్ లెట్, మిడ్ డే మిల్, సైన్స్ ఫెయిర్, న్యూట్రీ గార్డెన్, 10వ తరగతి పరీక్షలు, తదితర అంశాలపై మండలాల వారీగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో 10వ తరగతి పరీక్షలు చాలా కీలకమని, ఇక్కడ ఫెయిల్ అయిన విద్యార్థులు చదువు నిలిపి వేసే ప్రమాదం ఉందని, కావున వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వారం రోజులలో బాగా చదివే పిల్లలు ఏ కేటగిరి, యావరేజ్ పిల్లలను బీ కేటగిరీ, ఫెయిల్ అవుతారు అనుకునే పిల్లలను సి కేటగిరీ గా విభజించాలని అన్నారు బీ క్యాటగిరి పిల్లలు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారు పరిశీలించి, అందులో వారికి అవసరమైన అదనపు శిక్షణ అందించాలని అన్నారు సి కేటగిరీ పిల్లలకు ముఖ్యమైన పాఠ్యాంశాలు అనేకసార్లు బోధిస్తూ పాస్ అయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని అన్నారు. ప్రతి క్యాటగిరి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ హెడ్ మాస్టర్ లకు సూచించారు డిసెంబర్ చివరి నాటికి సిలబస్ పూర్తి చేయాలని అన్నారు. విద్యార్థులకు పరీక్షలు



అలవాటు అయ్యే విధంగా వీలైనంత వరకు ఎక్కువ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. సీ కేటగిరీ విద్యార్థులకు ఇప్పటి నుంచి గతంలో పరీక్షలలో అనేకమార్లు వచ్చిన ప్రశ్నలు, పాఠ్యాంశాలు బోధిస్తూ వారానికి రెండు రోజులు పరీక్షలు పెట్టాలని అన్నారు చదువులో వెనుకబడిన సి క్యాటగిరి విద్యార్థుల తల్లిదండ్రులకు వారానికి 2 సార్లు ఫోన్ చేస్తూ పిల్లలను ఇంట్లో కూడా కొంత సమయం చదివించాలని చదివే వాతావరణం ఇంట్లో కల్పించాలని నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ చేయాలనీ అన్నారు 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆ సమయంలో వారికి మంచి పౌష్టికాహారం అందించాలని దీనికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి అందజేయాలని కలెక్టర్ తెలిపారు 10వ తరగతి విద్యార్థుల కోసం జనవరి నెలలో ఒక మోటివేషన్ సెషన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయులకు ఏదైనా సలహాలు, సూచనలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని అన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ అందించేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నామని 16 పాఠశాలల్లో అమలు చేశామని అన్నారు 16 పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయని, మిగిలిన ఉన్నత పాఠశాలలో సైతం స్పోకెన్ ఇంగ్లీష్ విద్యార్థులకు నేర్పే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖ ద్వారా వచ్చే మార్పు ఇతర శాఖల ద్వారా సాధ్యం కాదని, మన పై అత్యధిక బాధ్యత ఉంటుందని, దీనినీ పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ డా. శ్రీజ మాట్లాడుతూ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు ఏదైనా కారణం చేత సెలవు లో ఉంటే మండల పరిధిలో డిప్యూటేషన్ విధులు కేటాయించి ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. విద్యార్థుల హాజరు అంశాన్ని ప్రతి వారం మండల విద్యా శాఖ అధికారి రివ్యూ చేయాలని, తక్కువ హాజరు ఉన్న విద్యార్థులపై శ్రద్ధ వహించి ఫాలో అప్ చేయాలని అన్నారు పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటుకు వీలుగా అవసరమైన కూరగాయల మొక్కలు, మెడిసినల్ మొక్కలు గ్రామాలలోని నర్సరీలో పెంచేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు అభ్యాస దీపికలతో పాటు విద్యార్థులకు మరింత సమాచారం అందించేందుకు ఖమ్మం నాలెడ్జ్ బుక్ లెట్ తయారు చేస్తున్నామని, మండలాలలో ఒక్కో సబ్జెక్ట్ నుంచి నిష్ణాతులైన ఉపాధ్యాయుల చే ఈ బుక్లెట్ రూపొందిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం పర్యవేక్షణకు ప్రతిరోజు ఒక్క ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలని, పిల్లల భోజనం నాణ్యత అంశంలో ఎక్కడ రాజీ పడవద్దని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఎం.ఈ.ఓ లు, హెడ్మాస్టర్ లు, తదితరులు పాల్గొన్నారు

# పెద్ద కల్వలలో నిరుద్యోగ విజయోత్సవ సభ

## - ముఖ్యమంత్రి పర్యటనకు సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

పెద్దపల్లి నిరుద్యోగ యువతతో వచ్చే నెల 4న పెద్దపల్లిలో జరుగునున్న విజయోత్సవ సభను ఏర్పాటు చేయాడానికి పెద్ద కల్వలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభ నేపథ్యంలో స్థలాన్ని శుభ్రం చేయాలని, రేపు ఉదయం స్టేజ్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నుంచి బృందం వస్తుందని అన్నారు. డిసెంబర్ 4న పెద్దపెల్లి జిల్లాలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరగనుందని అన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారని, ఈ సభలో గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణకు పెద్ద కల్వలోనే ఖాళీ స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉంటూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసిల్దార్ రాజ్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్ తోపాటు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేనేమీ వణికిపోవడం లేదు.. కేసులకు భయపడటం లేదు..

## ఆర్జీవీ సంచలన వీడియో!

ప్రస్తుతం సినిమా పనిలో బిజీగా ఉండడంతోనే విచారణకు రాలేదని వివరణహైదరాబాద్ తన కోసం ఏపీ పోలీసులు గాలించడంపై వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తాజాగా ఓ సంచలన వీడియో విడుదల చేశారు. పోలీసుల నోటీసులకు తాను ఏడవడం లేదని, వణికిపోవడం లేదని చెప్పారు. తాను సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు ఎవరి మనోభావాలో దెబ్బతీశాయట అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు.తాను పోస్టు పెట్టిన వారికి కాకుండా.. ఇంకెవరో మనోభావాలు దెబ్బతింటే ఈ కేసులు, సెక్షన్లు ఎలా వర్తిస్తాయని ఆర్జీవీ ప్రశ్నించారు. ప్రస్తుతం ఓ మూవీ షూటింగ్లో ఉన్నానని, నిర్మాతకు నష్టం వస్తుందనే విచారణకు రాలేకపోతున్నట్లు ఆయన తెలిపారు. అయితే, తనకు వచ్చిన నోటీసులకు తాను సమాధానం ఇచ్చానని రామ్ గోపాల్ వర్మ గోపాల్ వర్మ చెప్పుకొచ్చారు.

ఇదిలాఉంటే.. సోషల్ మీడియా వేదికగా అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, పవన్ కల్యాణ్పై ఆర్జీవీ అసభ్యకర పోస్టులు పెట్టారంటూ ఏపీలో ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వర్మకు ఒంగోలు పోలీసులు విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. రెండుసార్లు విచారణకు డుమ్మా కొట్టిన ఆర్జీవీని అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. కానీ, ఆయన ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. వర్మ ఇంట్లో లేకపోవడంతో పోలీసులు వెనుతిరిగారు. ప్రస్తుతం ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనుల పర్యవేక్షించిన కలెక్టర్ గౌతమ్



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 27:**రాష్ట్ర ప్రభుత్వం ఐటిఐ కాలేజీలను అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా (స్కిల్లింగ్ సెంటర్లు) తీర్చిదిద్దే దిశగా మేడ్చల్ ఐటిఐ కాలేజీలో నిర్మిస్తున్న అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పరిశీలించారు.

బుధవారం మేడ్చల్ ఐటిఐ కాలేజీలో నిర్మిస్తున్న అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులు పూర్తవ్వాలని ఛీఫ్ ఇంజనీర్ ను కలెక్టరు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఫ్లోరింగ్, సీడింగ్, ఎలక్ట్రిక్ వర్క్స్, విండోస్, పార్టిషన్ వంటి నిర్మాణ పనులు పూర్తవ్వడానికి ఇంకా ఎంత సమయం పడుతుందని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తవ్వాలని కలెక్టరు ఆదేశించారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ లలో 6 ట్రేడింగ్ విభాగాలకు గాను గదులను నిర్మించి మిషినరీ స్థాపించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎలివేషన్, స్లాబ్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్, మేడ్చల్ తహసీల్దారు శైలజ, మున్సిపల్ కమీషనర్ నాగిరెడ్డి, ఎంపిడిఓ సంపూర్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## TRS (D) ప్రజాసంకల్ప పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

### రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ




**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి నవంబర్ 27 (ప్రజాబలం)** తెలంగాణ రక్షణ సమితి ప్రజా సంకల్ప పాదయాత్ర పోస్టర్ ను రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ ఆవిష్కరించారు ప్రజా సంకల్ప పాదయాత్ర ముఖ్య ఉద్దేశం నిరుద్యోగ యువతి యువకులను కలవడం, రైతులను, కౌలు రైతులను కలవడం, రైతు రుణమాఫీ రైతుబంధు, రైతు భరోసా విషయంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే విధంగా ప్రజాసంకల్ప పాదయాత్ర జరుగుతుంది తెలంగాణలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించే విధంగా అక్రమాలను ప్రశ్నించే విధంగా, 35 లక్షల మంది నిరుద్యోగులకు జరిగిన అవినీతిని ప్రశ్నించే విధంగా అవ్వ తాతలకు పెన్షన్ సరైన విధానంలో రాకపోయే విధానం గురించి ప్రశ్నించే విధంగా ప్రజాసంకల్ప పాదయాత్ర కొనసాగుతుంది ప్రజా సంకల్ప పాదయాత్ర జనవరి 17న ప్రారంభమై ఆగస్టు 17వ తేదీన ముగుస్తుంది. జనవరి 17వ తేదీన భద్రాచలంలో ప్రారంభమై ఆగస్టు 16వ తేదీన హైదరాబాద్ చిలుకూరి బాలాజీ దేవాలయం వద్ద ముగుస్తుంది. చెరుకూరి బాలాజీ దేవాలయం వద్ద పూజలు ముగిసిన తర్వాత ఎల్బీనగర్ లో ఆగస్టు 17వ తేదీన భారీ బహిరంగ సభ ఉంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలతో ఏర్పడిన తెలంగాణ ఎడారి తెలంగాణగా బానిస తెలంగాణగా మారిపోయింది రైతులకు న్యాయం జరగలేదు నిరుద్యోగులకు న్యాయం జరగలేదు, అవ్వ తాతలకు న్యాయం జరగలేదు, మహిళలకు న్యాయం జరగలేదు, సబ్బండ వర్గాలు ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ అగ్రవర్ణ పేదలకు తెలంగాణలో న్యాయము జరగక అనేక ఇబ్బందులు పడుతున్నారు ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా 8 నెలల పాటు ప్రజల మధ్యలో ఉంటూ, ప్రజలను కలుస్తూ, ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ, ప్రజల బాధలను తెలుసుకుంటూ ప్రజాసంకల్ప పాదయాత్ర కొనసాగుతుంది ప్రజా సంకల్ప పాదయాత్రలో తెలంగాణ ప్రజల కష్ట నష్టాలను, బాధలను తెలుసుకుంటూ మేనిఫెస్టో రూపొందించడం జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి గాని, చత్తీస్ గడ్ ఎలక్ట్రిసిటీ ఒప్పందంలో గాని, ప్రభుత్వ ఉద్యోగులు ఇతర దేశాలకు పారిపోయి గ్రీన్ కార్డు తెచ్చుకోవడం గానీ, తెలంగాణ సంపద ఆవిరైపోవడం గాని, తెలంగాణ తలసరి ఆదాయం పడిపోవడం గానీ తెలంగాణ మిగులు బడ్జెట్ గా ఉన్న పరిస్థితి నుంచి లోటు బడ్జెట్ గా మారిపోవడం గాని ప్రశ్నిస్తూ ప్రజాసంకల్ప పాదయాత్ర కొనసాగుతుంది ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తూరు శంకర్, మాలోతు సువర్ణ, మల్లు స్వరూప, భూక్యాశిరోమణి తదితరులు పాల్గొన్నారు

# అయ్యప్ప మాలధారులకు అన్నదానం

### 800మంది మాలదారులకు అన్నదానం

### ప్రతి ఏటా 41రోజుల పాటు అన్నదానం




**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 27 (ప్రజాబలం)** ఖమ్మం అయ్యప్ప మాలధారులకు ధర్మశాస్త్ర అన్నదాన ట్రస్ట్ ఆద్వర్యంలో గత 28రోజులుగా గణంగా అన్నదానం కార్యక్రమంనిర్వహిస్తున్నారు 2012 లో మొదలైన ఈ ట్రస్ట్ ప్రతి ఏటా మాలధారులకు 41రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ట్రస్ట్ సభ్యులు దుదిపాళ్ల ఉపేందర్ బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం పీఠం లో ట్రస్ట్ చైర్మన్ మేకల హనుమంతరావు అధ్వర్యంలో హరి అయ్యగారు ప్రత్యక పూజలు నిర్వహించి ఈ అన్నదానం కార్యక్రమం ను ప్రారంభించారు ఈ అన్నదానం కార్యక్రమంలో సుమారు 800మండి మాలధారులు భిక్ష చేశారుఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మేకల హనుమంతరావు ట్రస్ట్ సభ్యులు అట్లూరి మధు పుల్లంరాజు దుదిపాళ్ల ఉపేందర్, దైవభక్తిని కిషోర్ సరిపుడి నాగేశ్వరరావు రవీందర్ నాగరాజు దర్గా తదితరులు పాల్గొన్నారు

### అతిపెద్ద దొంగ జగన్ మోహన్ రెడ్డి

### ఆనం వెంకటరమణా రెడ్డి

నెల్లూరు భారతదేశంలోనే అతిపెద్ద గజదొంగ జగన్ రెడ్డి అని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్బీఐ ఏజెన్సీ చెప్పింది. ఏకంగా రూ.1750 కోట్ల లంచాలు డైరెక్ట్ గా జగన్ రెడ్డి తీసుకున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఎఫ్బీఐ చెప్పిందని టీడీపీ నేత ఆనం వెంకటరమణా రెడ్డి ఆరోపించారు.

తమ నుంచి విద్యుత్ కొనుగోలు చేసుకోవాలని సెసి జూన్ 2020లో రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుంది. 18 నెలలు దాటినా, ఏ ఒక్క రాష్ట్రం కూడా విద్యుత్ కొనడానికి ముందుకు రాలేదు. అంత ఎక్కువ ధరకు విద్యుత్ కొనలేం, మాకు మీ కరెంటు వద్దు అంటూ అన్ని రాష్ట్రాలు దండం పెట్టాయి. కానీ ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రమే, మేము కొంటాం అంటూ ముందుకు వచ్చింది. అన్ని రాష్ట్రాలు వద్దు అంటుంటే, జగన్ రెడ్డి మాత్రం మాకు కావాలి అంటూ ఎక్కువ ధరకు విద్యుత్ కొనడానికి ఒప్పుకున్నాడు. ఇది చెప్పింది మేము కాదు, అమెరికా కోర్టని అయన అన్నారు.

జగన్ రెడ్డి ఇక్కడ సిబిఐ కేసులు లాగా పదేళ్ళు, 20 ఏళ్ళు సాగుతాయి అనుకుంటున్నావ్ ఏమో.. అమెరికా కోర్టులు ఏడాది లోపే తేల్చేస్తాయి. జగన్ రెడ్డి, అమెరికా జైల్లో బ్రెడ్డు, జాం మాత్రమే పెడతారు. ఇంటి నుంచి చేపల పులుసు, మటన్ బిర్యానీ తెచ్చుకునే వీలులేదని అయన అన్నారు.

# సమాజానికి చేసే సేవ శాశ్వతంగా నిలిచిపోతుంది జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు విద్యార్థులు క్రమ పద్ధతిన కృషి చేయాలి

### వి.వెంకటాయపాలెం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బోర్వెల్, పైప్ లైన్ ఆర్.ఓ. ప్లాంట్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్




**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 27(ప్రజాబలం)** ఖమ్మం సమాజంలో నలుగురికి ఉపయోగపడే పనులు చేస్తూ సేవలు అందించే వారే శాశ్వతంగా నిలిచిపోతారని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు రఘునాథపాలెం మండలం వి. వెంకటాయ పాలెం గ్రామంలోని జహీర్ అహ్మద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3 లక్షల 50 వేల రూపాయలతో ఏర్పాటు చేసిన బోర్ వెల్, పైప్ లైన్, ఆర్. ఓ.ప్లాంట్ ను, 50 వేల విలువ గల కరెంట్ మోటర్ ను జిల్లా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు కుతుంబాక బసవ నారాయణ కుతుంబాక కోటేశ్వరరావు స్నేహానికి జ్ఞాపకార్థంగా పాఠశాలకు 3 లక్షల 50 వేల విలువచేసే ఆర్.ఓ. ప్లాంట్, బోర్ వెల్, పైప్ లైన్ ను కూతుంబాక మధు, 50 వేల రూపాయల కరెంట్ మోటర్ ను కూరాకుల నాగభూషణం పాఠశాలకు విరాళంగా అందించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల అవసరాలను తీర్చేందుకు ముందుకు వచ్చిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా విద్యార్థుల శ్రేయస్సు గురించి ఆలోచించి వసతులు కల్పించడం సంతోషకరమని అన్నారు పాఠశాలలో అవసరమైన టాయిలెట్లు సైతం రాబోయే రోజులలో పూర్తి చేస్తామని అన్నారు. పాఠశాలకు జహీర్ అహ్మద్ పేరు పెట్టారని, కొంత సమయం గడిచిన తర్వాత మన రంగు, కులం, మతం, ఆస్తి ఎవరు గుర్తు పెట్టుకోరని, సమాజంలో మనం చేసిన సేవే శాశ్వతంగా గుర్తుంటుందని కలెక్టర్ తెలిపారు సమాజం కోసం పనిచేసే వారికి విలువ ఉంటుందని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఎదగడంతో పాటు ఇతరులకు సహాయం చేసే ఆలోచనతో ఉండాలని, మన గ్రామాలను,రాష్ట్రాలను బాగు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు చేయాల్సిన పనులు క్రమ పద్ధతి ప్రకారం పూర్తి చేయాలని అన్నారు విద్యార్థి దశలో పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మన స్నేహితులు కూడా బాగా చదువుకునేలా ప్రోత్సహించాలని, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో చదివితేనే గొప్ప విజయాలు సాధ్యమవుతాయని కలెక్టర్ అన్నారు





అంతకుముందు జిల్లా కలెక్టర్ పాఠశాలలోని లైబ్రరీని పరిశీలించి ఆకర్షణీయంగా, పిల్లలను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూస్ కొరకు గతంలో కలెక్టర్ అందించిన లక్షా 50 వేలతో కొనుగోలు చేసిన స్పోర్ట్స్ డ్రెస్, షూస్ ను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పరిశీలించారు అనంతరం దాతలు కూతుంబాక మధు, కూరాకుల నాగభూషణం ను జిల్లా కలెక్టర్ సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాద్యాయులు, విద్య కమిటీ చైర్ పర్సన్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గోన్నారు

# పోటు ప్రసాద్ కు టియుడబ్ల్యుజె(ఐ జె యు) నివాళి

## నిజమైన కమ్యూనిస్టు వాది పోటు రాంనారాయణ



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 27 (ప్రజాబలం)** ఖమ్మం సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ హఠన్మరణం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టియుడబ్ల్యుజె -ఐజెయు) జిల్లా కమిటి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈమేరకు యూనియన్ ముఖ్య నాయకులు సిపిఐ జిల్లా కార్యాలయంలోని పోటు ప్రసాద్ భౌతకకాయాన్ని సందర్శించి నివాళు లు అర్పించారు. నిజమైన కమ్యూనిస్టు వాది ,నిష్కలంక పోరాట యోధుడు ,ఉద్యమాలకు మార్గదర్శకుడు పోటు ప్రసాద్ అకాల మరణం కలచివేసిందన్నారు అందరిలో తలలోనాలుకలా వ్యవహరించే పోటు ప్రసాద్ అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని టియుడబ్ల్యుజె (ఐజెయు)రాష్ట్ర కార్యదర్శి కె రాంనారాయణ పేర్కొన్నారు. కమ్యూనిస్టు కుటుంబానికి చెందిన పోటు ప్రసాద్ విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్ని అంచలంచెలుగా సిపిఐ జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగారని అన్నారు. జర్నలిస్టు సమస్యలపై ఎప్పుడు కూడా సానుకూలంగా స్పందిస్తూ అండగా ఉండేవారని పేర్కొన్నారునిడారంబరుడు వివాదరహితుడుగా పేరు సంపాదించుకోని రాజకీయాలకు అతీతంగా ఎంతో మంది అభిమానులను తన సొంతం చేసుకున్నారని అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను తు చ తప్పకుండా పాటిస్తూ కార్మిక ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని ఆయన చెప్పారు. నివాళ్ళులు అర్పించిన వారిలో రాంనారాయణతోపాటు టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వర్ రావు జిల్లానాయకులు నల్లజాల వెంకట్రావ్ మైనోద్దీన్ తాళ్ళూరి మురళీ జనార్దనచారి కళ్యాణ్ చెరుకుపల్లి శ్రీనివాస్,గోసుల నాగేశ్వర్ రావు,బుర్రి శ్రీనివాస్ సీనియర్ పాత్రికేయులు శంకేసి శంకర్ రావు,ఎన్ ఎస్ రావు తుమ్మలపల్లి ప్రసాద్ తదితరులు ఉన్నారు

# ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి నిమ్మల సమీక్ష

అమరావతి రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఆయా ప్రాజెక్టుల సిఈలు,ఎస్ఈలు,కాంట్రాక్ట్ ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమానికి ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. సాయి ప్రసాద్,కడ కమిషనర్ రామసుందరరెడ్డి ,ఈఎన్సీ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. డిసెంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి పోలవరం లో పర్యటించి డయా ఫ్రం వాల్,ఈసిఆర్ఎఫ్ డ్యాం పనులు షెడ్యూల్ విడుదలపై రివ్యూ చేసారు. పోలవరం టన్నెల్స్ బ్యాలెన్స్ పనులు మరియు లెఫ్ట్ కెనాల్ పనుల పురోగతిపై సమీక్ష జరిపారు. మంత్రి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి తెలుసుకునేలా వెబ్సైట్ ప్రారంభించి ఎప్పటికప్పుడు వర్క్ అప్డేట్ చేయాలి. హంద్రీ-నీవా వెలిగొండ,చింతలపూడి తదితర ప్రాధాన్య ప్రాజెక్టుల పనుల ఆర్ధిక ఇబ్బందులను అధిగమించి పూర్తి చెయ్యడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సాగు నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేవిధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. సాగునీటి సంఘాలకు డిసెంబర్ 8 వ తేదీన జరిగే ఎన్నికల కోసం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయం చేసుకోవాలి. సాగు నీటి సంఘాల ద్వారా కాలువలు,డ్రైన్స్ వంటి ఇరిగేషన్ పనులలో రైతుల భాగస్వామ్యం ,ప్రాతినిధ్యం లభిస్తుందని అన్నారు.



# ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష భిల్వార్చన.

**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 27 నవంబర్ 2024** మణికొండ కౌన్సిల్ అంతర్గతంగా పుప్పాలగూడలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ కాశీ విశ్వనాథ సమేత నల్లపోచమ్మ దేవాలయ ఆవరణలో కార్తీక మాస ప్రారంభం నుండి ప్రతి రోజు రుద్రాభిషేకం జరుగుతున్న విషయం అందరికీ తెలుసని అర్చకులు బ్రహ్మశ్రీ శాంత్ కుమార్ శర్మ తెలియజేస్తూ మాస శివరాత్రి 29 శుక్రవారం ఆలయ మూడవ వార్షికోత్సవ శుభ తరుణంలో ఉదయం 9 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష భిల్వార్చన కార్యక్రమానికి హాజరై జలము, పంచామృతంలతో పరమేశ్వరుడికి అభిషేకించి శివానుగ్రహం పొందగలరు.

# సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి -టీబీజీకేఎస్ నాయకుల డిమాండ్



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 27** :సింగరేణి సంస్థలో పనిచేసి మెడికల్ అన్ ఫిట్ కార్మికులు, రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టిబిజికేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం టి.బి.జి.కె.ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణిలో పనిచేసి 2021 జులై తర్వాత రిటైర్డ్ అయిన కార్మికుల కు 11వ వేజ్ బోర్డ్ ద్వారా చెల్లించవలసిన పెన్షన్ వెంటనే అమలు చేయాలన్నారు. గోదావరిఖనిలోని సీఎం పీఎఫ్ కార్యాలయం పరిధిలో ఐదువేల మంది రిటైర్మెంట్ కార్మికులు ఉన్నారని కొత్త పెన్షన్ పొందక పాత పెన్షన్ ఇవ్వడం వలన చాలీచాలని పింఛన్ తో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రిటైర్మెంట్ అయిన కార్మికులకు అంబికా దర్బార్ బత్తి సంస్థలో 15 సంవత్సరాలు పని చేసిన కార్మికులకు 150 గజాల ఇల్లు స్థలాన్ని ఇస్తున్నారని అదేవిధంగా సింగరేణిలో కూడా 36 సంవత్సరాలు కష్టపడ్డా రిటైర్డ్ కార్మికులకు రెండు గుంటల జాగా గాని లేదా కాలిక్వాటర్స్ కానీ ఇవ్వాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల గురించి యూనియన్ నాయకులకు ఎన్నిసార్లు మా సమస్యలను విన్నవించుకున్న పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యూనియన్ నాయకులు చొరవ తీసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో గెలిచిన యూనియన్ కార్యాలయల ముందు ధర్నాలు చేయుటకు వెనకాడ బొమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ చెన్నూరు నియోజవర్గ సీనియర్ నాయకులు డాక్టర్ రాజా రమేష్, మందమర్రి పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జె. రవీందర్, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఓ.రాజశేఖర్, బిఆర్ఎస్ పార్టి సీనియర్ నాయకులు బండారు సూరిబాబు, తిరుపతి రెడ్డి, బోరిగం వెంకటేష్ , ఎండి అబ్బాస్, బర్ల సదానందం, మేడిపల్లి మల్లేష్, పల్లె నర్సింగ్, భూపెల్లి కనకయ్య, కొండలరావు, చేకొండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ నీరు, ఎత్తు పల్లాల రహదారికి మరమ్మత్తులు.





రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 27 నవంబర్ 2024 భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ నాయకులు ఈ మధ్యన తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా స్థానిక ప్రజలు తమ తమ అభిప్రాయాలను, ఎదుర్కుంటున్న కష్ట నష్టాలను స్వేచ్ఛగా వ్యక్త పరుస్తున్న దరిమిలా కొంతమంది భక్తులూ భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకుడు బుద్దోల్ బాబును కలసి సాయిరాం కాలనీలోని ఆంజనేయ స్వామి దేవాలయం పైప్ లైన్ కూడలిలో ఎత్తు పల్లాల రహదారి, డ్రైనేజీ నీటితో ఆలయానికి రాక పోకలకు తీవ్ర ఇబ్బంది కలుగు తున్నదని తెలిపిన వెంటనే శ్రమ దానంతో కూడిన స్వంత నిధులు రాఘవ రెడ్డి, శ్రీనివాస్ చారి, రవీందర్ రెడ్డి, రాజు, భాషా, తుకారాంల సహకారంతో వెచ్చించి ప్రజా సౌకర్యార్థం మరమ్మత్తులు గావించినాడు, కార్య క్రమంలో అందె లక్ష్మణ్ రావు, యాలాల కిరణ్, బోడ్డు శ్రీధర్, భాను, స్థానిక ప్రజలు తది తరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కోరిన ఎంపీ వంశీకృష్ణ



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 27** :తెలంగాణ రాష్ట్రంలోని భక్తులకు తిరుపతిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కలిసి కోరారు.

బుధవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలిసి భేటీ అనంతరం తెలంగాణ భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానంలో మరింత మెరుగైన దర్శన సౌకర్యాలు కల్పించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, తిరుమలకి తెలంగాణ నుండి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని, వారి దర్శనం కోసం ప్రత్యేక కేటాయింపులు, సదుపాయాలు అవసరమని సూచించారు. భక్తులకు వెయ్యి నెంబర్ల కోటాను పెంచడం, ప్రత్యేక దర్శనం టోకెన్లు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయంలో సహకరించి, భక్తుల సౌకర్యం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారని చెప్పారు.

# మహబూబ్ నగర్ రైతు విజయోత్సవ సభను విజయవంతం చేద్దాం

## - కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మెదక్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి



**మెదక్ ప్రజాబలం ప్రతినిధి:** ఈనెల 29 30 తేదీలలో మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు విజయోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మెదక్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి పార్టీ శ్రేణులను, రైతులను కోరారు. బుధవారం కొత్తపల్లి సొసైటీ హాలు లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రైతులకు పెద్దపీట వేస్తూ బాసటగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించింది అన్నారు. సాంకేతిక కారణాలతో ఆగిపోయిన మిగతా రైతుల రుణమాఫీ త్వరలో మాఫీ అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి బడ్జెట్లోనే 72,000 కోట్లు కేటాయించి ఇటు తెలంగాణ, అటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో వ్యవసాయానికి అత్యధిక బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వంగా ఈ ప్రభుత్వం నిలిచిందన్నారు. గత యాసంగిలో రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందని ఆ తర్వాత పంటకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత డిసెంబర్లో రైతు భరోసా కొనసాగుతుందన్నారు. ఉగాది నుంచి రేషన్ లో సన్నబియ్యం ఇస్తామని మంత్రి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర రైతాంగం పై ప్రత్యేక దృష్టి సాధిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మహబూబ్నగర్ రైతు విజయోత్సవ సభకు మెదక్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవవింద్ నాయక్, సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్ గుప్తా, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి , మైనారిటీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆఫీస్ మోల్ సబ్, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి సందీప్ రమేష్ గౌడ్ ముజీభ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సర్వే వివరాలను ఆన్ లైన్ లో నమోదు

## ఏలాంటి తప్పులు జరిగిన ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లదే పూర్తి బాధ్యత



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**

**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 27**:రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ మరియు కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) వివరాలను ఆన్ లైన్ లో అప్ లోడింగ్ చేస్తున్న ఆపరేటర్ పక్కన అందుబాటులో లేని ఇద్దరు ఎన్యుమరేటర్లను వెంటనే సస్పెండ్ చేయాలని మున్సిపల్ కమీషనర్ ను మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం ఆదేశించారు.

బుధవారం మేడ్చెల్ మున్సిపాలటీలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే వివరాల ఆన్ లైన్ అప్ లోడింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టరు తనిఖీ చేసారు. ఈ ప్రక్రియలో ఎన్యుమరేటర్లు లేకుండా సర్వే వివరాలను అప్ లోడ్ చేస్తున్న ఆపరేటర్లను గమనించిన కలెక్టరు ఎన్యుమరేటర్లు ఎక్కడ అని అడిగి, అందుబాటులో లేని ఎన్యుమరేటర్లను వెంటనే సస్పెండ్ చేయాలని మేడ్చెల్ మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేలో ఎలాంటి పొరపాటును కూడా సహించేది లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎంతో బాధ్యతగా నిర్వహించాల్సిన విధుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన చర్యలు తీవ్రంగా ఉంటాయని కలెక్టరు హెచ్చరించారు. ఆపరేటర్లు కేవలం అన్ లైన్ లో ఆప్ లోడ్ చేయడం వరకే వారి బాధ్యతని, ఏలాంటి తప్పులు జరిగిన ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లదే పూర్తి బాధ్యతని కలెక్టరు స్పష్టం చేసారు. ఎన్యుమరేటర్లు ప్రక్కన ఉన్నంత సేపు మాత్రమే ఆపరేటర్లు సర్వే వివరాలు అప్ లోడ్ చేయాలని కలెక్టరు సూచించారు. సమయం వృధా కాకుండా ఎన్యుమరేటర్లు, ఆపరేటర్లు ఒకే సమయంలో భోజనం చేయాలని తెలిపారు. సూపర్ వైజర్లు దగ్గరుండి ఎన్యుమరేటర్లు, ఆపరేటర్ల పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. తప్పులు లేకుండా సర్వే వివరాలను నిర్దేశిత సమయంలో ఆన్ లైన్ లో అప్లోడ్ చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టరు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మేడ్చెల్ తహసీల్దారు శైలజ, మున్సిపల్ కమీషనర్ నాగిరెడ్డి, ఎంపిడిఓ సంపూర్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి.

## వరంగల్ డి ఎం హెచ్ ఓ.బి.సాంబశివరావు.

వరంగల్ ప్రతినిధి. మండల పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యులు నాణ్యమైన వైద్యాన్ని అందించి వారి మన్ననలను పొందాలని వరంగల్ జిల్లా డీఎంహెచ్ఓ డి సాంబశివరావు అన్నారు. వరంగల్ జిల్లాలోని ఖానాపురం చెన్నారావుపేట మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు అనంతరం వారికి తగు విధమైన సూచనలు అందించారు. సాధారణంగా చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలు ముక్కు కారడము, అస్తమ, శ్వాస కోస వ్యాధులు, హార్ట్ ఎటాక్స్ ,చర్మ సంబంధిత వ్యాధులు మొదలగునవి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిన్న పిల్లలకు, వృద్ధులకు షెటర్స్, గ్లౌజెస్ ,దుప్పట్లు నిండుగా కప్పుకొని చలికి గురి కాకుండా ఉండాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలన్నారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని తెలిపారురు.

# శేరిలింగంపల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

రంగారెడ్డి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు 173 చెక్కులను బుధవారం శేర్లింగంపల్లి ఎమ్మెల్యే పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ కార్యాలయంలో కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, మియాపూర్ కార్పోరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ వివేకానంద నగర్ ,హైదర్ నగర్, కూకట్పల్లి డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు ఈరోజు షాది ముబారక్ కళ్యాణ్ లక్ష్మి చెక్కులను అందజేయడం జరిగిందని తెలిపారు,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా సంక్షేమానికి రేవంత్ రెడ్డి గారు పెద్దపీట వేశారని తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com